TPLA130B170

A

శ్రీ వేమన గ్రంథాలయము
తేలప్రోలు (కృష్ణా)

నవ్యసాహిత్యమాల ౧౧

సౌవియట్ రష్యాలో—

మొదటి భాగం

గ్రంథకర్త :
కొత్తపల్లి సుబ్బరామయ్య, ఎం.ఏ., ఎల్.టి.

1941

నవ్యసాహిత్యమాల
అనంతపురం

ప్రథమ ముద్రణము సెప్టెంబరు 1941

సంపాదకులు :

తరిమల నాగిరెడ్డి, బి.ఎ.,

విద్వాన్ విశ్వం

వెల రూ 0—6—0

[అన్నిహక్కులూ గ్రంథకర్తవే]

లక్ష్మీ.పవర్ ప్రెస్, తెనాలి.

శ్రీ వేమన గ్రంథాలయము
తేలప్రోలు (కృష్ణా)

తొలిపలుకు

నవ్యసాహిత్యమాల 1938 లో ప్రారంభించింది తనకార్యక్రమాన్ని. హిందూ విశ్వవిద్యాలయంలో చదువుకొనే రోజుల్లో నాగిరెడ్డి, రాజశేఖరు, నేను యింటికి తిరుగ వచ్చినతర్వాత అవిచేద్దాం! యివిచేద్దాం! అని అనుకుంటుండేవాళ్ళం. శ్రీ కాళీపట్నపు కొండయ్యగారు, అడప తడప వారి సద్భావాలతో మా ఊహలకు దోహదమిచ్చేవారు. విద్యపూర్తియై మాతృదేశానికి మరలివచ్చిన తర్వాత ఉదరపోషణ ఘోరణిలోబడ్డాను నేను. నాగిరెడ్డి యింకా విద్య పూర్తిగాకున్నా, మొదటినుంచి విశ్వంతోపాటు నవ్యసాహిత్యమాల అభివృద్ధికి పాటుపడుతూనే ఉన్నాడు. వారిద్దరే నవ్య సాహిత్యమాల సంపాదకులు. నాగిరెడ్డికి నాకు గల స్నేహం—ప్రేమ యీ రెండే నన్ను నవ్యసాహిత్యమాల సేవకు ప్రోత్సహించినవి. 'యుద్ధంవల్ల కలిగే ఆర్థిక ఫలితాలు' అన్న పేరుతో చిన్నపుస్తకాన్ని ప్రచురించినందుకు సంపాదకులిద్దరికి చెరి 18 మాసాలు శిక్ష విధింపబడినది. నవ్యసాహిత్య మాల కార్యక్రమం ఆగిపోయింది. అంతకుతోడు మా రాజశేఖర్ అదృశ్యు డవడంచేత మరెవ్వరూ కనబడలేదు నవ్యసాహిత్యమాలను నడపుటకు. ఆ భారాన్ని నాఅంతట నేనేవహించాను.

'ఏటా నాలుగు పుస్తకాలు—చందా రెండురూపాయలు' అన్న ఆశయంతో కొంతకాలం పనిజేసింది నవ్యసాహిత్యమాల. కానీ, సభ్యులను చేర్చడం, రుసుము వసూలుచేయడం, వారికి సమయానికి పుస్తకాల నందించడం కష్టసాధ్యమైంది. ఇప్పటికి నాలుగోసంవత్సర పడిని పూర్తిచేస్తూంది—నవ్యసాహిత్యమాల. అయినాగూడా, యిప్పటికి యే 10 పుస్తకాలుమాత్రమో ప్రచురింపగలిగామంటే—వీనిలో నాలుగు చాలా చిన్నపుస్తకాలు—సిగ్గుపడవలసిన విషయం. ఆంధ్రలోకానికి మా సోదరులు ముంగండవారు చేసినంత సేవను మేము చేయలేకపోయినందుకు చింతించుచున్నాం. అనుభవం మీదగాని మా లోటుపాట్లు గ్రహించలేకపోయాం. పుస్తకాల ధర లెక్కువపెట్టడం, ఒక గ్రంథకర్తచేత పెక్కు గ్రంథాలు వ్రాయించడం మొదలైన పొరపాట్లు అనుభవానికి వచ్చినవిప్పటికి. ఇక సరి దిద్దుకుంటాం. ఆంధ్రపాఠకలోకం పూర్వంకంటే యికముందు మా కెక్కువగా ప్రోత్సాహమిస్తుందని ఆశిస్తున్నాం.

స్వవిషయం:— ఈ గ్రంథరచనలో స్వతంత్రత చాలా తక్కువ. కొంతవరకు యీ గ్రంథం అనువాదమనే చెప్పాలి. చాలవరకు అనుసరణయన వచ్చు. అయినాగూడా గ్రంథకర్త అని నేను పేరుపెట్టుకున్నందుకు సాహసించానని అనుకుంటారేమో ? మూలం ఒక్క గ్రంథం గాకపోవడంచేత, కేవలం అనువాదం అవకపోవడంచేత, అభిప్రాయాలు కొన్ని నావే గనుకను గ్రంథకర్తను నేనేనని వ్రాసుకోక తప్పిందిగాదు. లోపాలన్నీ నావి, సద్గుణగణాలు పెద్దలవి. నా కీ గ్రంథరచనయం దుపయోగపడ్డ గ్రంథాలను పత్రికలను యీ గ్రంథం ఆఖరులో పేర్కొన్నాను.

ప్రస్తుతం జర్మనీ-రష్యాలకు యుద్ధం జరుగుతూ వున్నది. రష్యాను గురించి మనలో చాలామందికి దురాభిప్రాయాలున్నవి. కారణం మనకు రష్యానుగురించిన నిజాన్ని కనుగొనుటకు అవకాశాలు లేకపోవడమే. అట్టి అవకాశాన్ని—గొప్ప అవకాశాన్ని—నవశక్తివారు మూడేండ్లక్రితం కలుగ

జేశారు. కానీ, ఆ అవకాశాన్ని మనలో చాలామంది ఉపయోగించు కున్నట్లు లేదు. రష్యా గడచిన యీ మూడేండ్లలో చాలా మార్పు జెందింది. అందుచేతనే యీ గ్రంథాన్ని మీ కందజేయు ప్రయత్నం. ఇందులో ఫిన్లాండు–రష్యా యుద్ధాన్నిగురించిగాని, జర్మనీ–రష్యా యుద్ధాన్నిగురించిగాని వ్రాయకపోవడానికి కారణం కేవలం రష్యను జాతీయ జీవితాన్ని స్పష్టపరచవలెనన్న కోరిక.

సోవియట్ రష్యానుగురించి వ్రాయడమంటే యీ యుద్ధపురోజుల్లో చాలాకష్టం. నిజాన్ని తెలుసుకోడం యెప్పుడూ కష్టతరమే. అందున యుద్ధపురోజుల్లో మరీ కష్టం. కారణం, యేయుద్ధమారంభమైనా మొదట మరణించేది 'సత్యం' గనుక. సోవియట్ రష్యానుగురించి నవశక్తివారి 'రష్యా సంచిక' కన్నా విపులంగా వ్రాయడానికి, చౌకలో అందించడానికి, నార్లవారి 'నేటి రష్యా' కన్నా క్లుప్తీకరించడానికి సామాన్యులకు వీలుగాదు. అట్లయ్యూ నేనీ ప్రయత్నాని కొడిగట్టినందుకు పాఠకలోకం మన్నించాలి. చదువనేర్చిన ప్రతి ఆంధ్రునకు అర్థమయ్యేటట్లు వ్రాయాలని నా ప్రయత్నం. ఎంతివరకు సఫలమైందో నా ప్రయత్నం మీరే నిర్ణయించాలి. ఏదో, యింతవరకు 'ప్రజాబంధు', 'వాహిని', 'జమీను రయితు'లకు వ్రాస్తుండేవాణ్ణి వ్యాసాలు. గ్రంథరచన కిదే ప్రథమప్రయత్నం. అందుచేత దోషము లెక్కువుండొచ్చు. క్షమింతురుగాక.

ఈ రోజుల్లో ప్రస్తుత యుద్ధం కారణంగా కాగితంధర అపరిమితంగా పెరిగిపోతూంది. ఏరోజు కారోజు హెచ్చడమేగాని ధర తగ్గడం లేకపోతే మానె, నిలకడైనా లేకుండావున్నది. అందుచేతనే యీ పుస్తకం వెల రూ 0–4–0 లకు హెచ్చువుండగూడదని యెంతో ప్రయత్నించిగూడా విఫలులమై వెల రూ 0–6–0 పెట్టవలసివచ్చింది. ఆంధ్రదేశంలో యిటీవల ఆదర్శప్రాయమైన ప్రచురణాలయాలు చాలా యేర్పడ్డవి. వీటన్నిటిలోకి ఆధునిక విజ్ఞానాన్ని ఆంధ్రుల కందజేయ పాటుపడుచున్నవానిలో ముఖ్యమైనవి

'విశ్వసాహిత్యమాల' (ముంగండ) 'ఆదర్శ గ్రంథమండలి' (ఎలమర్రు) 'నవయుగ ప్రచురణాలయం' (పెడనగల్లు) 'జాతీయ గ్రంథమాల' (కాకినాడ) 'నమ్మాళ్వార్స్' (మదరాసు) మొదలైనవి. వీటన్నిటికి కేవలం లాభమే దృష్టికాదు. కొంత సంఘసేవయే వీరి ఆశయం. అట్లుండిగూడా వీరి ప్రచురణలలో కొన్ని లోట్లున్నవి. చక్కని విషయమైతే, కాగితం బైండింగ్ అంత బాగుండవు. కారణం వెల సరసంగా నుండాలెగనుక. గొప్ప విషయం, చక్కని కాగితం, గట్టి బైండింగ్ అన్నీ కూర్చితే వెల యెక్కువబెట్టాలి. వెల యెక్కువైతే కొనేవారేరీ? ఇటీవల నొక మిత్రులు ఆంధ్రదేశంలో గ్రంథవిక్రయాన్నిగురించి వ్రాస్తూ "మేము మూడు నాలు గేండ్లు గడచినా 1,000 ప్రతుల నమ్మలేకున్నాం. ఆంధ్రదేశంలో మేము వెళ్ళని సభలేదు, మా గ్రంథమాలకు యేజెంటులేని జిల్లాలేదు. మా ప్రచుర ణాలన్నీ ఆధునిక వాఙ్మయమునకు సంబంధించినవే. అట్లుండిగూడా ద్వితీయ ముద్రణమునకేవీ యింకా రాలేదంటే మరి గ్రంథప్రచురణగతి గ్రహింపనగు" అని వ్రాశారు.

ఇప్పటికి 5 లేక 6 యేండ్లుగా గ్రంథప్రచురణ—విక్రయాలతో పరి చయంగలవారి అనుభవమిది. ఇక మా అనుభవం చాలా కొద్ది. అందుకనే మా పుస్తకాల వెల యెక్కువ. అంగలో కొన్ని ఉండదగినంత ఉచ్చ దశలో లేవు. ఇకముందు యీ లోటును తొలగించుకోగలమని నమ్మిక. అందుకే మీ ప్రోత్సాహాన్ని ఆశించడం.

నవ్యభారతి,
రేవేంద్రపాడు
10—9—1941.

విధేయుడు,
కొత్తపల్లి సుబ్బరామయ్య.

1. సోవియట్ సంయుక్తరాష్ట్రం

సోవియట్ సంయుక్తరాష్ట్రాన్ని తెలియజేయను సాధారణంగా యు.యస్.యస్.ఆర్. అని పొడిఅక్షరాలువాడుతారు. ఈ పొడిఅక్షరాల విప్పివ్రాస్తే యీ పేరువస్తుంది—సామ్యవాద సోవియట్ ప్రజాస్వామ్యాల సంయుక్తరాష్ట్రం. 1917 నవంబరులో జరిగిన కమ్యూనిస్టు విప్లవానంతరం రష్యాలో 'రష్య'ను సామ్యవాద ఫెడరేటివ్ సోవియట్ ప్రజాస్వామ్యం ఏర్పరుపబడ్డది. రష్యా పొలిమేరల నానుకొనియున్న కొన్ని దేశాలు జాతీయ ప్రజాస్వామ్యాలుగా ఏర్పడి, 1923 లో అవన్నీ 'రష్యను సామ్యవాద ఫెడరేటివ్ సోవియట్ ప్రజాస్వామ్యం'లో చేరినవి. ఈ కలయికచేత ఏర్పడినదే సోవియట్ సంయుక్తరాష్ట్రం. కొన్ని రాష్ట్రాలు కలిసి ఫెడరేషన్లయినవి. అలాంటి కొన్ని ఫెడరేషన్లు కలిసి సోవియట్ సంయుక్తరాష్ట్రమైనది. ఈ విధంగా కలయిక నేర్పరచుకున్న రాష్ట్రాలలో యూకరేన్ ఒకటి. సోవియట్ సంయుక్తరాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రష్యను సా. ఫె. సో. ప్రజాస్వామ్యము, సోవియట్‌లో నొక రాష్ట్రమైనది. సంయుక్తరాష్ట్రాన్ని చేరిన రాష్ట్రాలన్నిటిలోకి రష్యాయే పెద్దది గనుక దాని ప్రాముఖ్యత యెక్కువ. సోవియట్ చరిత్ర చాలవరకు కమ్యూనిజం చరిత్రతో, లెనిన్, స్టాలిన్ల జీవితాలతో సంబంధం గలిగియున్నది.

1923లో అమలులోకి తేబడిన సొవియట్ నిర్మాణచట్టం స్వామికనియంతృత్వంమీద ఆధారపడినది. ఈ చట్టాన్నిబట్టి ప్రాథమిక పరిపాలకసంస్థలు సొవియట్లే.

సొవియట్లంటే సలహాసభలు అని అర్థం. మొదట 1905 లో సొవియట్లు అన్న పేరుతో శ్రామికుల సలహా సభలు ఏర్పడ్డవి. మరల యీ సభలు 1917 నవంబరు విప్లవానంతరం అలవాటులోనికి వచ్చినవి. ఈ సొవియట్‌లు స్థానిక స్వపరిపాలనను, ప్రభుత్వ శాఖలనుగూడా తామే నిర్వహించేవి. గ్రామ సొవియట్లు జిల్లాసొవియట్ల నెన్నుకొనేవి. జిల్లాసొవియట్లు ప్రాంతీయ సొవియట్లను, ప్రాంతీయ సొవియట్లు రాష్ట్రసొవియట్లను యెన్నుకునేవి. ఈ యెన్నికలన్నీ, ఎన్నుకొనబడినవారు తాము ప్రతినిధుల వేరే యెన్నుకొనుటచే నడిచేవేగాని సూటిగా ప్రజలచే యెన్నుకొనబడి నడపబడేవి కావు. సొవియ ట్లన్నిటికి సర్వాధికారి 'అఖిల రష్యను సొవియట్ కాంగ్రెసు'. ఈ కాంగ్రెసు ప్రాథమికసొవియట్‌ల ప్రజలచే యెన్నుకొనబడుచున్నది. శ్రామికులు 25,000 మంది కొక సభ్యుని చొప్పున, రైతులు 1,25,000 మంది కొక సభ్యుని చొప్పున, కాంగ్రెసుకు సభ్యుల నెన్నుకునేవారు. శ్రామికులు రైతులకంటె 5దింత యెక్కువ ఓటింగ్ అధికారం గలిగియుండేవా రన్నమాట. కేంద్రకార్యనిర్వాహక వర్గా న్నొకదానిని యీ కాంగ్రెసు యెన్నుకునేది. కాంగ్రెసు సమావేశాల మధ్యకాలంలో యీ కార్యనిర్వాహకవర్గమే శాసనసభగా నుండేది. ప్రభుత్వాన్ని యేర్పరచేది యీ

కేంద్రకార్యనిర్వాహకవర్గమే. వీరు యేర్పరచే ప్రభుత్వానికి 'ప్రజామంత్రిసభ' అనిగూడా పేరు. పైవిధంగా ప్రభుత్వనిర్మాణాన్ని గలిగి, సోవియట్‌సంయుక్తరాష్ట్రంలో సభ్యులుగానున్న ఫెడరల్ ప్రజాస్వామ్యాలు 7 గలవు.

సోవియట్ నిర్మాణచట్టం 1936 లో మార్చబడినది. సోవియట్ అన్న పేరుమాత్రం మిగిలింది, కానీ యెన్నికవిధానం పూర్తిగా మారిపోయింది. సోవియట్‌కాంగ్రెసు రద్దు చేయబడినది. ఎన్నికలు ప్రతినిధులమూలాన గాకుండా, సూటిగా ప్రజలే యెన్నుకునేవిధానం అమలులోనికి తేబడినది. సోవియట్లన్నీ— పెద్దవిగాని, చిన్నవిగాని— ప్రజల చేతనే యెన్నుకొనబడుచున్నవి. పూర్వం పెద్దసోవియట్లనెన్నుకునే అధికారం చిన్నసోవియట్లకుండేది. ఇప్పుడీయధికారం పోయింది. శాసనసృష్టికి పై అధికారి సోవియట్ సంయుక్తరాష్ట్రంయొక్క సుప్రసిద్ధసభ. ఇతర దేశాలలోని పార్లమెంటులాంటిదీ సభ. ఈ సుప్రసిద్ధసభ శ్రామికులందరిచే యెన్నుకొనబడుతుంది. ఈ నూతన నిర్మాణచట్టాన్ననుసరించి శ్రామికులకు, రైతులకు సమానవోటింగ్‌హక్కు యివ్వబడినది. కొద్దిమంది పూర్వపు ధనికులకు వోటింగ్ హక్కు యివ్వబడలేదు. సుప్రసిద్ధసభలో రెండు భాగాలున్నవి. ఒకటి, సంయుక్తరాష్ట్రసభ. ఈ సభకు 3,00,000 ప్రజలు ఒక సభ్యుని చొప్పున యెన్నుకుంటారు. రెండోది జాతులసభ. ఈ సభకు ప్రతి ప్రజాస్వామ్యంనుంచి 25 మంది సభ్యుల చొప్పున యెన్నుకొనబడుచున్నారు. వీరు గాక యీ

జాతులసభకు, అధినివేశప్రతిపత్తి గల జాతులు తమ దేశాల తరఫున ప్రతినిధుల నంపుచున్నారు. సోవియట్ సుప్రసిద్ధసభ అధ్యక్షసభ నొకదానిని యెన్నుకుంటుంది. ఈ అధ్యక్షసభలో 15 మంది సభ్యు లుంటారు. అధ్యక్షుడితో 16గు రౌతారు. ప్రతి ప్రజాస్వామ్యం ఒక సభ్యుణ్ణి యెన్నుకుంటుంది యీ సభకు. ప్రజలమంత్రిసభనుగూడా సుప్రసిద్ధసభే యెన్నుకుంటుంది. ఈ మంత్రిసభ సుప్రసిద్ధసభకు బాధ్యురాలు. ప్రజామంత్రిసభఅధ్యక్షుడు—అనగా ప్రధానమంత్రి— ప్రస్తుతం వి. యమ్. మాలటోవ్. పూర్వం 7 ఫెడరల్ ప్రజాస్వామ్యాలే సోవియట్‌లో చేరియుండేవి. ఇప్పుడు యీ ఫెడరల్ ప్రజాస్వామ్యాలసంఖ్య 15. ఈ 15 ఫెడరల్ ప్రజాస్వామ్యాలు, (1) అధినివేశప్రతిపత్తిగల జాతీయప్రజాస్వామ్యాలుగా, (2) అధినివేశప్రతిపత్తి గల పరగణాలుగా విభజింపబడ్డవి.

ఇన్ని విభజనలు చేయబడుటకు కారణం సోవియట్ సంయుక్తరాష్ట్రంలోని 180 రకాల ప్రజలకు స్వయం పరిపాలనావిధానాన్ని సమకూర్చవలయునన్న ఆశయమే. 15 ఫెడరల్ ప్రజాస్వామ్యాలు* వాటి ముఖ్యపట్టణాలు, జనాభా యీ క్రింద వివరింపబడ్డవి :—

* కొందరు వీటి సంఖ్య .16 అంటారు. అధినివేశ ప్రతిపత్తిగల రాష్ట్ర మొకదానిని చేర్చుకుంటున్నారు.

రిపబ్లిక్.	ముఖ్యపట్టణం.	జనాభా.
1. రష్యా	మాస్కో	11, 20, 00, 000
2. యూక్రేన్	కీవ్	4, 20, 00, 000
3. తెల్లరష్యా (బైలోరష్యా)	మిన్స్కు	90, 00, 000
4. అర్మీనియా	ఇరవాన్	10, 00, 000
5. జార్జియా	ట్బిలిసి	30, 00, 000
6. అజర్బైయిద్ జాన్	బాకూ	30, 00, 000
7. ఉజ్బెకిస్థాన్	టాష్కెన్ట్	50, 00, 000
8. కజాక్ స్థాన్	ఆల్మా-అటా	70, 00, 000
9. తుర్కుమెనిస్థాన్	అష్ఖాబాద్	10, 00, 000
10. తజీకిస్థాన్	స్టాలినాబాద్	10, 00, 000
11. కిర్గీజియా	ఫ్రన్జ్	10, 00, 000
12. లిథుయానియా	విల్నా	20, 00, 000
13. లట్వియా	రిగా	20, 00, 000
14. ఇస్థోనియా	టలిన్	10, 00, 000
15. మల్దేవియా	—	30, 00, 000

ఈ ఫెడరల్ ప్రజాస్వామ్యాలు 15 లోని ప్రధాన భాషలు సోవియట్ సంయుక్తరాష్ట్రమందంతట గుర్తింపబడ్డ అధికారభాషలే. అనుభవాన్నిబట్టి రష్యను ఫెడరల్ ప్రజాస్వామ్యమే యెక్కువ ప్రాధాన్యతను పొందుచున్నదని చెప్పాలి. రష్యను ఫెడరల్ ప్రజాస్వామ్యానికి చేరిన ప్రజాస్వామ్యాల్లో చిన్నదొకటుంది. దీని పేరు వోల్గా—జర్మను ప్రజాస్వామ్యం. దీని జనాభా 6, 00, 000. సోవియట్ సంయుక్తరాష్ట్రంలో మొత్తం రష్యనుల సంఖ్య 8,50,00,000.

రాజకీయంగా వారికి ప్రాధాన్యత వున్నది-వుంటుందిగూడాను. ఫెడరల్ ప్రజాస్వామ్యాలు, అమెరికావలెగాక, తమ యిష్ట ప్రకారం సంయుక్తరాష్ట్రంనుంచి విడివడవచ్చు.

సావియట్‌లో పార్టీలు లేవు. ఒకవిధంగా ఒకేపార్టీ—కమ్యూనిస్టుపార్టీ—వుందనిచెప్పాలి. కమ్యూనిస్టుపార్టీ సభ్యులు కానివారుగూడా యెన్నికలకు నిలవవచ్చు అభ్యర్థులుగా. స్టాలిన్ రష్యను కమ్యూనిస్ట్‌పార్టీ సాధారణ కార్యదర్శి. ఇతనిని నియంత అంటారేగాని యితర నియంతలకున్న సర్వాధికార మితనికి లేదు. పార్టీని యితను వొప్పించగలిగితే తా ననుకున్నది చేయగలడు. సావియట్‌ప్రభుత్వానికి సాయపడే సి. ఐ. డి. శాఖకు జి. పి. యు. అనిపేరు. ఎఱ్ఱసైన్యాన్ని తయారుచేయడానికి, సిద్ధపరచడానికి చాలా జాగ్రత్త తీసుకున్నది సావియట్‌ప్రభుత్వం.

సావియట్‌సంయుక్తరాష్ట్ర ఆర్థికవిధానం సామ్యవాద సిద్ధాంతాలపై నిర్మింపబడినది. పరిశ్రమలు, రాకపోకల మార్గాలు ప్రభుత్వం సొమ్మే. ఆర్థికవిధాన మంతా 'గాస్ ప్లాన్' అని పిలువబడు నిర్ణయ కమీషను సలహాల ప్రకారం నడపబడుచున్నది. ఈ కార్యక్రమ మంతా సుప్రసిద్ధ సావియట్‌చే నామోదింపబడవలెను. వ్యవసాయం, వ్యక్తులచేగాక సమిష్టివ్యవసాయక్షేత్రాలచే సాగింపబడుచున్నది. కానీ రైతులు సొంతానికి యింటిని, ఒకటిరెండుయెకరాల భూమిని, ఒకటి రెండు పశువులను కలిగియుండవచ్చు. సమిష్టిభూమిలో—పశువులలో వాళ్ళభాగం వాళ్ళ కుంటుంది.

ప్రపంచంలోని ముఖ్యమైన యితర దేశాలతో సోవియట్‌రష్యాకు యీ 24 యేండ్లుగా గల్గిన పరస్పరసంబంధాలను, కాలనిర్ణయాన్నిబట్టి, 4 భాగాలుగా విభజింపవచ్చు.

(1) సంపూర్ణఅజ్ఞాతవాసకాలం, 1917—22 వరకు.

(2) జర్మనీతో సహకారకాలం (రపెల్లోసంధి యప్పటి నుండి) 1922—33వరకు. ఈ సమయంలో సోవియట్, ఇతరుల ప్రోత్సాహాన ఫ్రాన్సు తనపై దండెత్తుతుందేమోనని చాల భయపడ్డది.

(3) ప్రజాప్రభుత్వాలతో సహకారకాలం 1934—39. జర్మనీలో హిట్లరు అధికారానికి వచ్చినతర్వాత, హిట్లరుకు బాల్షివిజంపట్ల గల ద్వేషాన్నిబట్టి జర్మనీ తనపై దండెత్తుతుందేమోనని రష్యా భయపడవలసివచ్చింది. ఈ కాలంలోనే సోవియట్ నానాజాతిసమితిని చేరింది. ఫ్రాన్సు, జెకొస్లొవేకియాలతో సంధులు, అతి జాగ్రత్తగా కుదుర్చుకుంది. జపాను చైనామీద దాడిసల్పి కొంత భాగాన్ని ఆక్రమించడంమూలాన, బాల్షివిక్—విరోధసంధిని జపాను చేరడంమూలాన రష్యాజపానులకు వైషమ్య మారంభమైంది. జపానుకు విరుద్ధంగా, సోవియట్ చైనాకు సాయపడుచున్నది.

(4) ఇటీవల జరిగిన విషయాలను నాల్గవ భాగంగా పాటింపవచ్చు. 23-8-1939 న సోవియట్ జర్మనీతో అనాక్రమణసంధి చేసుకోడంమూలాన యీ రెండు దేశాలకు కొంత సహకారం గల్గింది. పోలండును జర్మనీ కబళిస్తుంటే

స్వయంరక్షణార్థం సోవియట్ పోలండులోని కొంత భాగాన్ని తా నాక్రమించవలసివచ్చింది. జర్మనీ ఆక్రమణకి గనుక నోరెత్తలేకపోయింది. రహస్యరాజకీయవిధానంలో రష్యా తాటస్థ్యంగా నుండడంచేత జర్మనీ ధైర్యంతో యిప్పుడు యూరప్‌లో జరుగుచున్న యుద్ధాన్ని సాగించగలిగింది. దీన్నిబట్టి మిత్రమండలిరాజ్యాలకు రష్యాపట్ల ద్వేషం యెక్కువైనది. తూర్పుయిరోపాలో రష్యా యిచ్చవచ్చినట్లునడుచుకోనిచ్చాడు హిట్లరు. అందుచేతనే సోవియట్ పోలండులోని యూకరేనియన్, తెల్ల రష్యనురాష్ట్రాల వశపరచుకోగలిగింది. ఇస్థోనియా, లట్వియా, లుథుయానియాలు సంపూర్ణంగా, ఫిన్లాండులోని కీలకప్రదేశాల కొన్నింటిని; బెస్సరేబియాను; ఉత్తర బుకొవీనాను వశపరచుకొన్నది సోవియట్. ఈ అనాక్రమణ సంధిమూలానే 20 యేండ్లనా డంతరించిన రష్యనుపలుకుబడి మళ్ళీ బాల్కనురంగంలో ప్రత్యక్షమైంది. ఏలాగైతేనేమి, రష్యా మళ్లీ—జారులనాటివలె—తన ప్రధానస్థానాన్ని—యూరప్‌రాజకీయాల్లో—ఆక్రమించగల్గింది. జపాను-రష్యాల వైషమ్యం; ఉత్తరచైనాలో చాలాభాగంమీద రష్యా యేర్పరచుకొన్న పలుకుబడి (సింకియాంగ్-వెలుపలిమంగోలియాలలో); పర్షియాలో కొత్తగా గలిగిన పలుకుబడి; కొద్దికాలం ఆఫ్గనిస్థానంతో గలిగిన మైత్రి; ఫిన్లాండులో గలిగిన అఖండ విజయం * మొదలైనవాటినిబట్టి సోవియట్‌రష్యా బ్రిటను, అమెరికాలవలె ప్రపంచంలోని పెద్దరాజ్యాల్లో నొకటని చెప్పక తప్పదు.

---

* 3-8-1941 ప్రజాబంధులోని 'ఫిన్లాండుయుద్ధం' చూడవలసినది.

సోవియట్‌రష్యాకు—ఒకజాతిగా—ప్రపంచ కమ్యూనిజానికి గల పరస్పర బాంధవ్యాలను గురించి మూడు భిన్నాభిప్రాయా లున్నవి.—

(1) అనుభవంలో సోవియట్‌రష్యా అంతర్జాతీయ కమ్యూనిజాన్ని జారవిడిచింది. ఇప్పుడు కేవలం జాతీయంగా స్వలాభకర మైనమార్గాల నవలంబించుచున్నది.

(2) ప్రపంచ విప్లవ ప్రయత్నాలు రష్యా మానలేదు. కాస్త అలసట దీర్చుకుంటున్నారు విప్లవకారులు. తగిన సమయం రాగానే ప్రపంచ విప్లవాన్ని స్టాలిన్ నడిపిస్తాడు.

(3) స్టాలిన్ సోవియట్‌లో అధికారంలో నుండగా ప్రపంచ విప్లవం రాదు. * మరొక ప్రభుత్వం — సిసలైన కమ్యూనిస్టుప్రభుత్వం స్టాలిన్‌ను పదభ్రష్టుని జేసి ప్రపంచ విప్లవాన్ని సాగిస్తుంది.

కొందరు రాజకీయవేత్తలు భారతదేశంలో, చైనాలో సామీప్య ప్రాచ్యంలో రష్యా-బ్రిటనులకు విరోధం సహజమని, యీ విరోధం జారులనాటినుండి యున్నదని, యిప్పటికీ యీ విరోధం హెచ్చుతునే వున్నదని, తత్ఫలితమే 23-8-1939 న జరిగిన రష్యా-జర్మనీల అనాక్రమణసంధియని అంటున్నారు. మరికొందరు రాజకీయవేత్తలు, అనాక్రమణ సంధి జరిగినా జర్మనీ-రష్యాలు శతాబ్దాలుగానున్న విరోధం

---

* ఇది ట్రాట్స్కీపార్టీవారి అభిప్రాయం.

మానలేదని, బాల్టిక్, నల్లసముద్ర ప్రాంతాల్లోని యిటీవలి రష్యను చర్యలు, రష్యాకు జర్మనీపట్లగల ద్వేషాన్ని ప్రకటిస్తున్నవని అంటారు. (ప్రస్తుతం జరుగుచున్న రష్యా-జర్మనీ యుద్ధం యీ భావాన్ని స్థిరపరిచింది.) వీటన్నిటికి సొవియట్ ఒక్కటే బదులు చెప్పుచున్నది—తాను కేవలం స్వయంరక్షణదృష్టితోనే ప్రవర్తిస్తున్నానని.

విస్తీర్ణాన్నిబట్టిచూస్తే సొవియట్ ప్రపంచములోని అన్నిదేశాలలోకి పెద్దది. విస్తీర్ణం 82,27,000 చదరపుమైళ్లు. భూమిలోని ఏడవవంతు విస్తీర్ణమిది. జనాభా యిప్పుడు 19,30,00,000. (అమెరికా జనాభా 15,00,00,000) ఈ జనాభాలో ముప్పాతికపాలు వ్యవసాయంమీద ఆధారపడి యున్నారు. మిగత 5,00,00,000 పరిశ్రమలలో పని జేస్తున్నారు. ప్రపంచ జనాభాలో 184, 91, 85, 359—తొమ్మిదోవంతు రష్యా జనాభా. అన్నిరకాలభూములు రష్యాలో నున్నవి—మెట్టలు, మాగాణులు, పర్వత ప్రదేశాలు, బురదనేలలు, యిసుకపర్రలు, రేగటిభూములు, ఎడారులు, అత్యంత విస్తీర్ణంగల సమతల ప్రదేశాలు.

ప్రపంచంలోని కలప సరఫరాలో మూడోవంతు రష్యానుంచే రావడం. ప్రపంచంలోకల్లా గొప్ప మాంగనీస్ గనులు రష్యాలోనే ఉన్నవి. బంగారు ఉత్పత్తిలో దక్షిణాఫ్రికా కాకు పిదప సొవియట్‌దే పేరు. నేలబొగ్గు ఉత్పత్తిలో నాలుగో స్థానం సొవియట్‌దే. ఇనుము, సీసం, తుత్తినాగం గనులు అపారంగా వున్నవి. విద్యుచ్ఛక్తి నుపయోగించడంలో

అమెరికాపిదప దీనిదే ప్రపంచానికి అగ్రస్థానం. అతి ఫలవంత మైన చమురు బుగ్గలను గలిగున్నది—కాకసస్ కొండల్లో. కాస్పియన్ సముద్రమొడ్డుననున్న బాకునగరానికి రష్యా 'చమురు కేంద్రం' అని పేరు. చమురు యెగుమతికిది ముఖ్య పట్టణం. ప్రపంచములో ఉత్పత్తికాబడే ముడి పెట్రోలులో పదోవంతు రష్యా ఉత్పత్తి చేస్తూంది. పెట్రోలు ఉత్పత్తిలో అమెరికా పిదప రష్యాదే పేరు. ప్రపంచం సరఫరా మొత్తంలో సోవియట్ భాగాన్ని యీ క్రిందివిధంగా ఉజ్జాయింపున లెక్కించవచ్చు.

బంగారం	ప్రపంచ ఉత్పత్తిలో సోవియట్ భాగం		1/6 వంతు
నేలబొగ్గు	డిటో		1/8 ,,
ఓకు-కలప	డిటో		1/3 ,,
మాంగనీసు	ప్రపంచంలోకల్లా యెక్కువ ఉత్పత్తిజేసేదేశం సోవియట్.		
బంగాళాదుంపలు	డిటో	డిటో	
గోధుమ	డిటో		1/4 ,,
ఓట్లు	డిటో		1/4 ,,
రై (కాయధాన్యం)	డిటో		1/2 ,,
ఫ్లాక్స్ (ఎల్లగిసెనార)	ప్రపంచంలోకల్లా యెక్కువ ఉత్పత్తిజేసేదేశం.		

అతి సారవంతమైన భూములు; పాశ్చాత్యప్రపంచం లోనికల్లా యీ దేశంలోనే యెక్కువ వ్యవసాయ జనాభా; యూకరేన్‌లోని నల్లరేగటిభూములు గోధుమలను, కాయ ధాన్యాలను అపరిమితంగా పండించగలవు. సోవియట్‌లో ఉత్పత్తియయ్యే మొత్తం నేల బొగ్గులో 100 కి 60 పాళ్ళు,

యినుములో 100 కి 70 పాళ్ళు యూక్రేన్ లోనే లభించు చున్నవి. రసాయన అద్దకపుపరిశ్రమగూడా యూక్రేన్‌లోనే ఉన్నది. అందుకనే హిట్లరు యూక్రేన్ మీద కన్నేశాడు— దండయాత్ర ప్రారంభించాడు. మధ్యఆసియాలోని సోవియట్ భూములలో పత్తి విస్తారంగా పండించబడుతూ వున్నది.

ఇతర ఉత్పత్తిలెఖ్ఖలు

(1937 లోని ఉత్పత్తి)

నేలబొగ్గు	12,26,00,000	మెట్రిక్ టన్నులు
దుక్కయినుము	1,45,00,000	,,
ఉక్కు	1,78,00,000	,,
చమురు - పెట్రోలు	2,95,00,000	,,
సిమెంటు	58,37,000	,,
మోటారుబండ్లు	1,99,315	,,

ముఖ్యయెగుమతులు

కలప — కలపతో చేయబడ్డ వస్తుసామగ్రి
ధాన్యం
ఫర్స్ (ఉన్ని మొదలైన రోమాలు)
చమురు
పత్తిబట్టలు

ముఖ్యంగా యెగుమతి తీసుకునే దేశాలు

గ్రేట్ బ్రిటన్	100 కి	33 పాళ్లు
అమెరికా	,,	8 ,,

ముఖ్యదిగుమతులు

పరిశ్రమలకు కావలసిన మరలు - పనిముట్లు
విద్యుచ్ఛక్తిపనిముట్లు
రాగి
ఉన్ని
రబ్బరు

ఎక్కువగా దిగుమతినంపే దేశాలు

అమెరికా	100 కి	18	పాళ్లు
గ్రేట్ బ్రిటన్	,,	15	,,
జర్మనీ	,,	14	,,

1936 లో సోవియట్‌లో ఉత్పత్తియైన మొత్తంవస్తువులలో 100 కి $98\frac{1}{2}$ పాలు ప్రభుత్వమే ఉత్పత్తిచేసింది. వ్యక్తుల చేతుల్లో ఉన్న ఉత్పత్తిఅల్లా చేతిపనులపరిశ్రమకు చెందినదే. చొక్కాలు కుట్టడం, కాలిజోళ్ళు తయారుచేయడం, టోపీలు తయారుచేయడం, చెమ్కీపని మొదలైనవి వ్యక్తులచేతుల్లోనున్న పరిశ్రమలు. ఈ పరిశ్రమలలో కూలివారిని ఉపయోగించవలసిన నిమిత్తం లేదు. ఒక్కమనిషి చేయగలిగిన పనులివి. వీటిపైగూడా ప్రభుత్వం యెక్కువ పన్ను విధించుచున్నది. అందుకు కారణం యివి వ్యక్తిగతఉత్పత్తిపరిశ్రమలు కావడమే. వీటిని మాపుమాపవలె ననే ప్రభుత్వం ప్రయత్నించుచున్నది.

ఉత్పత్తియొక్క రకం-పరిమితి మొదలైన విషయాలను నిర్ధారణచేసేది రాష్ట్రమే. ప్రభుత్వమే అన్నివిషయాల్లో

నాయకత్వంవహిస్తుంది. ప్రతిపరిశ్రమ యింతఉత్పత్తిచెయ్యాలన్న నిబంధన లున్నవి. సొవియట్‌ను అత్యంత త్వరితంగా పారిశ్రామికదేశం చెయ్యాలన్న ఆదుర్దాతో భారపరిశ్రమల నెక్కువగా సాగించారు రష్యనులు. అందువల్లే ప్రథమ పంచవర్ష ప్రణాళిక రోజుల్లో కొనుగోలువస్తూత్పత్తి చాలా దెబ్బతిన్నది. అనేకసార్లు పాదరక్షులలో, కొన్ని ఆహారపదార్థాలలో, గృహోపకరణాల్లో లోటుకలిగింది. కొనుగోలు వస్తువులు ప్రభుత్వదుకాణాల్లో ముందుగా తీర్మానింపబడ్డ ధరలకు అమ్మబడుచున్నవి. ఈ ధరల్లో ఉత్పత్తిఖర్చేగాక కొంత లాభంగూడా కలిసుంటుంది. దుకాణాలన్నీ ప్రభుత్వంవి కాబట్టి ప్రతివస్తువు వెలలో కొంత లాభం యిమిడి వుండడం మూలాన—సొవియట్ వరుంబడిలో 100 కి 90 పాళ్ళు ఉత్పత్తిమూలాన వసూలౌతున్నది. పన్నులవల్ల వసూలయ్యేది 100 కి 10 పాళ్లు మాత్రమే. ఒక జత పాదరక్షులధరగాని, ఒక జత ఉడుపులవెలగాని సొవియెట్‌లో యే యితరదేశంలో కంటే యెక్కువ వుంటుంది. దీనికి కారణం ప్రపంచచరిత్రలో యెన్నడూ యేదేశం యెరుగనంతమంది రాజకీయోద్యోగస్థులను రష్యా కలిగుండడమే. ప్రపంచ సైన్యాలన్నిటిలోకి పెద్దదైన ఎఱ్ఱసైన్యాన్ని సొవియట్ పోషించడముగూడా. పైగా ప్రపంచంలోని యితరప్రజలకంటే రష్యనుల ఆదాయం చాల యెక్కువ.

ప్రభుత్వదుకాణాలు తరగతులుగా విభజింపబడిఉన్నవి. ఈ విభజన ఆ దుకాణాలు యేరకం ప్రజకు సరఫరా జేయగల

వన్న నిర్ధారణమీద ఆధారపడియుంటుంది. దుకాణాలు మూడురకాలు—ఎఱ్ఱసైన్యానికి సరఫరాజేసే దుకాణాలు; ఉద్యోగస్థులకు సరఫరాజేసే దుకాణాలు; యితరదుకాణాలు. ఉత్పత్తిపూర్తికాగానే మొదట ఎఱ్ఱసైన్య సరఫరా దుకాణాలకు, ఉద్యోగస్థుల సరఫరా దుకాణాలకు వస్తువులు పంపబడును.

సోవియట్‌లో చిన్నకారులు కొద్ది. ఎక్కువగా బస్సులు, లారీలే, కనబడుతుంటవి. రష్యనులది వ్యక్తిగత జీవనంగాదు, సాంఘిక జీవనం అన్ని యీ విషయమొక్కటే చాలు ఋజువుచేయును. జనాభాలో తొమ్మిదోభాగం రష్యాలో నున్నా ప్రపంచ ఉత్పత్తిలో 100 కి $2\frac{1}{2}$ పాళ్లు మాత్రమే సోవియట్ ఉత్పత్తి చేస్తూన్నది. రష్యాలోనున్న కార్ల మొత్తం (1937లో) 6,78,000. ప్రపంచ ఉత్పత్తి మొత్తం 4,30,00,000. ఈ లోటును గమనించి సోవియట్లు గడచిన రెండు మూడేండ్లలో అపారంగా మోటార్ల నుత్పత్తి జేశారు. కొత్త రైలుమార్గాలు, కొత్త రస్తాలు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు పెచ్చుపెరగడంమూలాన కారులు గూడా యెక్కువగా కావలసివచ్చినవి.

సోవియట్‌లో యింటి బాడుగలు చాల చౌక. కాని అమెరికాలోని యిండ్లంత సౌఖ్యవంతమైనవిగావు—అంత యెక్కువ బాడుగలు లేవు. కాపురపుటింటివసతు లెక్కువగా లేవు గనుక పిల్లలున్న తల్లిదండ్రులకు యీ క్రిందిలెఖ్కను ప్రభుత్వము ద్రవ్యసహాయంచేస్తుంది.

ఐదేండ్లలోపుపిల్లల సంఖ్య	సాలు 1కి సర్కారుసహాయం
2	రూ 1500
3	3,800
4	6,000
5	7,500

సొవియట్‌లో వార మంటే ఆరు రోజులని లెక్క. అయిదు రోజులు వరుసగా, రోజుకు యేడు ఘంటల చొప్పున పని చేయాలి. ప్రతి ఆరోరోజు సెలవుదినము.

కూలీల రేటులో ఆడ మొగ భేదం లేదు. సాధారణంగా వయస్సువచ్చినవా రందరు పనిజేస్తారు—చెయ్యాలి. అందుకనే కుటుంబాదాయం యెక్కువవడం. ప్రభుత్వమే ప్రజలకు యెక్కువ వసతుల నుచితంగా కలిగిస్తూవున్నది. ఈ వసతులు—ఉచితవిద్య, ఉచితచికిత్స, ఉచితదంతచికిత్స, చౌకబాడుగ, చౌకప్రయాణాలు, చౌకవిద్యుచ్ఛక్తిసరఫరా, సినిమాల్లో చౌకటికెట్లు, పనిరోజుల్లో మధ్యాహ్నకాలంలో చౌకభోజనం, జీతమిస్తూ సెలవులు, గ్రంథాలయాలు, ముసలితనంలో భరణాలు, కారణాంతరాలవల్ల పని చేయలేని స్థితి యేర్పడ్డప్పుడు భరణాలు, ఉచిత విశ్రాంతిభవనాలు, ఉచిత ఆరోగ్యశాలలు మొదలైనవి. వీ టన్నిటికంటే ప్రభుత్వం ప్రజలకు జేస్తున్న అత్యుత్తమమైన సేవ సొవియట్ రక్షణమే. ఈ కష్టకార్యాన్ని యెఱ్ఱసైన్యం నిర్వహిస్తున్నది. ఈ వసతులన్నీ ఉచితంగా కల్గుచున్నవి. ప్రతి కూలివానికి ద్రవ్యరూపాన ముట్టే ఆదాయంలో మూడోభాగం యీ ఉచిత

వసతులమూలంగా ముట్టుచున్నవి. శ్రామికసంఘాలు భీమా పద్ధతిని తామే నడుపుచున్నవి. క్రమక్రమేణా యివి సర్కారు శాఖలుగా మారుచున్నవి. కూలీలనుంచి సూటిపన్నులు, ప్రత్యేకకారణాలకని పన్నులు, మొత్తం కూలీలజీతాలనుంచి మినహాయింపబడతవి.

సొవియట్‌లో నిరుద్యోగం లేదు. ఉద్యోగం పోతుం దన్న భయమే లేదు. ఒకవృత్తినుంచి మరొకవృత్తికి మారడం కష్టం కాదు. రోడ్లువేయడానికి, కాలువలు త్రవ్వడానికి, మరి యితర రాజకీయనిర్మాణయోచనలలో పనిజేయడానికి కొద్దిమందిని బలవంతపెడుతున్నారు. వీ రందరూ రాజకీయ ఖయిదీలే. నిరుద్యోగానికి సంఘ భీమా పద్ధతి లేదు. అందుకనే చాలామంది, యెన్నడన్నా నిరుద్యోగం కలిగితే సొవియట్‌ప్రభుత్వం తారుమారౌతుందనుకుంటున్నారు. కానీ నిరుద్యోగం రష్యాలో యెలా కలుగుతుందన్న ఆలోచన వారికి లేదు.

సొవియట్ సంయుక్తరాష్ట్రం మార్క్సు సిద్ధాంతాల మీద ఆధారపడి నిర్మింపబడ్డది. ఆ సిద్ధాంతాల్లో ముఖ్యమైనది, 'ప్రతివారినుంచి ఉత్పత్తికి వారి శక్తికొలది సహాయం, ప్రతివారికి ఫలితమునుండి వారి అవసరాన్నిబట్టి పంపకం' దీన్నే కమ్యూనిజం అంటారు. పరిశ్రమలు అభివృద్ధి అయ్యేముందు కొద్దికాలం కొన్ని పెట్టుబడిదారి ఆర్థిక యుక్తులను సొవియట్ అవలంభించవలసివచ్చినది. ఇప్పుడు సొవియట్‌ల అలవాట్లోనున్న సిద్ధాంతం 'ఉత్పత్తికి ప్రతివానినుండి వాని

శక్తికొద్దీ సహాయం—ప్రతివానికి వాని పనియొక్క విలువను బట్టి పంపకంలోభాగం.'

ఇంజనీర్లు కూలీలకంటె 80 యింతలు, కొన్నిచోట్ల 100 యింతలు యెక్కువ సంపాదిస్తున్నారు. గనులలో పని జేసేవారు కొంతమంది నెల 1కి రూ 1,200 సంపాదిస్తారు. గనులలో ప్రధానయింజనీర్లు నెల 1కి రూ 12,900 కూడా సంపాదించేవారున్నారు.

లెనిన్‌గ్రాడ్, మాస్కోనగరాల్లో కూలీలు నెల 1కి—

(1) నేతపరిశ్రమలలో ఆడపనివారు రూ 75 నుంచి రూ 90 వరకు
(2) పరభాషల నెరిగిన షార్ట్‌హాండుటైపిస్టులు 150
(3) పత్రికాధిపతులు (రెండు మూడుచోట్ల పనిచేస్తారు)
ప్రతిచోటునుంచి 180 చొ॥
(4) విశ్వవిద్యాలయాలలోని శాస్త్రజ్ఞులు,
శాస్త్రపరిశోధకులు (రెండు మూడు
చోట్ల పనిజేస్తారు) ప్రతిచోటునుంచి రూ 220 నుంచి రూ 300 వరకు
(5) కమ్యూనిస్టు కక్షీఉద్యోగస్థులు—తక్కువవారు 185
... —ఎక్కువవారు రూ 750 నుంచి రూ.3750 వరకు
(6) కచ్చేరిఅధికారి (యిల్లు ఉచితం) ,, 300 ,, ,, 600 ,,
(7) కర్మాగారాని కధిపతి (లాభంలో
కొంతభాగం యిచ్చి) ,, 375 ,, ,, 1,100 ,,
(8) అతినిపుణులు ,, 750 ,, ,, 3,750 ,,
(9) అత్యంతనిపుణులు ,,3,750 ,, ,, 7,500 ,,
(10) గ్రంథకర్తలు ,, 3,750 ,, ,, 7,500 ,,

అందరిలోకి యెక్కువ ఆదాయం అత్యంతనిపుణులకు గ్రంథకర్తలకు దొరుకుతుంది. వారి సహకారం లేనిదే యే ఉత్పత్తి, యే మానసికవికాసం జరుగదుగనుక. ప్రతి కూలి వానికి కనీసం రూ 427 నెల 1కి దొరకును.

ప్రజలు తమ ఆదాయాలను దాచుకొనవచ్చు. ఇష్టమైతే వడ్డీ కిచ్చుకొనవచ్చు. ప్రభుత్వ సేవింగ్సు బ్యాంకులో వడ్డీకిస్తే సాలు 1కి రూ 100 కి రూ 8 చొప్పున వడ్డీ దొరుకుతుంది. సర్కారువారికి ఋణమిస్తే 100 కి రూ 7 చొప్పున వడ్డీ గిడ్తుంది.

సోవియట్ సంయుక్త రాష్ట్రంలో పండే మొత్తం కాయధాన్యాల పంటలో నాల్గోవంతు యూక్రేన్ మైదానంలోనుంచి వస్తుంది.

2. రోడ్లు

సోవియట్ సంయుక్తరాష్ట్రము రోడ్ల నిర్మాణమునకై చాలా గొప్ప కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. తృతీయ పంచవర్ష ప్రణాళిక, క్రొత్తరోడ్ల నిర్మాణాన్ని అయితేనేమి, పాతరోడ్ల మరమ్మతునైతేనేమి, మొత్తం 1, 31, 250 మైళ్ళ రోడ్లను ప్రారంభించింది. దేశ రక్షణ, మోటారు ప్రయాణము, లారీలమూలమున వ్యాపారము యెక్కువయ్యేకొద్దీ మేలురకపు రోడ్లను నిర్మించవలసిన అవసర మేర్పడ్డది. అందుకనే సోవియట్ సంయుక్తరాష్ట్రము తన బలాన్ని చాలినంతవరకు, తన ఉత్పత్తిమూలాలలో యెక్కువ భాగం యిందుకొరకే వినియోగించుచున్నది. పంచవర్ష ప్రణాళికల కాలం మొత్తములో సోవియట్ 2, 43, 750 మైళ్ళు రోడ్డును నిర్మించింది. అందులో 31, 250 మైళ్ళు తారు రోడ్డు; 2, 12, 500 మైళ్ళు గ్రావల్ రోడ్లు వేయబడ్డవి.

ఈ కొత్త కార్యక్రమంయొక్క ప్రాముఖ్యతను గ్రహించను మనము జ్ఞాపకముంచుకొనవలసిన విషయమొకటుంది. జారులనాటి రష్యాలో, సోవియట్ ప్రభుత్వంఏర్పడక ముందు 100 సంవత్సరాల్లో నిర్మింపబడ్డ మొత్తం రోడ్లు 16,270 మైళ్ళు మాత్రమే. అంటే సాలు 1కి 163 మైళ్ళ రోడ్లే వేయబడ్డవన్నమాట. సోవియట్ ప్రభుత్వం యింత త్వరగా, యింత మంచి రోడ్లను, యింత పొడవుకు నిర్మించ

దానికి కారణం జనబాహుళ్యం ప్రభుత్వంపట్ల చూపిన సహకారంమాత్రమేగాదు. సముదాయ క్షేత్రాలు తమ ఉత్పత్తిని పట్టణాలకందించను, రైలుమార్గముల కందించను, మంచి రోడ్లు మెక్కువగా, త్వరలో కావలసివచ్చినవి. తమ అవసరాన్ని గుర్తించి రోడ్ల నిర్మాణంలో సముదాయ క్షేత్రాలు ప్రభుత్వానికి పూర్తిగా సాయపడ్డవి. అందుకనే యీనాటి రష్యా పూర్వపుపేరును—"రోడ్లులేనిరష్యా"—పోగొట్టుకోగలిగింది.

శ్రీ వేమన గ్రంథాలయము
తేలప్రోలు (కృష్ణా)

సొవియట్‌లో సగటున 322 మంది కొక మోటారున్నది.

3. కొత్త రయిలుమార్గాలు

సోవియట్ దేశాన్ని సహజసంపత్తినిబట్టి కొన్ని మండలాలుగా విభజించవచ్చు. ఈ మండలాల పారిశ్రామికాభివృద్ధిలో కొత్తరయిలుమార్గాల నిర్మాణం చాలా సాయపడ్డది. ఈ రయిలుమార్గాల అభివృద్ధి ముఖ్యంగా రెండు పంథాల త్రొక్కింది. (1) కొత్తమార్గాల నిర్మించడం, (2) ఉన్న రయిలుమార్గాలను ఆర్థికరీత్యా యెక్కువ లాభకరంగా నుండేటట్లు వుపయోగించడం—యీ రెండుపంథాలు. ప్రత్యేకఅవసరాలకు తగినట్లు రైల్వేసామగ్రి నుపయోగించను ప్రారంభించారు.

ఈ క్రింది అంకెలనుబట్టి కొత్తగా యెన్ని రైలుమార్గాలు నిర్మింపబడ్డవి స్పష్టమౌతుంది. ఇప్పుడు సోవియట్ సంయుక్తరాష్ట్రం' అని పిలువబడుచున్న దేశం మొత్తంలో రైలుమార్గాల నిడివి 1913 లో 35,000 మైళ్ళు మాత్రమే. 1940 లో యీ బాటలనిడివి 60,000 మైళ్లకు మించింది. సామ్యవాదాభివృద్ధి యింతటితో ఆగలేదు. 1914—18 లో జరిగిన ప్రపంచయుద్ధం కారణంగా, 1917—21 లో జరిగిన అంతర్యుద్ధం కారణంగా అప్పట్లో నున్న రయిలుమార్గాలు, చాలవరకు పాడయిపోయినవి. వాటిని తిరిగి నిర్మింపవలసివచ్చింది.

వీటిలో మరిఒక అభివృద్ధిగూడా తేవలసివచ్చింది. రైలుబాటలను సక్రమంగా ఉపయోగించడమే యీ అభివృద్ధి. యంత్రసామగ్రిని, శ్రామికులను ప్రత్యేకఅవసరాలు

గలిగినపుడు ఉపయోగించడానికి ఏ లయేర్పాట్లుగూడా చేశారు. అమెరికాలో సాలు 1కి ప్రతి రైలుమార్గం సగటున 10,40,000 వస్తువులను మోసినట్లు లెక్కలనుబట్టి తేలింది. ప్రస్తుతం సగటున సాలీనా 27,00,000 వస్తువులు రైలు మార్గాన నడుస్తున్నవి సోవియట్‌లో.

కొత్తరైలుమార్గాలు ఒక ఉద్దేశంతో నిర్మింపబడ్డవి. ప్రతి మండలాన్ని, పారిశ్రామికంగా అభివృద్ధిపరచవలయు నన్నదే యీ ఉద్దేశం. 1940 వేసవిలో అకొమొలిన్స్క్—కార్ట్లే రైలుమార్గ మారంభింపబడ్డది. దాని 485 మైళ్ళ మార్గం ఒక్క సంవత్సరంలోనే పూర్తిఅయింది. దానినిర్మాణ మప్పుడు, కొండలలో, చలికాలంలో అఖండ కష్టాలు పడ వలసివచ్చింది. ఈ రైలుమార్గం కరాగండ బొగ్గుగనులను మాగ్నిటోగోరస్క్ మొదలైన ఉరల్‌లోని పారిశ్రామిక కేంద్రాలతో కల్పుచున్నది. పూర్వపు రైలుమార్గానికంటే యిది యీ పట్టణాలను 300 మైళ్ళు దగ్గరకు తెచ్చింది.

ఈ సంవత్సరం ఆఖరులోగా మరో రైలుమార్గం పూర్తి ఔతుంది. దీని పేరు కొట్లాస్—వొరూక్టా రైలు మార్గం. ఈ కొత్తబాట, ఉత్తరాన యెల్లప్పుడూ మంచుతో కప్పబడియుండే కొమి అధి నివేశ సోవియట్ సామ్యవాద ప్రజాస్వామ్యం (Komi Autonomous Soviet Socialist Republic) మండలంగుండా పోతూన్నది. ఈబాట ఉత్తరాన ప్రవహిస్తున్న కొన్ని మహా నదులను దాటుతుంది—వాటి రాకపోకలను కలుపుతుంది. దీని 700 మైళ్ళ నిడివిలో, కలప

అడవులు, కొత్తగా పని నారంభించిన బొగ్గుగనులు ఉక్తా (Ukhta)లో కొత్తగా లభించిన నూనె బావులు గలవు. కిరోవ్ (Kirov) రయిలుమార్గంతో—యీ మార్గం ముర్మన్స్కు వెళ్ళుతుంది—కలుస్తుంది. ప్రస్తుతం దక్షిణాన నున్న డొనెట్స్ నేలబొగ్గు, బాకుచమురు, తమ ఉత్పత్తి స్థానాలనుండి కొన్ని వేల మైళ్ళు ప్రయాణంజేస్తేనేగాని బాల్టిక్ సముద్రం, తెల్లసముద్రం, బారెంట్స్ సముద్రం మొదలైన ఉత్తరప్రాంతాల్లోని పారిశ్రామిక కేంద్రాలకు చేరడంలేదు. కొట్లాస్—వొర్కూటా రయిలుమార్గం ఉపయోగంలోకి వస్తే అంతదూర ప్రయాణం, అంత ఖర్చుయ్యే ప్రయాణం అవసరముండదు.

ఉఫా—మాగ్నిటోగోర్స్కు పూర్తియై సక్రమంగా పని జేయుచున్న రైలుమార్గాల్లో (wfa-Magnitogorsk) నొకటి. ఉరల్ పరిశ్రమలకు యీ మార్గం తొందరగా ఉక్కును సరఫరా చేయగలదు. కిజ్లెయర్ అస్ట్రాఖాన్ (Kizlyar Astrakhan) రైలు మార్గం, కాకసస్‌నుంచి పంపబడుచున్న తూర్పు సరఫరాకు దూరాన్ని తగ్గిస్తుంది. 1940 లో కొన్ని చిన్నమార్గాలు, కొన్ని ప్రత్యేకమార్గాలు ముగింపబడినవి. వాటిలో ముఖ్యమైనది గోర్స్కు మాల్గోటెక్ (Gorsk and Malgotek)చమురు బావులను, గ్రోజ్నీ (Grozny) చమురు పరిశుభ్రనిలయాలతో గలిపే 70 మైళ్ళ రైలుమార్గమొకటి. కొన్ని రైలుమార్గాలు 1941 ఆరంభంలో ప్రారంభింపబడినవి.

మరొకవిధంగాగూడా సోవియట్ రైలుమార్గాలు యితరదేశాల రైలుమార్గాలుకంటే ముందంజ వేసినవి. సోవియట్ రైళ్ళను నడుపువారు యెక్కువమార్లు బొగ్గుకోసం ఆగకుండా, నీళ్ళకోసం ఆగకుండా తమరైళ్ళనెక్కువదూరం నడపడం నేర్చుకున్నారు. పెట్టుబడిదారి యింజనీర్లు వూహించగల్గిన కాలానికంటే యెక్కువకాలం మరమ్మతులుగూడా లేకుండావీరు తమ యింజన్లను నడుపుచున్నారు. మనదేశంలో బరువులను రయిలు కెక్కించాలంటే కూలీలే మోయాలి. బరువులెక్కించే పెట్టె యెక్కడో వుంటుంది. బరువులు ప్లాట్ ఫారంమీద యేమూలో వుంటవి. కూలీలు యీ బరువులను ఆ పెట్టె కెక్కించేటప్పటికి యెంతో ఆలస్యమౌతుంది. రాత్రులలో మరీఆలస్యం. సోవియట్‌లో బరువు లెక్కించే పెట్టె, తనంతట తానే, కూలీలతో నిమిత్తం లేకుండా బరువు లెక్కిస్తుంది. ఈ పనినంతా యంత్రాలే చేస్తవి. స్టేషనులలో బరువులను వదలివేయడానికి, కొత్తసామగ్రి నెక్కించుకోడానికి, నూతన పద్ధతుల సౌకర్యాలు కనిపెట్టబడడంమూలాన యెక్కువసామగ్రిని తీసుకొని పోగల్గుతున్నవి రైళ్లు. సోవియట్‌లో కొత్తరకం యింజన్ల నుపయోగిస్తున్నారు. ఈ యింజన్లలో, బయటికి వదలబడే ఆవిరి నీరుగా మారి మళ్ళీ యింజన్ తొట్టిలోకి చేరే సదుపాయాలు చేయబడియున్నవి. ఈ విధానం కనిపెట్టబడినందువల్లే రైళ్ళు నీళ్ళకుగాను యెక్కువచోట్ల నాగ నవసరం లేకుండాపోతూంది. డిసెల్ యింజన్లు, యెలక్ట్రిక్ యింజన్లుగూడా వాడబడుచున్నవి.

1940 లో డిసెల్ యింజన్లు స్టీమ్‌యింజన్లుఅన్న ప్రత్యేకత లేకుండా ఒకటి-యింజనునే రెండువిధాల ఉపయోగించే పద్ధతిని కనిపెట్టారు. ఇది చాలా శక్తివంతంగా పనిచేస్తూందని రుజువైంది. ఇంజన్లలో కొత్తరకాలనే గాకుండా, వాటి కాహారంగా ఉపయోగించే సామగ్రిలోగూడా కొత్తరకాలను కనిపెట్టి వాడుతున్నారు. మన దేశంలోవలె కేవలం బొగ్గుమీదే ఆధారపడి యుండలేవు రష్యనులు. ఈ మార్పులన్నీ లేకుంటే సోవియట్ రైలుమార్గాలు చకటిగా పని జేయడం కష్టం. సోవియట్ రైలుమార్గాలు నీటిబొట్టు కనబడని యెడారులను దాటాలి; మానవసంచారం లేని అరణ్యాల అవతలి కెళ్ళాలి; ఉత్తరాన అతి విశాలవంతమైన బయళ్ళను ఆవరించాలి. ఇంత అభివృద్ధి లేకుంటే యింతటి మహత్తరసేవ చేయను సాధ్యమయ్యేదా? 1939_40 లో సోవియట్‌లో యెన్నడూ లేని చలిగాడ్పులు వీచినై. నీరేమిటి గ్రీజుగూడా గడ్డకట్టింది ఆ చలికి. అంత చలిలో, ఉత్తరానున్న రైలుమార్గాలు ఒకటికూడా చెడకుండా పనిజేసిన వంటే సోవియట్ రైలుమార్గాల సామర్థ్యం ఊహించాలెగాని వూరక చదివితే బోధపడుతుందా?

ప్రపంచంలోని మొత్తం సినిమాహాలుల సంఖ్య 90,334. సోవియెట్‌లో మాత్రం 26,000 వున్నవి. మరే ఒక దేశంలోను యిన్నిలేవు.

4. విద్యా వ్యాప్తి

ఇటీవల సోవియట్ సంయుక్తరాష్ట్రంలో జరిగిన జనాభా లెఖ్ఖలనుబట్టి గ్రామాల్లో అక్షరాజ్ఞత అపారంగా పెరుగుచున్నదని తెలుస్తూంది. ఇంతకుపూర్వ మెన్నడూ రష్యను పల్లెటూళ్ళలో కని, విని యెరుగని నేర్పుగల సాంకేతికవృత్తు లిప్పుడు యేర్పడుచున్నవి. 1914-15 లో గ్రామ పాఠశాలలు 93, 770 న్నీ, వానిలో విద్యార్థులు 61, 17, 200 వుండేవారు. 1938-39లో యీ గ్రామ పాఠశాలల సంఖ్య 1, 53, 209 కి, వానిలోని విద్యార్థుల సంఖ్య 2, 20, 87, 800 కు పెరిగింది. 1914-15 లో ఉపాధ్యాయుల సంఖ్య 1, 52, 400 మాత్రమే. 1938-39 లో వారి సంఖ్య 7, 15, 300 లు. ఇదంతా అసలుకథ గాదు—పిట్టకథే. పూర్వకాలంలో పసిపిల్లలుగూడా చేలల్లో పనిచేయాలసివుండేది. బడులలో చేరడం ఆలస్యంగా చేరేవారు. వసంత ఋతువు రాగానే బడి మానేసేవారు. యెక్కువమంది పిల్లలు ఒకటి లేక రెండేళ్ళలో చదువు ముగించేవారు. కాని యీరోజుల్లో గ్రామాల్లో నాలుగేండ్ల నిర్బంధ విద్యావిధానం సర్వసామాన్యమైపోయింది. ప్రస్తుతం అమలులోనున్న తృతీయ పంచవర్షప్రణాళికనుబట్టి నిర్బంధవిద్య నాలుగేండ్లనుంచి యేడేండ్లకు హెచ్చింపబడినది. సమిష్టి వ్యవసాయక్షేత్రాల యువకులు వేనవేలు సాంకేతిక, తదితర ఉన్నత పాఠశాలలకు వెళ్ళుచున్నారు. చలికాలంలో — చలికాలం మనకంటే

రష్యనుల కెక్కువరోజు లుంటుంది—సమిష్టి వ్యవసాయ క్షేత్రాలే పెద్దలకు పిన్నలకుగూడా విద్యాలయాలగుచున్నవి. 1914-15 లో వ్యవసాయ కళాశాలలలో యితర ప్రత్యేక విద్యా విధానాలలో, విద్యార్థుల మొత్తం 18, 600 లు. 1938-39 లో వీరి సంఖ్య 8, 03, 100 లు. 1914-15 లో వ్యవసాయసంబంధమైన పరిశోధనశాలలు లేనేలేవు రష్యాలో. ఈ సంవత్సరం వీటి సంఖ్య 87. ఇవిగాక పరిశోధనార్థమే పెక్కు క్షేత్రాలు, పెక్కు కేంద్రస్థలాలుగూడా వున్నవి. సమిష్టి వ్యవసాయక్షేత్రాలకు చెందిన శాస్త్రీయ-పరిశోధన శాలలు 13, 000 వున్నవి యిప్పుడు. ఇవిగాక గృహ-పరి శోధనశాలలు సోవియట్ అంతటా చాలాగలవు.

వ్యవసాయంలోగూడా శాస్త్రీయవిషయాల గురించి కృషి జేసే శ్రామికులు సమిష్టివ్యవసాయక్షేత్రాలతో చాలా దగ్గరసంబంధం కలిగుంటారు. వ్యవసాయ శాస్త్రీయశ్రామికు లకు వ్యవసాయక్షేత్రాలకు యెలాంటి పరస్పరసహకారం—సంబంధం కలదో అదేసంబంధం ప్రతి శాఖలోగూడా గ్రామ, నగరాలమధ్య నున్నట్లు గనబడుచున్నది. గొప్ప పట్టణాల్లోని సంగీతసభలు, సమిష్టి వ్యవసాయక్షేత్రాలున్న ప్రదేశాల్లో తమ శాఖలను నిర్మించినవి. నాటక సభలు, నాట్యబృందాలు తమ జట్లతో గ్రామాల్లో దిరిగి నాటకాల ప్రదర్శించడమే గాకుండా గ్రామాల్లోని నటులకు, నాటక సంఘాలకు సదా తోడ్పడుతూవుంటారు.

ప్రతి సమిష్టి వ్యవసాయక్షేత్రం సహజంగా కలిగి యుండవలసిన పాఠశాలలు, విద్యాప్రణాళిక లేగాక నాటక, సంగీత, చిత్రలేఖన, సాహిత్య, వ్యాయామ బృందాలను గూడా కలిగి వుంటుంది. సోవియట్ జీవితంలో అతి సుందర మైన, అతి ఫలవంతమైన అంశం ప్రజల పండుగలు. ఈ పండుగలలో పాల్గొనుటకు పల్లెలనుండి మాస్కోకు చాలా మంది ఆహ్వానింపబడుతుంటారు. గ్రామాల్లోనూ తన సహజ నిపుణత్వంతో సమిష్టి వ్యవసాయక్షేత్రాల నాటకబృందాలు షేక్స్పియర్, మొలేర్, ఆస్ట్రోవ్స్కీ, వెసివోలాడ్ యివ్ నోవ్ మొదలైన గొప్పవారి నాటకాలు ప్రదర్శిస్తుంటారు సహజంగా. పురాతన గ్రంథకర్తల నాటకాలుకూడా ప్రదర్శిస్తుంటారు. గ్రామ క్లబ్బులు 95, 274 వున్నవి. వీటిలో క్రమపద్ధతిని ప్రదర్శనాలు జరుగుతుంటవి. 265 సక్రమ నాటకశాలలున్నవి సమిష్టి వ్యవసాయక్షేత్రాల్లోనంతట.

సమిష్టి వ్యవసాయక్షేత్రాల రైతుల ఉపయోగార్థమై 61, 636 గ్రంథాలయాలు, వానిలో 5, 00, 00, 000 గ్రంథ రాజాలున్నవి. 1914 లో అసలు, గ్రంథాలయాల సంఖ్య చెప్పుకోదగినంతదిగాదు. వీటికి తోడు సముదాయక్షేత్రాల కుటుంబాలకు, చాల వాటికి, తమ సొంత గ్రంథాలయా లున్నవి. వాటిలో—చాల వాటిలో—యెక్కువ గ్రంథాలే గాకుండా ఉత్తమపుస్తకాలుగూడా వున్నవి.

మాస్కోనగరానికి వెలుపల వ్యవసాయ ప్రదర్శన మొకటి 1939 లో యేర్పాటుచేయబడి 1940లో గూడా

సాగింది. ఈ ప్రదర్శనమే, గ్రామాలకు పట్టణాలకు యెంత ఒద్దికున్నదో స్పష్టపరుస్తుంది. ఈ ప్రదర్శనాన్ని 45,00,000 జనం చూచారు. లక్షలమంది గ్రామవాసులకు యీప్రదర్శనం పట్నవాసజీవితంతో పరిచయం కలిగించింది. సోవియట్ ముఖ్య పట్టణమైన మాస్కో నగరవాసులకు తమ రైతుసోదరుల జీవితం యెంత అభివృద్ధి జెందిందో స్పష్టపరిచింది యీ ప్రదర్శనమే.

* * *

1940 లో పాఠశాలలు సెలవులు ముగిసి తెరవబడ గానే ఉన్నతవిద్య నభ్యసించను ముందెన్నడూ చేరనంత మంది చేరారు. వారి సంఖ్య 7, 00, 000 కంటే యెక్కువ. 1938 లో వీరిసంఖ్య 6,00,000 కు తక్కువ.

ఇటీవల సోవియట్ విద్యావిధానంలో కొన్ని మార్పులు తేబడినవి. అందులకై నూతన ఆజ్ఞలు కొన్ని అమలులోనికి వచ్చినవి.

నూతనఆజ్ఞలు ముఖ్యంగా సోవియట్ విద్యావిధానాన్ని విస్తరింపడానికనే ఉద్దేశింపబడ్డవి. వీటివల్ల, వ్యాపారంలో, రైల్వేలలో, పారిశ్రామికపాఠశాలల్లో షుమారు 10,00,000 మంది యువకులకు రెండేండ్లపాటు సాంకేతికవిద్య గఱపను అవకాశాలు కల్గింపబడినవి. ఈ శిక్షణకాలంలో సాధారణ చదువు ఉచితంగా చెప్పబడడమేగాక, విద్యార్థుల సమస్త ఖర్చులు, రాష్ట్ర ఆదాయ-వ్యయపట్టీలలోనే చేర్చబడ్డందున ప్రభుత్వమే భరిస్తుంది. ఈ రకం పాఠశాలలలో సాంకేతిక

విద్యయేగాక, సాధారణ ఉన్నతవిద్యగూడా గఱపడానికి యేర్పాట్లు చేయబడియున్నవి. ఈ కొత్తరకం పాఠశాలల ముఖ్యాశయం, సొవియట్‌విద్యలో 'బహు-సాంకేతిక' సిద్ధాంతాన్ని వ్యాపింపజేయడమే. విద్యార్థికి ప్రత్యేకజ్ఞానము, నిపుణత కలిగించడమే గాకుండా, వాటితోబాటు సామాన్య జ్ఞానాన్ని గఱపడమే యీ విధానంయొక్క ముఖ్యఆశయం. ఈ పాఠశాలలలో చేరవలెనని బలవంతమేమీ లేదు. ఇష్టమైతేనే చేరవచ్చు. యువకులు పట్టభద్రులైనవెంటనే క్రమకూలీకే వారికి నౌకరీ లివ్వబడతవి. ప్రభుత్వఖర్చులతో విద్య నేర్చుకున్నారుగనుక కొంతకాలం ప్రభుత్వోద్యోగం ఉచితంగా చేయవలయునన్న నిషర్షలు లేవు. పట్టభద్రులు నాలుగేండ్లపాటు నౌకరీచేయాలి. అప్పట్లో దేశమందంతట అమలులోనున్న కూలీ రేటుప్రకారం వీరికి నౌకరీల నిప్పించే పూచి ప్రభుత్వందే.

సొవియట్ పారిశ్రామికాభివృద్ధికి మితము లేదు. అది లభించే శ్రామికులు, వారి ఉత్పత్తిశక్తిమీద ఆధారపడి వుంటుంది. కాబట్టి, దూరదృష్టితో శ్రామికుల నుపయోగించడం అత్యవసరమైన విషయం. సొవియట్‌క్షేమం, భద్రత, స్వయంరక్షణశక్తి దీనిమీదే ఆధారపడియున్నై. ఇప్పటివరకు, కర్మాగారాలను, ఫ్యాక్టరీలను ప్రవేశించే కొత్తకూలీలు తమపనులలోను, ఫ్యాక్టరీపాఠశాలలలోను చాలాకాలంశిక్షణ పొందినవారై యుండాలిసి యుండేది. సొవియట్ పరిశ్రమలలో సాలు 1కి 10,00,000 మంది చొప్పున కొత్తకూలీలు ప్రవే

శిస్తున్నారు. వీరు, ఉత్పత్తివిధానాన్ని తమంతట తాము సాగించడానికి తగినంత సమర్థులై యుండాలంటే, వీరికెంత శిక్షణనివ్వాలో, ఆ శిక్షణకై యెంత ధనము, కాలము, బలము వ్యయపరచాలో వూహించండి! ఈ శిక్షణేగనక పని జేసేసమయంలోనే—ప్రత్యేకంగా కాకుండా—యివ్వబడితే, వీరికేమీ చేతగాదు గనుక ఉత్పత్తియొక్క పరిమితి, గుణముగూడా క్షీణించుతుంది. కాబట్టి, యీ శ్రామికుల విద్యా, శిక్షణలు ఫ్యాక్టరీలలోగాక వేరుగా యిస్తేనేగాని మొత్తంమీద యెక్కువ లాభకరమూ, సంఘానికెక్కువ అనుకూలముగాదని సొవియట్ అధికారులు గ్రహించారు. ఈలా విద్యాశిక్షణలు ప్రత్యేకంగా ఫ్యాక్టరీల బయట జరపడంమూలాన ఖర్చు, పెట్టుబడి యెక్కువైనా, దీనివల్ల కలిగే ఫలితాలు తప్పకుండా యెక్కువ లాభంగానుంటవి— ఎన్నోరెట్లు యెక్కువగానుంటవి.

విద్యావిధానంలో కలిగిన యీ కొత్తమార్పుల చాలామంది ఆశిస్తున్నట్లు, యీ మార్పులు తేగలిగినందుకు అభినందిస్తున్నట్లు సొవియట్ పత్రికలద్వారా తెలుస్తూంది. నగర, జిల్లాలలో కొత్తగా విద్యార్థులను చేర్చుకునే కమీషన్లు ప్రతిరోజూ వేనకువేలు అర్జీలనందుకుంటున్నవి. కొన్ని విషయాల్లో, ఖాళీలెన్ని ఉన్నవో వాటికి రెండింతలు అర్జీలు వచ్చినవి. అంతేగాకుండా, యీ నూతన పాఠశాలలు సృజింపబడడంమూలాన ఫ్యాక్టరీలలోని పాఠశాలలకు నష్టమేమి గలుగలేదు. ఫ్యాక్టరీలలో పనిజేస్తూ, తమ యోగ్యతల

నభివృద్ధిచేసుకోడానికి, అనుభవంతోపాటు శిక్షణనుకూడా పొందవలయునని కోరే శ్రామికులకు ఉన్నత శిక్షణ నివ్వడానికే ఫ్యాక్టరీపాఠశాలలింకా నమలులో నున్నవి.

ఈ నూతన విద్యావిషయమైన ఉత్తరువులలో నొకటి అత్యున్నత విద్యకు, రెండు ఉన్నతపాఠశాలలకిచ్చే పిల్లల జీతాలకు కొంత హద్దుల నేర్పరచింది. ఉన్నతపాఠశాలలకు సాలు 1 కి విద్యార్థి రుసుము రు 225/- నుంచి రు 300/- వరకుంటుంది. కళాశాలలకు రు 450/- నుంచి రు 600/- వరకు గలదు. చిత్రకళామందిరాలకు, గానకళా, రక్షణ శాలలకు రు 750/-. ఈ సందర్భములో, సోవియట్ విద్యా విధానపరిణామం, దానికయ్యే అపారమైన పెట్టుబడి, దాన్ని నిర్వహించడానికి వ్యాపింపజేయడాని కయ్యే సాలీనాఖర్చు ముఖ్యంగా గమనింపవలసిన విషయాలు.

గడచిన కొలది సంవత్సరాల్లో మాత్రమే 21,000 కొత్తపాఠశాలలు నిర్మింపబడ్డవి. కాని యింకా చాలా పాఠశాలలు నిర్మింపవలసిన అవసరమున్నది. ఇటీవలి విద్యాభివృద్ధికి యీ క్రింది పట్టికే నిదర్శనం.

విద్యార్థులసంఖ్య

చేర్చుకొనిన	1914-15	1928-29	1933-34	1938-39
(1) ప్రాథమిక పాఠశాలలు	70,30,000	87,70,000	1,18,10,000	1,06,46,000
(2) మాధ్యమిక	2,30,000	22,04,000	81,50,000	1,17,12,000

(3) ఉన్నత	6,35,600	9,77,8[illegible]0	20,11,800	90,28,200
(4) వయోజనవిద్యా శాలలు, తరిఫీతు పాఠశాలలు	—	1,16,400	1,24,000	1,31,100
(5) వయోజనులకు మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు	—	1,70,700	—	7,50,900
(6) ఫ్యాక్టరీ పాఠశాలలు	—	56,700	2,71,100	1,07,900
(7) శిక్షణనిచ్చేవారిని సంఘసేవకులను విద్యావంతుల చేయను మాధ్యమికపాఠశాలలు	1,29,000	4,78,900	9,88,900	11,94,100
(8) ఫ్యాక్టరీ, కర్మాగార పాఠశాలలు	93,200	2,72,600	4,00,000	2,42,200
(9) సాంకేతిక ఉపాధ్యాయులను, నిపుణులను తయారు చేయను సాంకేతిక శాలలు, మాధ్యమిక పాఠశాలలు	35,800	2,06,300	5,88,900	9,51,900
(10) ఉన్నతవిద్యా పాఠశాలలు, కళాశాలలు	1,12,000	1,76,600	4,58,300	6,02,900

పై పట్టీలో వివరింపబడని అనేక శిక్షణవిధానాలు, ఉత్తరప్రత్యుత్తరాల విద్యాభ్యాసక్రమాలు యింకా చాల

వున్నవి. మొత్తంమీద సోవియట్ సంయుక్తరాష్ట్రంలో 4,80,00,000 ప్రజలు విద్యను, శిక్షణను పొందుతున్నారు. శ్రామికుని సగటు సాలుకూలీనిబట్టి చూస్తే విద్యాలయాల్లో జీతాలు తక్కువనేచెప్పాలి. 1938లో కూలివాని సగటు ఆదాయం రు 5, 200. అందునా, ప్రతి కుటుంబములోని జనమంతా సంపాదించేవారే. కానీ, బడిజీతం, (పిల్లలు బడికి చెల్లించే రుసుము) సర్కారువారు విద్యకుగాను వెచ్చించే మొత్తానికి చాలా తోడ్పడుతుంది. ఈ బడి జీతం యింకా కొత్త పాఠశాలలను స్థాపించడానికి సాయపడుతుంది. చాలా చోట్లలో—పట్టణాల్లోగూడా—పాఠశాలభవనాలు, తదితర వసతులు కావలసినన్ని లేవు. అభివృద్ధికి యింకా అవకాశం చాలా వుంది. పెక్కుచోట్ల, అనేక రకాల పాతయిండ్లనే పాఠశాలల కుపయోగిస్తున్నారు. పాఠశాలల భవన నిర్మాణ కార్యక్రమంలో సోవియట్లు చేయవలసింది చాలా వున్నది. సోవియట్‌లో విద్యాభ్యాసం, తప్పనిసరియు, సర్వవ్యాప్తమునై యున్నది. ఈ విధానంలో ప్రస్తుతంలాగా ప్రాథమిక, మాధ్యమిక విద్యలనుమాత్రమేగాక, ఉన్నత విద్యనుగూడా క్రమక్రమంగా చేర్చాలన్న ప్రయత్నాలు సల్పబడుచున్నవి.

సామ్యవాద సంఘపరిస్థితులలో బడిజీతం కొద్దిగా కట్టవలసియుండడం కారణంగా అసలు బడి మానుకునేవారెవ్వరూ వుండరు—పెటీబూర్జువాలు తప్ప. బీదవిద్యార్థులకు యీ నూతనచట్టాన్ననుసరించి వేతనాలిచ్చు యేర్పాట్లు చేయబడ్డవి. జీతాలు కట్టుకోలేని విద్యార్థులకు, అవసరమైన

సందర్భాలలో కార్మికసంఘాలు, స్థానికసంస్థలు సాయపడతవి. ఈ సంఘాలసహాయం ఉన్నత విద్య నభ్యసించే విద్యార్థులకు గూడా లభిస్తుంది. స్వగృహాలకు దూరంగా, కళాశాలలలో, విశ్వవిద్యాలయాలలో చదివే విద్యార్థులు చాలమంది, విశ్వ విద్యార్థులచేతనే పోషింపబడుచున్నారు. ఈ కొత్త ఆజ్ఞలు పై సహాయవిధానాలలో మార్పును తేలేదు. వీటినిబట్టి, పూర్వంలాగా ఉచితపోషణ జరగడమేగాకుండా రొఖ్ఖ రూపంగా విద్యార్థి వేతనాలుగూడా పొందగలిగారు విద్యార్థులు. కానీ, యీ వేతనాలు మంచి మార్కుల సంపాదించే లేక విద్యాభ్యాసంలో అభివృద్ధి నెక్కువగాచూపే విద్యార్థులకు మాత్రమే యివ్వబడతవి. ఈ మార్పులేవియు ప్రస్తుత ప్రపంచ విద్యాభ్యాస విధానంలోని అలవాట్లకు యేమాత్రం దూరమైనవని ఋజువుచేయడానికి వీలులేదు.

1934 వరకు ప్లాటినం ఉత్పత్తిలో ప్రపంచాని కగ్రస్థానం సొవియట్టుదే. ఈ యేడేండ్లుగా కెనడాదేశం ముందంజవేసింది.

శ్రీ వేమన గ్రంథాలయము

5 విదేశాంగవిధానం *

శాంతికొఱకు 24 యేండ్ల పోరాటం

ఈ సంవత్సరం నవంబరులో, సోవియట్ 24 వ జన్మ దినోత్సవం జరుపబడుతుంది. ప్రస్తుతం జరుగుచున్న రెండవ ప్రపంచయుద్ధం మధ్య యీ జన్మదినోత్సవం జరుపబడ నుండడం నిజంగా సంతోషదాయకమైన విషయం. ఈ యుద్ధ వాతావరణం మనకొక విషయాన్ని జ్ఞాపక పరుస్తుంది. మొదటి సామ్రాజ్యవాద యుద్ధంరోజుల్లో సోవియట్ రాజ్యాంగవిధానం యేర్పడ్డదని మనమెరుగుదుం. కానీ, మును పటికంటె యెక్కువగా, ఆ విషయాన్నే యిప్పుడు జరుగు చున్న ఘోరయుద్ధం మనకు జ్ఞాపకపరుస్తూంది. రష్యనులు, తమ యిష్టానికి వ్యతిరేకంగా మొదటి సామ్రాజ్య యుద్ధంలో పాల్గొన్నారు. రెండేండ్లు యుద్ధం జరిగిందో లేదో! కండ్లు తెరిచి చూడగలిగారు. మానవరక్తం యెంత ప్రవహించింది గ్రహించారు. యుద్ధాన్నాపాలని నిశ్చయించుకున్నారు. విప్లవాన్ని లేవదీశారు. జారుచక్రవర్తిని చంపారు. బోల్షివిక్కులను అధికారాన నిలబెట్టారు. విప్లవం ఆరంభమైన మరునాడే 7-11-1917 న దానికి జయం గలిగింది. సోవియట్ ప్రజా ప్రభుత్వానికి నాయకుడైన లెనిన్, యుద్ధంలోపాల్గొన్న దేశా

* ఈ వ్యాసం వ్రాయబడిన అనంతరం రష్యా-జర్మనీ యుద్ధం ఆరంభ మైనది. సోవియట్ విదేశాంగవిధానంలో గొప్ప మార్పు గలిగింది. అయి నను యీ వ్యాసంలోని విషయములు గ్రాహ్యములు.

లకు, విన్నపాన్నంపాడు, న్యాయమైన సంధి జేసుకోమని. ఆ విన్నపంలో—

"1917 నవంబరు, 6-7 తారీకుల్లో రష్యాలో విప్లవం జయప్రదంగా జరిగింది. ఆ విప్లవఫలితంగా కూలి-రయితు రాజ్యం యీ దేశంలో నెలకొల్పబడింది. ప్రజాబాహుళ్యానికి క్షేమకరమైన న్యాయమైన సంధిసంభాషణలను వెంటనే ప్రారంభించమని, ప్రస్తుతం యుద్ధంలో మునిగియున్న ప్రజలను, వారి ప్రభుత్వాలను సోవియట్ ప్రభుత్వం కోరుచున్నది,......సంభాషణల నారంభించడమే గాదు. అట్టి సంధిని వెంటనే చేసుకోడం యెంతో అవసరం. శాంతిని నెలకొల్పడానికి తగిన చర్యలను తనదేశంలో తాను తీసుకుంటూందని యీ ప్రభుత్వం తెలియజేస్తున్నది. అట్టి సంధిషరతులు ప్రతిదేశం తరఫున, ఆ దేశపు ప్రజల ప్రతినిధులసమావేశముచే నామోదింపబడవలెను. అంతియే గాదు, మానవజాతితరఫున, అన్ని దేశముల, అన్ని జాతుల ప్రజాప్రతినిధులు యీ సంధిషరతుల నామోదింపవలెను."

ఈ విన్నపం చారిత్రాత్మకంగా చాల ప్రసిద్ధమైంది. దీని ప్రాముఖ్యతకు కారణం, యితర ప్రభుత్వాలవలె గాక సోవియట్ప్రభుత్వం మనోవాకా-యకర్మలతో యుద్ధాన్ని ఆప ప్రయత్నించడమే. ఈ విధంగా, సోవియట్రాజ్యాంగ యంత్రం తన జీవితారంభంనుంచి అంతర్జాతీయశాంతిని నెలకొల్పడానికి కృషి చేసింది.

మొదటినుంచి—నేటికి, రేపటికిగూడా—సోవియట్ ప్రభుత్వం స్వలాభాపేక్ష లేకుండా, కొన్ని సమయాల్లో తనకు నష్టకరమైనా అట్టి నష్టాన్ని పాటించకుండా, ప్రపంచ శాంతిని నెలకొల్పడాని కనేక మార్గాలను సూచించింది. ఈ

యుద్ధంలోగూడా, మొదటి సామ్రాజ్యవాదయుద్ధంలోలాగే సోవియట్‌సంయుక్తరాష్ట్రం శాంతిమార్గాన్నే అవలంబిస్తూ న్నది. సోవియట్‌దృష్టికి, గడచిన యుద్ధంలో పోరాడినవారి ఆశయాలకు, యీ యుద్ధంలో పోరాడుచున్నవారి ఆశయా లకు అట్టే తేడా వున్నట్లగుపడడంలేదు. ఇప్పుడు పోరాడు చున్న జట్టులు మునుపటియుద్ధంలో ఢీకొన్న జట్టులకన్నా యెక్కువ భయంకరమైనవి. ఎక్కువ బలిష్ఠమయినవి. గడ చినయుద్ధంలో రోజు 1కి సగటున బ్రిటను రూ 6,00,00,000 మాత్రమే ఖర్చుచేసింది. ఈ యుద్ధంలో యిప్పటి కప్పుడే బ్రిటను రోజు 1కి సగటున రూ 21,00,00,000 ఖర్చుచేస్తూ వున్నది

ప్రతి రాజ్యాన్ని, ప్రతి దేశాన్ని, ప్రతి సమాజాన్ని, చిన్న-పెద్ద, మంచి-చెడ్డ, స్నేహితుడు-విరోధి, దగ్గర-దూరం, అన్న విచక్షణ లేకుండా యుద్ధంలోకి దించగల్గిన బెదిరింపులు మునుపటికంటే యిప్పుడు చాల యెక్కువగా నున్నవి. ఈ యుద్ధంలో సోవియట్ తటస్థవిధానాన్ని అవలంబించియున్నది. ఈ యుద్ధంలో పాల్గొనుచున్న యిరుప్రక్కలవారి ఆశయా లతో సోవియట్ కేలాంటి సంబంధం లేదు. కానీ, యిప్పటికే పశ్చిమయూరప్‌నంతను; రష్యాతప్ప మిగిలిన మధ్యయూరప్ నంతను యీ యుద్ధం ఆవరించింది. ఆసియాఖండానికి వ్యాపించింది. నిన్న, నేటిపత్రికలలో రష్యాపై జర్మనుసేనలు దండయాత్ర ప్రారంభించినవని చూస్తున్నాము. నిన్న యూరప్ ఆగ్నేయభాగంలో యుద్ధం తీవ్రంగా నున్నది.

మొన్న, యూరప్ ప్రాంతాన నున్న ప్రాచ్యదేశాలలో అల జడి గలిగించింది. నేడు రష్యాను జర్మనీ పది మైళ్లు ఆక్ర మించిందన్న వార్త అగ్నిజ్వాలలా పాకింది. ముందు మధ్య ఆసియాకుగూడా వ్యాపించొచ్చు.

జపాను యిప్పటికే తీవ్రంగా చైనాతో యుద్ధంజేస్తూ వున్నది. పసిఫిక్ రంగం మొత్తం నేడో, రేపో యుద్ధంలోకి దిగవచ్చు. జడిపింపులు యెక్కువగుచున్నవి. ప్రస్తుతం యుద్ధంలో పాల్గొనని రాజ్యాలుగూడా యుద్ధప్రయత్నాల నపారంగా జేస్తూన్నవి. వీనిలో ముఖ్యమైనది అమెరికా. ఈ వాళ గాకుంటే రేపైనా యుద్ధంలో చేరక తప్పదని అమె రికా భావం. నిన్నటివరకు తటస్థంగా వున్న రాజ్యాలుకొన్ని యీవాళే యుద్ధంలోకి దిగినై. నేడు తటస్థంగానున్న రాజ్యాలు కొన్ని రేపు యుద్ధంలోకి దిగవచ్చు. తటస్థంగానున్న రాజ్యాలు యుద్ధంలోకి దిగడానికి కారణం బలవంతమే. ఏవైపు ఒత్తిడి యెక్కువైతే ఆ వైపు చేరవలసివుంటుంది, నిస్సహాయపు దేశాలు. మొదట బ్రిటనుకు సానుభూతి చూపింది నార్వే. కొద్దినెలలలోనే జర్మనీకి లొంగిపోవలసివచ్చింది—యీరోజున జర్మనీతో జేరి రష్యామీదికి కాలుదువ్వుతూవుంది. బల్గే రియాకూడ అంతే అయింది.

సొవియట్ సరిహద్దుదేశాలు కొన్ని నిర్బంధింపబడు చున్నవి—యీ యుద్ధంలో చేరమని. ఈ దేశాలు యుద్ధం లోకి దిగితే సొవియట్ల శాంతికే భంగం కల్గుతుంది. అందుకనే, తన క్షేమాన్ని స్థిరపరచుకోడానికి, కాపాడు

శ్రీ వేమన గ్రంథాలయము
తెలప్రోలు (కృష్ణా)

కోడానికే సోవియట్ తటస్థవిధానాన్ని వహించింది. తటస్థ విధానాన్ని నిలబెట్టుకోను తగిన తయారులో నుండవలసి వచ్చింది. అందుచేతనే తన ఉత్పత్తిశక్తిలో యెక్కువ, తన ద్రవ్యసాధనాల్లో గొప్పవంతు నుపయోగించి సోవియట్లు గూడా యుద్ధానికి సిద్ధంగావలసివచ్చింది. యుద్ధం పెరిగేకొద్దీ సోవియట్లకు తాటస్థ్యం యెక్కువ అవసరం. తటస్థంగా నుండవలసిన అవసరం యెక్కువయ్యేకొద్దీ, తటస్థంగా నుండడం యెక్కువ కష్టమౌతూవున్నది. ఈ విషమపరిస్థితి సోవియట్ రాష్ట్రానికి సోవియట్ ప్రజలకుమాత్రమేగాదు. ఈ యుద్ధం ప్రపంచమంతటికి గూడా దుర్భరమైన స్థితులను సమకూరుస్తూంది.

సోవియట్ విధానం ఆరంభమైనప్పటినుంచి ప్రపంచాన్ని పాలిస్తున్న రాజ్యాంగవిధానాలు రెండు రకాలుగా భాగింపబడ్డవి—పెట్టుబడిదారి రాజ్యాలని, సామ్యవాద రాజ్యమని. సోవియట్ సంయుక్తరాష్ట్ర నిర్మాణం అంతర్జాతీయ రాజకీయాల్లో నొక గొప్ప మార్పును దెచ్చింది. ఇంతకుముందెన్నడులేని నూతనశక్తి యొకటి నిర్మింపబడ్డది. తనజీవితాన్ని, తన అభివృద్ధిని శాంతిమార్గాల నడపదలచుకున్న నూతన రాజ్యాంగవిధానం యేర్పరుపబడుటకు చరిత్రలో యిదే మొదటిసారి. నిజంలో సోవియట్ చరిత్రకు, ప్రపంచంలోని యితర రాష్ట్రాలు అంతర్జాతీయ శాంతి సఖ్యతలకు తోడ్పడవలెనని చేయు ప్రయత్నాలకు భేదం లేదు. ఇంతవరకు యీ ప్రయత్నాన్ని మానకుండా సాగిస్తున్నది సోవియట్.

సొవియట్ చరిత్ర రెండు సామ్రాజ్యవాదయుద్ధాల మధ్య కాలంలో పెంపొందింది. ఈ యుద్ధాలు రెంటికి, ప్రత్యేక కారణాలు—భిన్నాశయాలతో పెద్ద రాజ్యాంగాలన్నీ యెడ తెగక యుద్ధానికి తయారుగావడమే. ఈ పెద్దరాజ్యాల రహస్య రాజకీయవిధానము యెంతసేపటికి ఒకట్టే దృష్టితోనే నడపబడుతూంది. ఈ దృష్టి యేమిటంటే, యుద్ధంలోగూడా తమకు సహాయకరంగా నుండాలనే వీరు శాంతిసమయంలో ఉపాయాలు పన్నుతుంటారు. సొవియట్, తన నూతన ఆదర్శాలు కారణంగా ప్రపంచ నాయకత్వాన్ని వహించడం ఇతర ప్రభుత్వాలు సహించలేకపోయినై. ప్రతి దేశంలోని ప్రజాబాహుళ్యం సొవియట్‌పట్ల ప్రేమగలిగుండ డంచేత ఇతర ప్రభుత్వాలు సొవియట్లనేమీ చేయలేక పోయినై. ప్రపంచంలోని అధికారవర్గాలు ఒకవైపు నోటి మాటలతో శాంతిప్రచారం చేస్తూ, మరొకవైపు యితర ప్రభుత్వాలతో యుద్ధాలోచనలుచేసినవి. ఈ ఆలోచనలన్నీ యుద్ధానికి సిద్ధపడుటకే చేయబడినవి. ఇతర ప్రభు త్వాలన్నీ మానవుని అభ్యుదయానికి యుద్ధం అవసరమని నమ్ముచున్నవి. అందుచేత కుట్రాలోచనలు సాగిస్తూనే వుంటవి.

3-3-1918 న బ్రెస్ట-లిటొవ్‌స్క్‌వద్ద సొవియట్ ప్రజా స్వామ్యం, అగౌరవమైన, అతినీచమైన, అతికష్టదాయకమైన సంధికి ఒప్పుకుంది జర్మనీతో. ఎందుకు? ఎలాగన్న 1914-18 మహాయుద్ధంలోనుంచి విడివడడానికి. యీ సంధి షరతులు

నీచమైనవని యెరిగి గూడా సొవియట్ ఒప్పుకుంది. ఈసంధి జర్మనీ రష్యాలకు మాత్రమే జరిగింది. ఈ సంధి జరిగిన తర్వాత ఇతర ప్రభుత్వాలన్నీ కలిసి, తమ సైన్యాల నంపి సొవియట్‌రాజ్యంలో అంతఃకలహాలను లేవదీసి, అంతర్యుద్ధం సాగించాయి. సొవియట్లకు విరుద్ధంగా ఇతర ప్రభుత్వాలన్నీ విప్లవవిరోధులకు సాయపడ్డవి. ఈ అంతర్యుద్ధంలో కావలసినంత ద్రవ్యం, ఆయుధసామాగ్రి విద్రోహులకు పంపినవి. ఈ అంతర్యుద్ధం మూడేండ్లు హోరాహోరి సాగింది. సామ్రాజ్యవాదయుద్ధంలో నుంచి తప్పుకున్నందుకు రష్యా చెల్లించిన అపరాధం బ్రెస్ట్-లిటొవ్‌స్క్ సంధిమాత్రమేగాక, మూడేండ్ల అంతర్యుద్ధంగూడను. ఈ అంతర్యుద్ధాన్ని పూర్తిగా ప్రపంచ పెట్టుబడిదారివర్గం లేవదీసి, సాగించింది. ఇందుకు నిదర్శనం జార్జిబెర్నార్డ్‌షాగారి యీ క్రింది వాక్యాలే.

"రష్యా కొత్తవిధానాన్ని, కొత్తప్రభుత్వాన్ని స్వరూపనాశనం చెయ్యాలని మనమెంతో తెలివితక్కువగా యత్నించాం. సొవియట్ ప్రభుత్వాన్ని గురించి మనపత్రికలు అపభ్రంశాలెన్నో ప్రకటించాయి. టైమ్సువంటి పత్రికకూడా అదే ధోరణి నవలంబించింది. ప్రపంచ ముఖ్యనగరాలలో పెట్టినట్లు, రష్యాలోగూడా టైమ్సుపత్రిక సరియైన విలేఖరిని పెట్టక, రీగానుంచి యెటువంటి తప్పుడువార్తవచ్చినా ఘోరంగా ప్రకటించేది. అదే రష్యారాజకీయా లంటూ ప్రజలలో ప్రచారంచేసేది.

"రష్యాలో అరాచకం వచ్చిన రోజులలో, 'తెల్లసేన'లో పని లేనివారలంతా చేరారు. విన్‌స్టన్ చర్చిలు—వీరి రోజున బ్రిటిష్ ప్రధానమంత్రిగా నున్నారు—'తెల్లసేన'కు రూ 130 కోట్లు మంజూర్

> చేశారు. ఆయనమాత్రం ఆ విషయంలో ఒక తెలివైనపని చేశాడు. కామన్సుసభలో చర్చకు తీసుకురాకుండా, ఆ సొమ్ము యూరోపియన్‌యుద్ధాని కంటూ మంజూర్ చేశాడు. రూ 130 కోట్ల కన్నా యింకా యెక్కువ యిచ్చేవాడే. అప్పటికి మాలో కొంతమంది "రష్యాజోలికి పోవద్దు" అని చెప్పబట్టి అంతటితో ఆపాడు. చర్చిల్, అప్పట్లో రష్యావిధానాన్ని మానవజాతికే శత్రువుగా పరిగణించినాడు." 1

పుట్టుకనుబట్టి ఐరిష్‌వాడు బెర్నార్డ్‌షా. కానీ యింగ్లండులోనే పెరిగాడు. ఇంగ్లాండుపౌరుడుగూడాను. గొప్పమేధావి. అనేక గొప్ప నాటకాల రచించి నోబెల్ బహుమానాన్ని పొందగలిగాడు. ఈతడు కమ్యూనిస్టు గాడు. ఫెబియన్ సొసైటి నిర్మాతలలో నొకడు. సామ్యవాది. ఈతని మతాభిప్రాయాన్నిబట్టి జూచినా, రష్యా అంతర్యుద్ధం ప్రపంచ పెట్టుబడిదార్ల అంత్యప్రయత్నమని విశదమౌతుంది.

1917 దాకా రష్యాలో నున్న సామ్రాజ్యప్రభుత్వం నాశనం చేయబడడం ప్రపంచంలోని యితర సామ్రాజ్యవాదులు, వారి ప్రభుత్వాలు సహించలేకపోయారు. సోదరుని మరణాన్ని సహించడం సులభమా ? అందులో రక్తసంబంధానికన్నా ఆర్థికబాంధవ్యం యెక్కువైనది. పైగా రష్యాలో సామ్రాజ్యవాద ప్రభుత్వానికి బదులు సామ్యవాద ప్రభుత్వం నెలకొల్పబడడం తమందరికి ముప్పు వాటిల్ల

(1) 1-6-1941 ప్రజాబంధు, 5 వ పుటలోని "ప్రపంచ శాంతివ్యాప్తికి సొవియట్ రష్యా ఆధారం అన్న శీర్షికనుండి.

డానికి ఆరంభమేనని సామ్రాజ్యవాదులు అధైర్యపడ్డారు, భయపడ్డారుగూడాను. మహాయుద్ధంనుంచి రష్యాతప్పుకోడం మూలాన, సామ్రాజ్యవాదులలో ఒకవైపువారికి కొంత సహాయమైంది. నిజంలో యీ సహాయం నిత్యమైందికాదు. కానీ, ప్రపంచంలో ఆరోవంతు, సామ్రాజ్యవాదుల కలయికలోనుండి చీలిపోవడం, వారి పన్నాగాలకు కుఠారఘాతమయింది. రష్యాను ఏవిధంగానైనా మళ్ళీ తమ వర్గంలోకి తేవలెనన్నదే సోవియట్‌మీద సామ్రాజ్యవాదులు జరిపిన యుద్ధానికి ముఖ్య ఆశయం. ఆయుద్ధంలో, రష్యానంతటిని గాకున్నా, కొంత భాగాన్నైనా, తమలో కలుపుకో ప్రయత్నించారు. పోలండ్, లట్వియా, యిస్థోనియా, లిథుయేనియాలను కలుపుకున్నారుగూడా. ఇవన్నీ పూర్వం రష్యను సామ్రాజ్యానికి జెందిన దేశాలు. ఇవేగాదు, ఫిన్లాండు గూడా యీ రకంలోదే.

ప్రపంచంలోని శక్తివంతమైన ప్రభుత్వాలలో, గొప్ప దేశాలలో, రష్యా ఒకటి. అది సామ్రాజ్యవాద కలయికలో చేరనన్న కారణం—నీతి—ధర్మము సోవియట్ ఒకటే ఒకటి. తక్కిన ప్రపంచమంతా ఒకటి. రష్యా పెట్టుబడిదారి విధానాన్నుంచి విడివడడం మూలాన సామ్రాజ్యవాద పునాదులు, ధనికవర్గపు వ్రేళ్ళు కదల నారంభించినవి. సామ్రాజ్యవాద రాజ్యాల్లోని కక్షలుగూడా యిందుకు కారణం. ప్రతి కక్షిదార్లు సోవియట్‌ను, తమతో కలుపుకోవాలంటే తమతో కలుపుకోవాలని (ప్రయత్నిస్తున్నారు) ఉబలాటపడుతున్నారు.

సోవియట్ దేనితో చేరడానికైనా సిద్ధమే. ఆదర్శం భిన్నం కానంతవరకు శాంతిని దృఢపరచడానికి, రాష్ట్రాలన్నిటికి భద్రతను పరస్పరం కాపాడడానికి, యేర్పడే యే సఖ్యతనైనా ప్రోత్సాహించడానికి, చేరడానికి, సోవియట్ సిద్ధంగా నున్నది. సోవియట్ అంతర్జాతీయ రాజకీయాల్లో సూచిస్తున్న నూతన దృక్పథాలు, సామ్రాజ్యవాదులకు (వారి విరోధులకంటే యివే) యెక్కువ అపాయకరంగా కనబడ్డవి. అందుచేత సామ్రాజ్యవాదులు — అన్నికక్షులవారు తమలో తమకెంతవిరోధమున్నా—అందరూ యీ నూతన శ్రామిక సృష్టిపై ద్వేషం వహించారు. ఈ ద్వేషం నానాటికి అభివృద్ధి అవుతూనే వుంది. సోవియట్‌రాష్ట్రాన్ని ధ్వంసం చేయడం యెంత అత్యవసరంగా సామ్రాజ్యవాదులు యెంచారన్నది గ్రహించాలంటే, సోవియట్ పై 14 పెట్టుబడిదారీ ప్రభుత్వాలు 1918 1923 మధ్య సాగించిన దండయాత్రను జ్ఞాపక పరుచుకోవాలి. ఇంత విశ్వప్రయత్నం సామ్రాజ్యవాదులు జేసినా, గండాలన్నీ దప్పి సోవియట్ నిలబడగలిగింది. ఈవిషయాన్ని వర్ణిస్తూ బెర్నార్డ్‌షా యిలా అన్నాడు—

> "విధి బలీయమైనది. సోవియట్ ప్రభుత్వాన్ని అంతమొందించాలనుకున్నారు, అందరు. అప్పట్లో సోవియట్‌లో కొద్దిమంది యువకులు, కొన్ని బొరినింగ్‌పిస్టల్సు తప్ప యెక్కువ ఆయుధసంపత్తి కూడా లేదు. యూరప్ అంతా తనమీద కత్తికట్టింది. "తెల్ల సైన్యాల"కు సరఫరాజేసిన రూ 130 కోట్లతోటే, సోవియట్‌ప్రభుత్వం యెదిరి వారిని దేశంలో నిలువనీయకుండా తరిమింది. 'తెల్ల సేనల' ను పరుగెత్తించింది.

"రూ 130 కోట్లంటే మీ ఉద్దేశం యేరూపంగా వుందని అనుకుంటూరు? ఆయుధాలు, దుస్తులు, జోళ్ళు, కంబళ్ళుగా యింగ్లాండునుంచి రష్యా వెళ్లాయి. వాటిని రష్యన్ రెడ్ ఆర్మి ఉపయోగించుకుంది. బ్రిటిష్‌జోళ్లు తొడుక్కొని, బ్రిటిష్‌తుపాకులతో 'తెల్లసేనల' ను చెల్లాచెదరు చేశాయి యెఱ్ఱసేనలు. అందరు ఒకటి తలిస్తే విధి ప్రతికూలంగా మరొకటి చేసి వూరుకుంది. తెల్లసేనకు పంపిన ప్రతి వస్తువు ఎఱ్ఱసేనలకు చక్కగా వుపయోగపడింది. ఎఱ్ఱసైన్యాల చేతికి ఆ వస్తువులు చిక్కడమే విధియొక్క విచిత్ర సంఘటనం. ఇంతకంటే విధి ప్రాబల్యానికి మీకు నిదర్శనం కావాలా?" 1

సామ్రాజ్యవాదులు తనపై చూపుచున్న ద్వేష భావాన్ని రష్యా యెరుగకపోలేదు. సామ్రాజ్యవాదులు, సామ్యవాద రాష్ట్ర మొకటి ప్రపంచంలో వుండడం యెంత అసహ్యంతో చూచారన్న విషయం 29—3—1940న, తన ఉపన్యాసంలో మాలటోవ్ యిలా విశదీకరించాడు—

"సామ్రాజ్యవాదపు రాజ్యాలకు మనపై నెప్పుడూ ద్వేషమే. ప్రస్తుతం యీ దేశాలకు జర్మనీతో జరుగుచున్న యుద్ధంలో, జర్మనీకి విరుద్ధంగా మనం వారితో చేరకపోవడంచేత మనపై క్రోధం మునుపటికంటె యెంతో హెచ్చింది. దీనినిబట్టి ఒక విషయం స్పష్టమాతూంది. సామ్రాజ్యవాదుల్లో, అంతఃకలహాలున్నా, వర్గకలహసమస్య వచ్చేటప్పటికి వారి ద్వేషం — క్రోధం మనపట్ల ద్విగుణీకృతమాతున్నవి."

---

(1) 1-6-1941 'ప్రజాబంధు' 5వ పుటలోని "ప్రపంచ శాంతివ్యాప్తికి సావియట్ రష్యా ఆధారం" అన్న శీర్షికనుండి.

సోవియట్‌రాష్ట్రం శాంతితో నెలకొల్పబడ్డదికాదు. కానీ, అంతర్జాతీయ సమస్యలను తాను, మిగత ప్రపంచం కలిసి శాంతియుతమైన మార్గాలలో పరిష్కరించుకొనవలె నని కోరుచున్నది. పెట్టుబడిదారి రాష్ట్రాలు యీ సమస్యలను హింసాయుతమైన మార్గాలతో, దౌర్జన్యసహాయంతో పరి ష్కరించ ప్రయత్నిస్తున్నవి. ఈ పరిష్కారానికై, ఒక రాష్ట్రానికంటే మరో రాష్ట్రానికి యెక్కువ ఆయుధబలం ఆవశ్యకం. ప్రపంచ పెట్టుబడిదారివర్గం, సోవియట్‌రష్యాను ధ్వంసం చేయాలని, జారుబానిసలైన తెల్లభటులను లేవదీసి తమ సైన్యాలనంపి, చేయగల్గినంత విశ్వప్రయత్నంజేసింది. ఈ ప్రయత్నాలే 1917-1920 మధ్య జరిగిన రష్యాలోని అంతర్యుద్ధం. సంపూర్ణ శాంతియుతులైన రష్యనులు యీ యుద్ధాల్లో తమ ధైర్యసాహసాలను, యుద్ధ నిపుణత్వాన్ని, ఉపాయాలను ప్రపంచమంతటికి ప్రకటించారు. దేశద్రోహు లను, పరదేశీయులైన విరోధులను ఒక్కసారిగా ఓడించి అఖండ విజయాన్ని సంపాదించారు. ఈ యుద్ధాలమూలాన— యీ యుద్ధాలలో సోవియట్ జయించగలిగినందున— సామ్రాజ్యవాద ప్రపంచం కండ్లు విప్పార తెఱచిచూడవలసి వచ్చింది, ఎఱ్ఱ సైన్యం సామాన్యమైనదికాదని. మొన్న మొన్ననే, యీ సత్యాన్నే మళ్ళీ క్రొత్త ఎఱ్ఱ సైన్యాలు ప్రపంచానికి ప్రకటింపగల్గినవి—జపానులో, ఫిన్లాండులో గూడాను.[1]

---

(1) 'ప్రజాబంధు' 3-8-1941 న 7వ పుటలోని 'ఫిన్లాండుయుద్ధం' చూడనగు.

బ్రతుకే కష్టమైన అంతర్యుద్ధాల్లో సోవియట్లు జయం పొందినై. తరువాత, సోవియట్‌కు మరో కష్ట మొచ్చింది. పెట్టుబడిదారి ప్రపంచంలో తాను జీవించడ మెలా గన్న సమస్య యేర్పడ్డది. యుద్ధానంతరం (1919 పిదప) యూరప్, ఆసియా, అమెరికా ఖండాల్లోని ప్రజాబాహుళ్యం సోవియట్ పట్ల చూపిన సానుభూతికారణంగా సామ్రాజ్యవాద ప్రభుత్వాలు సోవియట్‌పై యెట్టి సైనికప్రయత్నాలు సల్ప వీలు లేకపోయింది. అందుచేత కుట్రలు పన్ననారంభించారు పెట్టుబడిదారి రాజకీయవేత్తలు. లోపాయకారీ ఆక్రమణను, రహస్యవిధానాన్ని, బహిష్కారాన్ని, ఒకటివెంట నొకటిగా అన్నింటిని సోవియట్‌పై ప్రయోగించారు. యుద్ధంమినహా మిగత అన్నివిధాల సోవియట్‌ను రూపుమాప ప్రయత్నించారు, కాని ఫలించలేదు వారి ప్రయత్నాలు. సామ్రాజ్యవాదులు పొందిన యీ ఓటమిని గురించి లెనిన్ సూక్ష్మంగా వర్ణించాడు—

"అంతర్జాతీయ పెట్టుబడిదారివర్గం మనపై చెయ్యియెత్తాలే గాని ఆ చేతిని వెంటనే వారి దేశాల్లోని పారిశ్రామికులే తొలగిస్తారు."

పై విషయాన్నే స్థిరపరుస్తూ బెర్నార్డ్ షా యిలా అన్నాడు—

"విన్‌స్టను చర్చిలు 'తెల్ల సేనకు' రూ 130 కోట్లు మంజూర్ చేశాడు. ... ...రూ 130 కోట్లకన్నా యింకాయెక్కువ

యిచ్చేవాడే. అప్పటికి మాలో కొంతమంది "రష్యా జోలికి పోవద్దు" అని చెప్పబట్టి అంతతో ఆగింది. "

1914-18 మహాయుద్ధానికి పూర్వం రష్యాకు సామంత రాజ్యాలుగానున్న కొన్ని దేశాలు యుద్ధానంతరం స్వతంత్ర రాష్ట్రాలైనవి. ఈ రాష్ట్రాలు సోవియట్ పొలిమేరల నున్నవి. ఈ చుట్టుపక్క రాష్ట్రాలతో రష్యా జరుపవలసివచ్చిన రహస్య రాజకీయ సంబంధాలకు మొదటినుంచి ఒక ఆటంక మేర్పడ్డది. ఈరాష్ట్రాల్లోని ప్రజాబాహుళ్యం సామ్యవాదాన్ని నెలకొల్పాలని ప్రయత్నించడం; ఆ దేశాల్లోని ధనికవర్గం, పెట్టుబడిదారి రాజ్యాల్లోని ధనికవర్గం సహాయంతో తమ ప్రజాబాహుళ్యాన్ని అణగద్రొక్కి తమ ఆధిపత్యాన్ని దేశములో స్థిరపరచడం. అందుచేత ప్రజల ప్రయత్నాలన్ని వ్యర్థమైనవి. ఈ తంతంతా 1915, 20 లోగా జరిగింది. ఈ చిన్న రాష్ట్రాలు—ఫిన్లాండు, లట్వియా, లిథోనియా, ఇస్థోనియా మొదలైనవి, తమ పరిసరరాష్ట్రమైన సోవియట్‌తో స్నేహముగానుంటే, ఆర్థికంగా వాటికెంతో లాభకరం. సోవియట్ కొద్దిపాటి దేశంగాదు. రెండు ఖండాల్లోను వ్యాపించియున్న గొప్పరాష్ట్రం. ఇవో? చిన్న రాష్ట్రాలు. ఉత్పత్తి విధానంలో సోవియట్ వీటికంటే ముందంజవేస్తూవున్నది. సహజసంపత్తి యందు సోవియట్‌లో వెయ్యోవంతైన వుండవు యీ చిన్న రాష్ట్రాలన్నీ కలిసినా. అట్లుండిగూడ యీ చిన్నరాష్ట్రాలు

(2) 'ప్రజాబంధు' 1-6-1941 సం 5 వ పుటలోని, 'ప్రపంచశాంతి వ్యాప్తికి సోవియట్ రష్యా ఆధారం' అన్న శీర్షికనుండి.

సోవియట్‌పట్ల ద్వేషభావాన్ని వహించినవి. అయితే యీ ద్వేషం ఈ రాష్ట్రాల ప్రభుత్వాలకేగాని ప్రజలకు లేదు. ఇందుకు కారణం, యీ రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ప్రపంచ పెట్టుబడిదారుల చేతులలో నుండడమే. వీరు, అధికారాన్ని సంపాదించను ప్రపంచ పెట్టుబడిదార్ల సహాయాన్ని కోరారు. అపారంగా యీ సాయాన్ని పొందారుగూడాను. అందుచేత అట్టి వర్గం చేతుల్లో కీలుబొమ్మలయ్యారు వీరు. ఎప్పటికప్పుడు యీ చిన్నరాష్ట్రాలను సోవియట్ మీదికి యెగతోలుతుంటుం దీప్రపంచ పెట్టుబడిదారివర్గం. ఈ నాటకాన్ని కొంతవరకీ రాష్ట్రాల్లోని ప్రజలు గ్రహించగల్గారు. అందుకనే, సోవియట్‌పట్ల యీ ప్రజలకు ప్రేమ మెండు. ప్రేముంటే యేం? చెయ్యగల్గినదేముంది? తమ ప్రభుత్వాల తొలగించగల్గినంత శక్తివారికి లేదు. అప్పటికీ, తమ ప్రభుత్వాభిప్రాయాలకు విరుద్ధంగా, సోవియట్‌పట్ల తమకుగల స్నేహభావాన్ని ప్రకటించారు. సోవియట్లతో ఆర్థికసంబంధాలు కలుగజేసుకోవాలని కోరారు. ఇందుకు వారి అధికారవర్గం ఒప్పుకుంటుందా? ఈ అధికారవర్గాన్ని నిలబెట్టి, బలపరుస్తున్న ప్రపంచ పెట్టుబడిదారివర్గం ఒప్పుకుంటుందా ? ఈ చిన్న రాష్ట్రాలు తమకు స్థిరంగా లొంగియుండడానికై పెద్ద పెట్టుబడిదారి రాష్ట్రాలు వీటి ఆర్థికజీవితంలో పాల్గొన మొదలు పెట్టినవి. ఈవిధంగా యీ చిన్నరాష్ట్రాలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడంచేత, తమకు పెట్టుబడిపెట్టిన పెద్దరాష్ట్రాల అడుగులకు మడుగులొత్తక తప్పిందిగాదు. పెద్దరాష్ట్రాలు వీటిని

తమ బానిసరాష్ట్రాలుగా మార్చి, సోవియట్ పైకి తమ ఉద్యమాల సాగించడానికి వీటిని విహారస్థలాలుగా జేసుకున్నవి. సోవియట్‌కు విరుద్ధంగా కుట్రలుపన్న మొదలుబెట్టినవి. ఈ కుట్రలు ప్రస్తుత యుద్ధారంభంవరకు జరుగుచూనే యున్నవి. ఈ యుద్ధంకారణంగా సోవియట్ యీ చిన్న రాష్ట్రాలతో పరస్పర రక్షణకై కొన్ని యేర్పాట్లు చేసుకోక తప్పిందిగాదు. ఈ రాష్ట్రాల ప్రభుత్వాలు పెట్టుబడిదారుల చేతులలో నున్నవి. ఇరవై యేండ్లనాడు తమ యిష్టానికి విరుద్ధంగా సోవియట్‌తో తెంపుకున్న తమ స్నేహబంధాల నిప్పుడు మళ్ళీ ముడిబెట్ట యత్నించారు యీ చిన్నరాష్ట్రాల ప్రజలు.

సోవియట్ పరిస్థితులలో యీ యుద్ధానికి గడచిన యుద్ధానికి చాల వ్యత్యాసముంది. ఈ వ్యత్యాసానికి కారణం సోవియట్ బలం పెరిగిపోవడమే. తన శక్తి పెరగడంమూలాన గడచిన యుద్ధాంతంలో పోగొట్టుకున్న తన రాష్ట్రభాగాలను యీ యుద్ధసమయంలో మళ్లీ సోవియట్ తనలోకి చేర్చుకుంటున్నది.

ప్రపంచ పెట్టుబడిదారి ప్రభుత్వాలన్నీ, రహస్య రాజకీయవిధానాల్లో సోవియట్‌నుబహిష్కరించినవి మొదట. కానీ, ఆర్థికలాభాలు కారణంగా చుట్టుప్రక్కలనున్న చిన్న రాష్ట్రాలు సోవియట్‌తో రహస్యరాజకీయసంబంధాలు కలుగ జేసుకోక తప్పిందిగాదు. చిన్నరాష్ట్రాలనుబట్టి పెద్ద పెట్టుబడి దారిరాష్ట్రాలుగూడా, కేవలం ఆర్థిక స్వలాభంకోసం సోవియట్‌తో రహస్య రాజకీయ సంబంధాలను, ఒకటివెంట

నొకటిగా, ఏర్పరచుకొన్నవి. అమెరికామాత్రం సోవియట్‌తో సఖ్యతకు మొదట పూనుకోలేదు. నిరసన భావంతోనే వుంటూ వచ్చింది. విధిలేక చేసుకున్న సంబంధాలగుటచేత పెట్టుబడిదారి ప్రభుత్వాలు, తమకు సోవియట్‌కు యేర్పడ్డ చుట్టరికాన్ని బాధకరంగా భావించారు మొదటినుంచి. కొన్ని సందర్భాల్లో రాజకీయరంగంలో సోవియట్ యెక్కువ ఉదారభావంతో ప్రవర్తించడం పెద్ద పెట్టుబడిదారి రాష్ట్రాల కండ్లుకుట్టినట్లైంది. ముఖ్యంగా, చైనాపట్ల సోవియట్ చూపిన ఉదార భావాన్నిచూచి పెట్టుబడిదారి రాష్ట్రాలు కోపగించినవి. ఇంతకుపూర్వం, జారు ప్రభువులు చైనాను తమ బానిస రాజ్యంగా చూస్తూవచ్చారు. అలా గాకుండా, చైనాను సోవియట్ తనతో సమానంగా చూడడం, తప్పుత్రోవ దీయడమని పెట్టుబడిదారి ప్రభుత్వాలు నిరసించినవి. సోవియట్ రాష్ట్రాన్ని గుర్తించడానికి తమకు పారితోషిక మేమాత్రం గిడుతుందని యోజించిన వీ పెట్టుబడిదారీ ప్రభుత్వాలు. సోవియట్ తమకు కొన్ని ప్రత్యేక హక్కులను కల్గించాలనిగూడా కోరినవి. ఈ పెట్టుబడిదారి ప్రభుత్వాల ప్రయత్నాలకు సోవియట్ గనక లొంగివుంటే యిప్పటికి సోవియట్ అంతరించిపొయ్యేది. రష్యా మిగిలేది. వీరు కోరిన హక్కులు యుద్ధం మినహా, ఆక్రమణలంతవి. ఇట్టి ప్రయత్నాల్లో ముఖ్యమైనది 1922 లో పెట్టుబడిదారి ప్రభుత్వాలన్నీ కలిసి చేసిన జినోవా సమావేశం.

సోవియట్ రాజ్యనిర్మాణ ప్రారంభంనుంచి పెట్టుబడిదారి రాష్ట్రాలు కుట్రలు పన్నుతునేవున్నవి. రష్యా విషయాలన్న పేరుతో కొన్ని సంవత్సరాలకాలం పెట్టుబడిదారి ప్రభుత్వాలు చర్చించినవి—జారుల బాకీలు, యుద్ధ ఋణాలు, ఆస్తులు, తిరిగి యివ్వడాలు, యుద్ధ నష్టపరిహారాలు, కప్పములు, మినహాయింపులు, అరువులు, అప్పులు, రష్యా విదేశాంగ వ్యాపారముపైని గుత్తలు, మొదలైనవాటిని. సోవియట్ ప్రస్తుత ఆర్థికస్థితిని మార్చాలని, మళ్ళీ రష్యాను ప్రపంచ పెట్టుబడిదారి ఆర్థికస్థితికి తేవాలని, సోవియట్ పోకడలను సామ్యవాదంనుండి తప్పించాలని, పెట్టుబడిదారి ప్రభుత్వాలన్నీ ప్రయత్నించినవి. ఈ ప్రయత్నాలన్నిటిని ధైర్యంతో సోవియెట్ ఎదుర్కో- గలిగింది. ఇతర దేశాలలోని పరిస్థితులతో తన కేవిధమైన సంబంధం లేదని మొదటినుంచి సోవియట్ జాగ్రత్తగానే ప్రవర్తిస్తూంది. ఇతర దేశాలుకూడా తన దేశంలోని పరిస్థితులతో యేవిధంగాగూడా కలుగజేసుకొనకుండా వుండాలనే కోరుతూంది. అన్ని దేశాలతో ఆర్థిక సఖ్యతను కలుగజేసుకొనడానికి ప్రయత్నిస్తూంది. సోవియట్ రహస్య రాజకీయాలు, వ్యాపారము, అభివృద్ధిగాకుండా చేతనైనన్ని అడ్డంకుల నేర్పరచాయి పెట్టుబడిదారి ప్రభుత్వాలు. ఇవన్నీ గూడా సోవియట్ ఆర్థికాభివృద్ధిని ఆపలేకపోయినవి. ఈవిషయాన్ని స్పష్టపరుస్తూ బెర్నార్డ్‌షా యిలాఅన్నాడు—

"రష్యాతో వ్యాపారంకూడా చెయ్యమని మనం అప్పట్లో భీష్మించాం. మన డబ్బు రష్యాలో పెట్టుబడిపెట్టడానికి ఒప్పుకో

లేదు. మనకేమాత్రమైనా ఆలోచనుంటే అలా చేసివుండం. నే నొకసారి యీ విషయం ఎలక్షన్ సందర్భంలో వుపన్యసించాను. మనం రష్యాలో ధనం పెట్టుబడిపెడ్తే వడ్డీగాని, అసలుగాని రాదని పత్రికలు చేసే ప్రచారం నేను కాదనను. మన పనివాళ్ళను వూరికే కూర్చోబెట్టి ముష్టి పంచిపెట్టేకన్నా, రష్యాలో యంత్రాలు నెల కొల్పి అచ్చటి పనివారికి పని కల్పించడం యెక్కువ ఘనకార్యం కదా ? అని ప్రశ్నించా. యే అభ్యర్థితరఫున నేను పనిచేశానో అతడు ఓడిపొయ్యాడంటే అందులో ఆశ్చర్యమేముంది. "అలా జరగడం రష్యాకే నయమయింది. ఇంగ్లీషు పెట్టుబడిదారులు తరుణంలో మేల్కొని పెట్టుబడిపెట్టివుంటే, రష్యాలో చాలా సంస్థలకు వాళ్ళే (ఇంగ్లీషు పెట్టుబడిదార్లు) యజమానులుగా వుండేవాళ్లు. అలా జరగకపోబట్టే రష్యా పారిశ్రామిక సంస్థలు రష్యన్లకే నిల్చాయి,................" (1)

సోవియట్ తన దృక్పథంలో విజయవంతంగా నడిచింది. నడుస్తూవుందికూడాను. ఈ అడ్డంకులలో ఆఖరువరకు మొండిపడి విఫల మనోరథులైనవారు అమెరికను అభివృద్ధి నిరోధకులే. 1933 ఆఖరుదాకా సోవియట్—అమెరికాలకు యెలాంటిసఖ్యత కుదరకుండాజేశారు యీ అమెరికన్ అభివృద్ధినిరోధకులు. సామ్యవాదాన్ని వ్యాపింపజేయడానికి తన పొలిమేరలకు వెలుపల సోవియట్ యెన్నడు ప్రచారం సాగించలేదు. ఇతర దేశాల అభివృద్ధి నిరోధకులు వారి ప్రచారకులు సోవియట్ విరుద్ధప్రచారాన్ని తమ దేశా

(1) 1-6-1941 ప్రజాబంధు, 5వ పుటలోని 'ప్రపంచశాంతివ్యాప్తికి సోవియట్ రష్యా ఆధారం' అన్న శీర్షికనుండి.

ల్లోనే గాకుండా సోవియట్‌లో గూడా సాగించి జరుపుతున్నారు.

వారుచేసే దుష్ప్రచారంలోని కొన్ని మచ్చులు :

"సోవియట్‌లో బలవంతాన కూలీ చేయిస్తారు"

"మతపీడన యెక్కువ"

"చౌకవస్తువులను పెట్టుబడిదారి దేశాల కెగుమతి యెక్కువగా జేసి పెట్టుబడిదారి దేశాల స్వదేశవ్యాపారాన్ని నాశనం చేస్తూన్నారు"

"నియంతృత్వం ఆ దేశంలో నాటుకపోయింది"

అని యీలాంటి దోషారోపణలతో సోవియట్‌కు విరుద్ధంగా ప్రచారం సాగిస్తున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడైన హూవరు సోవియట్‌తో అమెరికా కేలాంటి సంబంధం వుండగూడదన్నాడు. ఎంచేతనయ్యా అని వారినడిగితే, సోవియట్ యేమాత్రం ఉత్పత్తి సాగించలేదని, సోవియట్ అనేటప్పటికల్లా వారికి ఆర్థికశూన్యత జ్ఞాపకానికొస్తుందని వారన్నారు. మరికొందరు పెట్టుబడిదారి రాజకీయ వేత్తలు, ప్రపంచ బజారులమీద చౌకవస్తువులను సోవియట్ కురిపిస్తూందని నిందించారు. అభివృద్ధి నిరోధకులలోనే కొందరు సోవియట్ అపరిమితంగా ఉత్పత్తి సాగిస్తూందని, మరికొందరు సోవియట్‌కు ఉత్పత్తి అంటే యేమిటో తెలియదని అంటున్నారు. ఈ నిందలన్నీ పరస్పర విరుద్ధమైనవైనా సోవియట్‌పట్ల ద్వేషభావాన్ని కలిగించడానికి, ఆభావాన్ని అభి

వృద్ధిపరచడానికి యివన్నీ యేకమై పనిజేసినవి. ఈ విషయమై జార్జి బెర్నార్డ్‌షా యిలా అన్నాడు—

"నేటి అభివృద్ధి (1935) ని బట్టిచూస్తే, రష్యా కొద్దికాలంలోనే యితరులకు పెట్టుబడి పెట్టగల సూచనలు కనబడుతున్నాయి. ఆ విషయమై యెటువంటి అనుమానం లేదు. రష్యా పెట్టుబడులు మన దేశానికి పాకితే, మన దీవులుకూడా రష్యాకు చెందిపోతాయేమో అని భయంకూడా నాకు వేస్తూంది. రష్యాలో పనికాలం తగ్గుతూ వస్తే, వడ్డీలిచ్చుకోడానికి మన పనికాలం యెక్కువ చేసుకోవలసి వస్తుందేమో చెప్పలేను. వాళ్ళల్లో వాళ్ళు పెట్టుబడిదారి పద్ధతి నవలంబించక పోవచ్చు. మరో దేశంలో పెట్టుబడిదారి పద్ధతివల్ల కలిగే ప్రయోజనాల లాభం యెందుకు పొందకుండా వుండాలి? రష్యా అధీనంలోకి సమస్త ప్రపంచం వచ్చేటట్టు ఎందుకు యత్నించకుండా వుంటారు? [1]

ప్రపంచశాంతిని నెలకొల్పడానికి సోవియట్ ఆధారభూతమైన గొప్ప శక్తియని నమ్మినవారందరికి, యీ దుష్ప్రచారాన్ని అడ్డడం, అత్యవసరమైన కర్తవ్యమయింది. ప్రపంచవ్యాప్తమైన యీ సోవియట్ విరుద్ధప్రచారం ఒకరోజుది గాదు. ఒక దేశంలోదిగాదు. సామ్రాజ్యవాదుల్లో అగ్రగణ్యులనే వారందరు, సోవియట్లను నిర్మూలనం చెయ్యాలన్న యత్నంతో యీ ప్రచారాన్ని సాగించారు. శాశ్వతంగా సాగించ పూనుకున్నారు. ఈనాడుగూడా సాగిస్తూనే వున్నారు.

---

(1) 1—6—1941 ప్రజాబంధు, 5వ పుటలోని "ప్రపంచశాంతివ్యాప్తికి సోవియట్ రష్యా ఆధారం" అన్నశీర్షికనుండి.

సోవియట్‌రాష్ట్రం స్థాపింపబడి నప్పటినుంచి యీ ద్వితీయ సామ్రాజ్యయుద్ధం ఆరంభమయ్యేవరకు, యితర రాష్ట్రాలు తనపట్ల నవలంబించిన మార్గాలనుబట్టి, సోవియట్ విదేశాంగవిధానంలోని ముఖ్యాంశాలు యెలామారినవో క్లుప్తముగా పరిశీలిద్దాం.

గడచిన యుద్ధానంతరం, వర్సలీసు సంధి నాధారం జేసుకొని మిత్రమండలి ప్రభుత్వాలు, జర్మనీనుండి, జర్మనీ మిత్రులనుండి యుద్ధంలో లాక్కొన్న దేశాలను తాము పంచుకో మొదలు బెట్టినవి. ఫ్రాన్సు ఉపపాదించిన యూరప్ ఖండ విధానమునకు మూలం యీ పంపకమే. వర్సలీస్ సంధి మూలాన యూరప్‌లోకల్లా ఫ్రాన్సుకు మహోన్నతస్థితి కలిగింది. ఈ సంధి కారణంగానే యూరప్‌లోని అన్నిదేశాలకంటే ఫ్రాన్సు అతి బలిష్ఠమైంది. యూరప్‌లో నూతనంగా యేర్పడ్డ రాష్ట్రాల పరస్పర సంబంధాలను, వీలైనంతవరకు చెడగొట్టడం తన క్షేమానికేనని ఫ్రాన్సు భావించింది. ఫ్రాన్సులాగా గాకుండా, పూర్వం జర్మనీకి చెందిన వలస రాజ్యాలను ఇంగ్లండు తీసుకున్నది. తద్ద్వారా పూర్వం జర్మనీ అనుభవిస్తూన్న పారిశ్రామిక ఔన్నత్యాన్ని యిప్పుడు బ్రిటను వశపరచుకుంది. ముడివస్తువులు లభించు సారవంతమైన భూములు, నావికాబలం, జర్మనీనుండి లాగుకొనబడ్డవి. యూరప్‌లోని నూతన “ఖండవిధానం” స్థిరంగా సాగించడానికి జర్మనీ, పోలండు, రష్యా, రుమేనియాల కేలాటి సఖ్యత కుదరకుండా అడ్డుచేయడం తన బాధ్యతగా వహించి,

ఫ్రాన్సు, అందుకు దగిన ప్రయత్నం జేసింది. ఇతర రాష్ట్రాలలో పరస్పర స్నేహభావాలు, సఖ్యత, సహకారం పెంపొందితే తనకు ముప్పువాటిల్లుతుందని, యీ రాష్ట్రాలలో ద్వేషాలను కల్పించి ఫ్రాన్సు వైషమ్యాలను వృద్ధిపరచింది. యూరప్‌లోనిదేశాలన్నిటిలోకి—ఫ్రాన్సుకంటెకూడా—ఆర్థికశక్తిలో జర్మనీ మితిమీరుతుండడంచేత, జర్మనీ ఆర్థికాభివృద్ధిని యెలా అరికట్టడమా? అన్న సమస్య కలిగింది మిత్రమండలికి. కానీ యీ ఆర్థికాభివృద్ధిని అరికట్టడం తన చేతగాని పని యని త్వరలో గ్రహించింది. అందుచేత, యేదోవిధంగా ఆగ్నేయయూరప్‌లో, మధ్యయూరప్‌లో జర్మనీ అభివృద్ధికి కొంత దేశం వదలివేయుట మంచిదని ఉద్దేశించినారు. ఆ దృష్టితోనే ప్రవర్తించారు. ఈ నడవడిమూలాన జర్మనీఒత్తిడి యూరప్‌లోని యితర దేశాలమీదికి వ్యాపించి మన రాష్ట్రములమీదికి రాకుండా జర్మనీ నడ్డుతుందని వారియూహ. వారి ఉపాయాలే జయప్రదమైయుంటే యూరప్‌లోని రాష్ట్రాలగతి యేమైయుండెడిదో ? ఆ రాష్ట్రాలకు సొవియట్‌కుండే సంబంధాలెలామారేవో వూహించుకోవలసిందేగాని, ప్రస్తుత పరిస్థితులనుబట్టి చెప్పవలసినవిగావు.

ఇతర రాష్ట్రాల సలహా, అనుమతులతో నిమిత్తం లేకుండానే సొవియట్ జర్మనీలు రపెల్లోవద్ద 1922 సంllలో సంధిజేసుకున్నవి. ఈ సంధిలోకి జర్మనీ దిగకుండా వుంటే సామ్రాజ్యవాద ప్రభుత్వాలు జర్మనీకి సహాయము చేస్తామన్నారు. లొంగక పొయ్యేటప్పటికి బెదరించారు

గూడాను. ఈసంధి ఫలితంగా జర్మనీ, సోవియట్ రెంటికీ లాభకరమైన ఆర్థికసహకారం కుదిరింది. ఈ సంధి మిత్రమండలికి కంటగింపుకట్టింది. వర్సలీస్ సంధివల్ల లాభాలుపొందిన రాష్ట్రాలన్నిటికి కోపంవచ్చింది. వీటితోబాటు,—వీటినిబట్టి నూతనంగా సృష్టింపబడిన చిన్నరాజ్యాలుగూడా యీ సంధిని యేవగించుకొన్నవి. ఈసంధి నేవిధంగా విచ్ఛిన్నంచేయడం? అని ఆలోచించారు సామ్రాజ్యవాద ప్రముఖులు. పెట్టుబడిదారి ప్రభుత్వాలన్నీ గలిసి, 1925 సం॥లో లొకర్నోవద్ద ఒక సమాధానం జేసుకున్నారు. దీని ముఖ్యోద్దేశం జర్మనీమీది ఆర్థికబరువును తగ్గించడం. ఈ బరువు వర్సలీస్ సంధిచే మోపబడ్డది. పైకి చెప్పబడిన కారణం యిది. నిజంలోగూడా జర్మనీ చెల్లించవలసియున్న నష్టపూర్తి మొత్తాలు కొంతవరకు తగ్గింపబడ్డవి కానీ, అసలుద్దేశం వేరు. జర్మనీ, సోవియట్లకు పొసగిన ఆర్థికసహకారాన్ని పోగొట్టుటయే వీరి అసలుద్దేశం. ఆర్థికంగా జర్మనీకి కొంతలాభం చూపెట్టి, కొంతవరకు బలవంతంమీద జర్మనీని సంధిలోకి దింపారు సామ్రాజ్యవాదులు. ఈ సంధినిబట్టి జర్మనీ పడమటి పొలిమేరలను తామెవ్వరూ దండెత్తమని సామ్రాజ్యవాదులు జర్మనీకి పూచీనిచ్చారు. కానీ, జర్మనీ తూర్పు పొలిమేరల విషయం యీ సంధిలో నిర్ణయమైనా చేయబడలేదు. అంతేగాదు యింతకంటే గొప్ప విషయం, యీ సంధి కొప్పుకున్నందుకు జర్మనీకి నానాజాతి సమితి సభ్యత్వాన్ని ప్రసాదిస్తామనిగూడా, చవులూరించారు.

జర్మనీని సోవియట్ మీదికి సామ్రాజ్యవాదులు యెన్నివిధాల ప్రోత్సహించారో యిప్పు డాలోచించి చూస్తే మనం విని, ఊహింపని విషయాలు స్పష్టమౌతవి. అట్టి ప్రోత్సాహాల్లో సామ్రాజ్యవాదు లందరిలోకి ముఖ్యంగా ఫ్రాన్సు చాలా గట్టిప్రయత్నములు చేసినది. ఈ ప్రయత్నాలవల్ల కాబోయే ఫలితాలు, కేవలం పరస్పరవిరుద్ధమైనవి. చాలకాలం సందేహించి తుట్టతుదకు లోకర్నొసంధిలో సంతకంజేసింది జర్మనీ. కానీ, జర్మనీ తనకు సోవియట్ పట్లగల స్నేహభావాన్ని ధృడపరచడానికి, 1926 లో సోవియట్‌తో సంధిజేసుకుంది. ఇదే బెర్లిన్ సంధి. ఈ సంధిని బట్టి, సోవియట్ పట్ల తన స్నేహ భావాన్ని జర్మనీ మళ్ళీ స్థిరపరచడమేగాకుండా, తన తటస్థవిధానాన్నిగూడా రూఢిచేస్తూ సోవియట్‌కు పూచీ నిచ్చింది. ఈ సంధినిగురించి మొలటోవ్ యిటీవల యిలా అన్నాడు—

> "1926 నుంచి జర్మనీతో మన రాజకీయసంబంధాలు తాటస్థ్యవిధాన సంధిపై బెర్లిన్‌సంధి—నాధారపడి యుండెను. ఆ సంధిని ప్రస్తుత జర్మను ప్రభుత్వం 1933 లో అమలులోకి తెచ్చింది మరల. ఈరోజువరకు ఆతాటస్థ్యసంధి అమలులో నున్నది. ఇంతకు పూర్వమే, జర్మనీతో తన రాజకీయసంబంధాల నభివృద్ధిపరచడానికి తగిన ప్రయత్నం చేయడం శ్రేయోదాయకమని సోవియట్ ప్రభుత్వం తలచింది. కానీ, అట్టి ప్రయత్నాలు ఫలించడానికి తగిన పరిస్థితు లిప్పటివరకు సమకూడినవికావు." (1)

---

(1) 1939 ఆగస్టులో జరిగిన 'జర్మను—సోవియట్ అనాక్రమణసంధి'ని, అంగీకారంనిమిత్తం సుప్రసిద్ధ ఆలోచన సభకు నివేదించినప్పుడు చేసిన ప్రసంగంనుంచి.

సోవియట్—జర్మనుసంబంధాలపట్ల పెద్ద రాజ్యాలు చూపిన ద్వేషభావానికి కారణం ఒకటే. పెద్ద రాజ్యాలకు కావలసిందల్లా స్వలాభం. లాభానికి అనుగుణమైన ఆశయం తప్ప పెట్టుబడిదారి దేశాలకు మరొకటిలేదు. ఈ రాజ్యాలు తమ స్వలాభాపేక్షదృష్టితో సోవియట్—జర్మను సంబంధాల్ని చూడడంమూలాన, వ్యత్యస్థభావా లేర్పడక తప్పింది గాదు. పెట్టుబడిదారి రాష్ట్రాలు కుదుర్చుకునే సంధులన్నిటికి ఆశయం ఒకటే. యిదే వాటికి ప్రధానాశయం వలస రాజ్యాల పంపకం. తమ పలుకుబడిని చెలాయించడానికి, ప్రపంచ పంపకంలోగూడా, తమ పలుకుబడిరాష్ట్రాలని, కక్షీదారురాష్ట్రాలని, అధినివేశప్రతిపత్తిని బొందిన రాష్ట్రాలని విభజించారు. విభజనకార్యమంతా కేవలం యంత్రబలంమీద ఆధారపడియుంటుంది. అందుచేతనే ప్రపంచాన్ని పంచుకోడంలోగూడా మహా అన్యాయపంపకం. అట్టి అన్యాయ పంపకాలను సమర్థించడానికి, నిర్వహించడానికి అపరిమితంగా యుద్ధసామగ్రిని తయారుచేయ నారంభించడం. ఈఆయుధోత్పత్తిలోగూడా నేను ముందా? నీవుముందా? నేనెక్కువా? నీవెక్కువా? అన్న పోటీలు. ఈ పోటీలమూలంగా యూరప్‌లో నిలకడలేక నామమాత్రంగా నున్న శాంతికి కూడా భంగం కలిగింది.

వరసలీస్ సంధి ఫలితాలను శాశ్వతంగా నిలబెట్టాలన్న పట్టుదల సోవియట్‌కు లేదు. ఎందుకుండాలి? ఆ సంధిలో తానొక పార్టీగాదు. పైన పేరూ లేదు, క్రింద చేవ్రాలు

లేదు. ఈ సంధిని గొప్పరాష్ట్రాలు మహాన్యాయంగా నిర్వ హిస్తూన్నవి. ప్రపంచ శాంతిని యెలాగన్నా నెలకొల్పడం, స్థాపించడం సోవియట్ ముఖ్యోద్దేశం. అందునించే, మొదటి నుంచి, 'ఆయుధవిసర్జన సమావేశం' లో యెక్కువ ఆసక్తితో పాల్గొన్నది. 1922 లో జినోవాలో జరిగిన సమావేశంలో అందరికంటే ముందు, 'ఆయుధవిసర్జన విధానా' న్ని ఉపపా దించింది. అప్పటినుంచి నేటివరకు అవకాశం దొరికినప్పుడల్లా 'ఆయుధవిసర్జన విధానా'న్ని ప్రోత్సహిస్తూనే వుంది. ఇందు నిమిత్తం పెక్కు మార్గాలనుగూడా సూచించింది. సంపూర్ణ ఆయుధవిసర్జన, కొంత ఆయుధవిసర్జన, క్రమంగా కొన్ని యేం డ్లలో పూర్తియయ్యే ఆయుధవిసర్జన, వివిధ రాష్ట్రాలకు ఆయుధవిసర్జనలో నుండదగు నిష్పత్తి, ఆయుధఉత్పత్తి నాపు టకు, తగ్గించుటకు గల అవకాశాలు, మొదలైన వాటిని పెక్కింటిని సూచించింది. కానీ, సోవియట్ సల్పిన యీప్రయ త్నాలన్నీ 'బూడిదలో పోసిన పన్నీరు' అయినది. ఇందుకు ముఖ్య కారణం ఆయుధవిసర్జన సమావేశంలో సభ్యులం దరూ, పెట్టుబడిదారి ప్రభుత్వాల ప్రతినిధులగుటయే. అయు ధవిసర్జనమంటే వారికి వెగటు. సోవియట్ సలహాలను పరీ క్షించాలని, వాటినిగురించి యోచించాలనే నెపంతో చాలా సంవత్సరాలు కాలయాపనజేశారు వీరు. కెల్లాగ్-బ్రియాండ్ సంధిని ఆమోదించడానికి మొదటి రాష్ట్రం సోవియట్టే. పెట్టు బడిదారి ప్రభుత్వాలు 1934 లో ఆయుధఉత్పత్తిని పైపోటీల మీద సాగించారు. ఈ పెట్టుబడిదారి ప్రభుత్వాలన్నిటికి

ఆశయా లోకటిగావు. వాటి భావాల్లోగూడా అసంగతం చాలావుంది. ఈ అసంగతం రోజు రోజుకూ పెరుగుతూనే వుంది. అందుచేతనే యుద్ధం తప్పనిసరి అయింది. యుద్ధంరాకుండా అడ్డడానికి, నానాజాతిసమితిలో రష్యను ప్రతినిధియైన లిట్వినావ్ 'ఆయుధవిసర్జన సమావేశా' న్ని 'శాశ్వత శాంతి సమావేశం' గా మార్చమని కోరాడు. సోవియట్ల యితర సలహా లన్నిటిలాగా యీ సలహానుగూడా పెట్టుబడిదారి ప్రభుత్వాలు బుట్టదాఖలుచేసినై. సోవియట్ ప్రభుత్వం యిచ్చిన సలహాలన్నిటి ఆశయం, యుద్ధాన్ని వీలైనంతవరకు అరికట్టడం; యుద్ధం తప్పనిసరియైతే వీలయినంతకాలం శాంతిని నెలకొల్పడం; యుద్ధాన్ని వెనక్కి నెట్టడం.

1914—18 మహాయుద్ధంలో కలిగిన ఆర్థిక నష్టాన్ని పూడ్చుకోడానికి 1929 వ సం॥ వరకు పెట్టుబడిదారి ఆర్థిక విధానం ఉత్పత్తిని హెచ్చుచేసింది. లాభాలు, నానాటికి మరీ హెచ్చుతూ వచ్చినై. కానీ యెన్ని రోజులీలాభం? హఠాత్తుగా పెట్టుబడిదారి ఆర్థికవిధానం భగ్నమై పోయింది. 1929 సం॥లో పెట్టుబడిదారి ప్రపంచాని కంతటికి ఆర్థిక క్లిష్ట పరిస్థితు లేర్పడ్డవి. ఈ విషమపరిస్థితులలో పెట్టుబడిదేశాలు నలిగిపోతుంటే, సోవియట్ తన ఆర్థికవిధానాన్ని, ప్రథమ పంచవర్షప్రణాళిక మూలాన స్థిరమైన పునాదులపై నెల కొల్పగలిగింది. ఏండ్లు గడచినకొలది పంచవర్షప్రణాళిక జయప్రదంగా సాగింది. కాలం గడచినకొద్దీ పెట్టుబడిదారి ప్రపంచపు ఆర్థికదుస్థితి యెక్కువగా విషమించింది. పెట్టుబడిదారి

ప్రపంచం తన దుస్థితికి దుఃఖించడంకంటే యెక్కువగా సోవియట్ సుస్థితికి ఆగ్రహం పూనింది. సోవియట్ అభివృద్ధిని సహించలేకపోయింది. సోవియట్ ఆర్థికవిజయానికి, తన ఆర్థిక అపజయానికి చాలా దగ్గర సంబంధ ముందని నిందించ మొదలు పెట్టింది. తమ ఆర్థిక విధానానికి పోటీగా, ద్వేష భావంతో సోవియట్ సామ్యవాద ఆర్థికవిధానం జరప బడుతూ వున్నదని వ్యాఖ్యానాలు మొదలు పెట్టారు సామ్రాజ్యవాద వేదాంతులు. 1929 సం॥ లోని పెట్టుబడిదారి ప్రపంచ ఆర్థిక దుస్థితికి కారణం సోవియట్టేనని, అందలి సామ్యవాద ఉత్పత్తి విధానంగూడానని వారి దూషణ. సోవియట్ రాజ్యం యేర్పడి 12 ఏండ్లు కాలేదు. సామ్యవాద ఉత్పత్తివిధానమేర్పడి 10 ఏండ్లు కాలేదు. నిజంగా, యీ రెండే పెట్టుబడిదారి ఆర్థిక దుస్థితికి కారణాలైతే అవి చాలా గొప్ప శక్తులనే చెప్పక తప్పదు. కానీ, సోవియట్ రాష్ట్రం ఏర్పడక పూర్వం, ప్రపంచం సామ్యవాద ఉత్పత్తివిధానాన్ని చవిజూడకమునుపు, పెట్టుబడిదారి ప్రపంచం ఆర్థిక క్లిష్టపరిస్థితుల నెరుగదా ? క్రిందిమాటల గమనించండి—

> "యీ దేశ భవిష్యత్ యోచించామంటే క్రమంగా క్షీణించడంతప్ప వేరు గత్యంతరం కనబడదు. ఈ దేశానికేమిటి ! వ్యక్తిగత పాశ్చాత్య ప్రపంచానికంతా యిదే స్థితి. ఈ క్రమక్షీణత, మనతో పైపోటీజేస్తూన్న రష్యాలోనిపరిస్థితులమీద నాధారపడివుంటుంది."(1)

---

(1) 13-5-1931 లండను 'టైమ్స్' పత్రికలో 'ఇంగ్లండునందలి భూస్వాములకు ఆర్థికసలహా' అన్న శీర్షికనుంచి.

పైవిధంగా అర్థంగాక కొంత, అర్థమైనా ప్రపంచాన్ని మోసంచేయడానికి కొంత, మొత్తంమీద దురుద్దేశాలతో, సొవియట్ల అభివృద్ధికి పెట్టుబడిదారి ప్రపంచ క్షీణతకు ముడిబెట్టారు, పెట్టుబడిదారి అర్థశాస్త్రవేత్తలు. కానీ, పీర్ల పండుగకు సంక్రాంతికి చుట్టరికం యెలా కుదుర్తుంది? మత కలహాలు పెంచదలచుకున్న మహనీయులమాటల్లో దప్ప!

పెట్టుబడిదారి రాష్ట్రాలమధ్యనున్న పోసగమియే, ఆర్థిక విషమపరిస్థితుల నభివృద్ధి పరచినది. ప్రపంచాన్ని మళ్లీ పెట్టుబడిదారి ప్రభుత్వాలు, కొంత మార్పుతో పంచుకోవాలన్న ఆలోచనలుగూడా ఆరంభమైనవి. ఈ ఆర్థిక దురవస్థకారణంగా పెట్టుబడిదేశాల్లోని సాంఘిక పోరాటాలు అతి తీవ్రతనుచెందినవి. బ్రిటనులోని జాతీయ ప్రభుత్వం—టోరీ ప్రభువులకు అనుకూలురు. ఫ్రాన్సులోని అభివృద్ధి నిరోధకులు మొదలైనవారందరూ గలిసి, జర్మనీలో అధికారానికి రా ప్రయత్నిస్తూన్న నాజీలను ప్రోత్సాహించ మొదలెట్టారు. నాజీలను, పెట్టుబడిదారులు ప్రోత్సహించడానికి కారణం, నాజీ లధికారానికి వస్తే రాబోయే యుద్ధ (ఆ యుద్ధం యిప్పుడు జరుగుచున్నదే) ఫలితంగా తమ యిచ్చవచ్చినట్లు ప్రపంచాన్ని పంచుకోవచ్చునన్న నమ్మకం. మంచూరియాపై జపాను దాడి, సొవియటు సరిహద్దులపై జపాను సల్పిన దాడులు, మిత్ర మండలి అభివృద్ధి నిరోధకులకు సఖ్యత కలిగించినై. వారికి

కొంత ఆశ జనించింది. తా మందరూ కలిసి ఒక్కమారు సోవియట్టుపై దాడి సాగిస్తే తమ జాతీయ, అంతర్జాతీయ సమస్యలన్నీ ఒక్కమ్మడి పరిష్కార మౌతవని వారు నమ్మారు. వారి దురాశలకు యీక్రింది వాక్యాలు చక్కని దృష్టాంతం—

"అందుచేత, చెరుపు చేయుచున్నవారును, భగవంతునికి మానవునికి గూడా విరోధులును అయిన బాల్షివిక్కులపైకి, తమ నీచ స్వలాభాపేక్ష లన్నింటిని కట్టిపెట్టి, జాతులన్నీ యేకీభవించి ఒక్క సేనగా బయలుదేరవలసిందని పోప్ [1] కోరుచున్నాడు.

"క్రైస్తు దివ్యనామంచేత వర్ధిల్లుచున్నవా రందరు యెక్కువగా, ప్రప్రథమంగా యిట్టి హృదయ, భావ సమ్మేళనలో పాల్గొనవలసి యున్నది. మరియు, భగవంతుని నమ్మి, ఆతని విశ్వసించువా రందరుగూడా యీ ప్రయత్నానికి సాయపడవలెను.

"ఇప్పుడు మనల జడిపించుచున్న అపాయం అందరికి కంటక దాయకమైనదే. కేవలం, భగవత్కల్పితమైన అధికారాలను, సాంఘిక కట్టుబాట్లను వేళ్ళతో పెకలించి ధ్వంసం చేయదలచుకుంది యీ దుష్టశక్తి. (కమ్యూనిజం) అందుచేత, మత, సాంఘిక శాంతికై జరుగు యీ పోరాటంలో వీలైన, అన్నివిధములైన, న్యాయమైన మానవమార్గాల నుపయోగించనగును." [2]

---

(1) క్రైస్తవులలో రోమన్ కాథలిక్కులు ప్రపంచమతగురువు పెట్టుబడిదారి ప్రభువులలో నొకడు.

(2) 1932 వ సం॥ మే నెలలో రోమ్‌నగరంనుండి ప్రచురింపబడిన 'పోప్‌గారి ఉత్తరువు' అన్న మాసపత్రికనుండి.

పెట్టుబడిదారి ప్రపంచం యీ విధంగా ఆర్థిక విషమ స్థితిలో మునిగి తేల్తూవున్న రోజుల్లో సోవియట్ తన ద్వితీయ పంచవర్ష ప్రణాళిక నారంభించింది — అమలునందుంచింది. ఈ ప్రణాళిక కార్యక్రమాన్ననుసరించి సోవియట్ పరిశ్రమ లెక్కువ అభివృద్ధి చెందడమే గాకుండా సముదాయక్షేత్రాలు విరివిగా స్థాపించబడ్డవి. అంతేగాదు, సోవియట్ రక్షణశక్తి కూడా అభివృద్ధిచెందింది. సోవియట్, అంతర్జాతీయ శాంతిని నెలకొల్పుటకు వీలైన ప్రయత్నాల మానలేదు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారంలో రాష్ట్రాలన్నీ కొంత స్థిర బుద్ధిని గలిగుండాలని; ప్రపంచమంతటికీ, అందులోని పరిపాలకులకు రానున్న ముప్పునుగురించి, ఆ ముప్పు మూలాన ముందు వారి ప్రజలకు, వెనుక వారి అధికారానికి గలుగనున్న ఆపదను స్పష్టపరుస్తూ హెచ్చరించింది సోవియట్.

ఆయుధ విసర్జనాన్ని అమలులోకి తేలేకపోయిన తర్వాత సోవియట్ తన యిరుగు పొరుగు రాష్ట్రాలతో శాంతియుతమైన సంబంధాల వ్యాపింపజేయడానికి ప్రయత్నాలు జేసింది. భద్రతను స్థిరపరచడానికి నూతన విధానాన్ని—మండలవిధానం—కల్పించింది. మండల విధానమంటే, కొన్ని దేశాలు గలిసి శాంతి, భద్రతల స్థిరపరచడానికి యేకీభవించి ఒక మండలంగా, ఒక సంఘంగా, కట్టుబడియుండడమే. ఈ దేశాలు ప్రత్యేక ప్రభుత్వాలకు చెందియుంటవి. ప్రత్యేక అర్థికవిధానాల నవలంబించేవిగా నుంటవి. అయినప్పటికీ, దగ్గర రాజ్యాలవడంచేతనో, యుద్ధాన్ని అరికట్టాలన్న

పట్టుదల ఉండడంచేతనో, యివి యేకీభవించి పనిజేస్తవి. ఈ విధానాన్నే 'మండల విధానం' అన్నారు రష్యనులు. ఈ నూతన విధానం ఫలవంతంగా లేదు. ఇందుకు కారణం, సోవియట్ ప్రయత్నాలకు పెద్ద పెట్టుబడిదారి రాష్ట్రాలు సహకారం చూపకపోవడమే. పెట్టుబడిదారి ప్రభుత్వాలు తమ యుద్ధప్రయత్నాల కించిత్తైనా ఆపలేదు సరేగదా! మారణయంత్రోత్పత్తిని పిసరైనా తగ్గించలేదు. వీలైనంత వరకు, యేలాగైనా మధ్య యూరప్‌లోని పరిస్థితుల స్థిరప రుచుదామన్న యత్నంలో, ఫ్రాన్సులోని అభివృద్ధి సహాయక వర్గాల సద్భావాలను గుర్తించింది సోవియట్. రానున్న మహత్ప్రళయాన్ని గమనించి ఫ్రాన్స్, జెకొస్లావేకియాలతో సంధిజేసుకుంది. ఈ దేశాలమీాదికి యితరులు దండెత్తివస్తే, తనయుద్ధశక్తిని వాటిరక్షణకు వినియోగిస్తానని ఈసంధిద్వారా స్థిరపరిచింది. నానాజాతిసమితిలో సభ్యరాలుగా చేరమని పెట్టుబడిదారి ప్రభుత్వాలంపిన ఆహ్వానాన్ని అంగీకరించింది. నానాజాతిసమితిని బలపరచపాల్పడ్డది. ఆ సమితిలోనున్న మేలును బలపరచి తద్వారా శాంతిని నెలకొల్పి యుద్ధాన్ని అడ్డుదామని ప్రయత్నించింది. సోవియటు, శాంతిని నెలకొల్ప చేస్తూన్న ప్రయత్నాలకు విరుద్ధంగా పెట్టుబడిదారి ప్రభుత్వాలు యుద్ధప్రయత్నాల నపరిమితంగా జేసినవి. ఈ యుద్ధం ప్రారంభించకపూర్వమే యే ప్రజలను, యెలా బానిసలజేయడం అన్న ఆలోచనలు జరిగినవి. సోవియట్‌పై నెలాగన్నా దండెత్తాలన్న ప్రయత్నాలుగూడా జరిగినై.

అబిసీనియా యుద్ధం, మంచూరియాయుద్ధం, స్పెయిన్ యుద్ధం—యివన్నీ కలిసి మ్యూనిక్ సంధికి దారితీసినవి. ఈ యుద్ధాలపుణ్యాన సామ్రాజ్యవాద రాజ్యాలకు ఫాసిస్టు రాజ్యాలకు అట్టే తేడా లేదని స్పష్టమైంది. అంతెందుకు, యీ యుద్ధాలు పూర్తిగాకమునుపే పెట్టుబడిదారి ప్రభుత్వాలు బహిరంగంగా, పరిపూర్ణంగా ఫాసిస్టుస్వభావాల ప్రకటించినవి. పెట్టుబడిదారి ప్రపంచమంతా యుద్ధానికి సిద్ధపడ్డది. ప్రపంచాన్ని హెచ్చరించారు, మందలించారుగూడాను సొవియటు రాజకీయవేత్తలు—అభివృద్ధినిరోధకుల నాయకత్వాన యుద్ధసన్నాహాలు జరుగుతున్నవని !

మ్యూనిక్ సంధికి పూర్వం, జినివామూలంగా, నానాజాతిసమితియందేగాక బయటగూడా, సముదాయ భద్రతను నిర్మించాలని సొవియటు సదా ప్రయత్నించింది. సొవియటు రహస్య రాజకీయవిధానానికి గలిగిన మహత్త ఆటంకాలను బట్టి చూస్తే సొవియటు ప్రయత్నం కొంతవరకు జయప్రదమైనట్టే. ప్రతిదేశంలోను పెక్కుమంది ప్రజలకు విశ్వాసమేర్పడ్డది—సముదాయ భద్రత లేక మండలవిధానం ఒకటి నిర్మింపబడడం ఆవశ్యకమని. అందున అత్యవసరమని. కానీ, పెట్టుబడిదారి ప్రభుత్వాలు యీ సద్భావాల నిరాకరించో లేక ప్రత్యక్షంగా యెదిరించో తమ యిష్టానుసారం నడిచారు. పోలండువంటి కత్తిఫాసిస్టు రాష్ట్రాలుగూడా సొవియటు ప్రయత్నాలపట్ల యెక్కువ అయిష్టతను ప్రకటించినవి. ఏలాగైతేనేం ప్రజాస్వామ్యాలైన రాష్ట్రాలు, తమ ప్రజల బలవంతంమీద,

సముదాయ భద్రతకు మాటసహాయమైనా చేయక తప్పింది గాదు. మ్యూనిక్ సంధి మూలాన చాలా సందేహాలకు సమాధానాలు లభించినవి. ముఖ్యంగా, (1) ఇతర ప్రజాస్వామ్యాలు ఫాసిస్టు ప్రభుత్వాలతో (జర్మనీ, ఇటలీలతో) చేరి, తమవంటి మరియొక ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసినవి. (2) సముదాయ భద్రతపట్ల ప్రజాస్వామ్యాల ప్రభుత్వాలకున్న వెగటు బయల్పడ్డది. (3) ప్రజాస్వామ్యాల ప్రభుత్వాలు తాము చేసిన వాగ్దానాల నేమాత్రం యిక ముందు నిర్వహించబోవని దృఢమైనది.

ఇంతకుముందు తాము జేసిన వాగ్దానాల నిప్పుడు నిలబెట్టుకోకుండా వుండగలందులకు, ఫ్రాన్సు కొన్ని కారణాలు చెప్పుచున్నది. సముదాయ భద్రతకు ఈ కారణాలకంటే యెక్కువ విరుద్ధమైన విషయాలు మరేవి లేవు. మ్యూనిక్ సంధికి అనంతరం అంతర్జాతీయ సంబంధాల స్థిరపరచడానికి యుద్ధంతప్ప వేరుమార్గం లేకపోయింది. అంతర్జాతీయ రహస్య రాజకీయ విధానంలో పాత పంథాలన్నిటిని ధ్వంసంజేసి కొత్త బాటల చూపించింది మ్యూనిక్ సంధి.

ప్రపంచంలోని ఫ్రెంచి, బ్రిటిష్ ఆధిక్యతకు జర్మనీవల్ల ముప్పు తప్పనిసరి యయినది. ఆ ముప్పు నడ్డడమే మ్యూనిక్ సంధియొక్క ముఖ్యోద్దేశం. తాత్కాలికంగానైనా, ప్రపంచశాంతి కొఱకు పాశ్చాత్య సామ్రాజ్యవాదుల్లో, వారిలో వారికి భేదాలు లేకుండా సహకారం గలగడానికి, ప్రపంచ బానిసవర్గం విజృభించి వప్లవం తేకుండా

దానిని త్రొక్కి-పట్టడానికి ప్రయత్నించింది మ్యూనిక్ సంధి. మిత్రమండలివారి ప్రపంచ ఆధిపత్యాన్ని జర్మనీ అధిక్షేపించ కుండా, జర్మనీ తన రాజ్యాన్ని తన యిచ్ఛవచ్చినట్లు తూర్పు వైపు విస్తరించుకునే నమ్మకంతో, సొవియటుపైకి దూకు తుందన్న దృఢవిశ్వాసంతో, చిన్నచిన్న రాజ్యాలను జర్మనీకి బలిగా యిచ్చారు మిత్రమండలి అధికారవర్గాలవారు.

"జర్మనీని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తున్నాం" అని పైకిజెప్పినా, మిత్రమండలివారికి ముఖ్యోద్దేశం సొవియట్ మీదికి జర్మనీని పురిగొల్పడమే. అందుకు తోడు, తృప్తి పరచు విధానంవల్ల మిత్రమండలివారికి మరికొన్ని లాభాలు సంక్రమించినవి. అభివృద్ధి నిరోధకవర్గాలచేతుల్లోనున్న మిత్ర మండలివారు జర్మనీని తృప్తిపరచడంమూలానే శాంతిని నెలకొల్ప నిశ్చయించుకున్నారు. తమ ప్రజా బాహుళ్యానికి కొంత ధైర్యం గలిగించారు. ప్రజాబాహుళ్యం భయపడక ధైర్యంతో నుండేటట్లు లేని ప్రగల్భాలను ప్రకటించారు. అందుచేతనే, సఖ్యతకొరకు సొవియటుచేసిన ప్రయత్నాలన్నీ శిథిలమైనవి. మిత్రమండలిలోని అభివృద్ధినిరోధకులు బలవంతులైనారు. ప్రజల నెక్కువ సులభంగా నమ్మించ గలిగారు.

మిత్రమండలివారికి హిట్లరు నెదిరించి పోరాడేదాని కన్నా, తమ దేశాలలోని ప్రజలతో తమకు గల్గిన సాంఘిక పోరాటాలను జయప్రదంగా సాగించడం అత్యవసరంగా తోచింది. ఈ భావాన్ని అనుసరించే వారి చర్యలు నడిచి

నవి. మిత్రమండలివారు, పరిస్థితులు విషమించి వచ్చినతర్వాత మాస్కోలో జరిపిన సంప్రదింపులలోనైనా హిట్లరు నెదుర్కో డానికి తయారైనట్లు సూచనలేవి కనబడలేదు. మాస్కో సంప్రదింపులను ముసుగుగా నుపయోగించి మళ్లీ జర్మనీని సోవియట్లమీదికి యుద్ధానికి పురికొల్ప యత్నించారు. అంతే గాని, సోవియట్ల సాయంతో శాంతిరంగాన్ని నెలకొల్పడానికి ఆవగింజంత ప్రయత్నమైన జేశారుగాదు.

మ్యూనిక్ సంధిమూలాన తనకు గల్గిన నూతనావ కాశాలను హిట్లరు యెలా ఉపయోగించిందీ, యుద్ధాన్ని యెవరిపైకి మరలించిందీ, యిప్పటి కందరకు అర్థమైఉంటుంది. ఈ నూతన నావకాశాలకారణంగా తన యుద్ధ కార్య క్రమాన్ని హిట్లరు మార్చగలిగాడు. మిత్రమండలివారి ప్రపంచ ఆధిక్యతను నాశనం చేయడమే తన యుద్ధాశయ మన్నాడుహిట్లరు మొన్నటివరకు. (నేడురష్యాపై అక్రమంగా యుద్ధాన్ని ఆరంభించినతర్వాత సోవియట్ బ్రిటనుకు సాయ పడుతున్నది కాబట్టి సోవియట్‌ను నాశనం చేస్తానన్నాడు.) ఎలాగైతేనేమి, మిత్రమండలివారు మ్యూనిక్‌సంధి మూలాన యేపరిస్థితుల నడ్డాలని ప్రయత్నించారో ఆ పరిస్థితులు విష మించడానికి మ్యూనిక్‌సంధే సాయపడ్డది.

అందుకనే, యీ యుద్ధానికి ప్రత్యక్ష కారణం, సామ్రాజ్యవాద దేశాల్లో జరిగిన సాంఘిక శక్తుల పోరా టాల్లో అభివృద్ధినిరోధకుల జయమని అనక తప్పదు. ఈ అభివృద్ధినిరోధకులకు శాంతి అంటే వెగటు. ప్రజాబా

హుళ్యాన్ని ప్రస్తుత హీనస్థితినుండి తప్పించను, శాంతిని నెల కొల్పను ప్రయత్నించు సంఘశక్తులపట్ల వీరికి దారుణ విరోధం. ఈ విరోధంవల్లనే, యితర దేశాల ఫాసిస్టులతో చేతులు గలిపి తమ ప్రజలను నాజీదుండగీలపాలు జేశారు.

ఈ యుద్ధం విజృంభించినకొద్దీ, ఖండాంతరాలకు వ్యాపించినకొద్దీ, రాజకీయాలంటే యేమిటో యెరుగనివారికి గూడా, యీ యుద్ధాన్ని నడుపుతున్న విరోధి సామ్రాజ్య వాదుల ఆశయలేమిటో విశదమౌతవి. ఈ యుద్ధం కేవలం ప్రపంచ అధికారార్థం ప్రారంభింప బడ్డవి. అందుకే సాగింప బడుతూంది యింకాను. ఒక్క ఆశయంతో, ఒక్క తీరాన్నే, ఒక్క వలసరాజ్యంతోనే, ఒక దేశంతోనే ఆగేదికాదీ యుద్ధం. ప్రపంచాధికారాన్ని మొదట యెవరు పొందగలరు? అందున యెక్కువ లాక్కోగలవారెవరు? అన్న సమస్యల పరిష్క రించడానికే యీ యుద్ధం జరపబడుతూంది.

జర్మనీని సంతృప్తిపరచి, వీలయితే ప్రపంచాన్ని తిరిగి పంచుకొన సంసిద్ధులైనారు మిత్రమండలివారు. కానీ, పపంచ పంపకంతో హిట్లరు తృప్తిపడక, యీ పంపకఫలితంలో యెక్కువ జర్మనీకి లభించాలని, ఫ్రాన్సు-బ్రిటనులు ప్రపంచ పరిపాలకులలో అగ్రగాములుగా నుండరాదని, యీయుద్ధానికి దిగాడు. ఛేంబర్లేను పక్షపాతులు, యీయుద్ధానికి రహస్యకారణాలైనవాటిని గ్రహించలేకపోవడంచేత, హిట్లరు యూక్రేన్ మీది కురుకుతా డనుకున్నారు. కాని హిట్లరు మొదట ఫ్లాండర్సుమీది కుటీకాడు. ఫ్లాండర్సుకంటే యూక్రేన్

చాలా ఫలవంతమైనదేశ మన్నమాట నిజమే. మిత్రమండలి వారు ఫ్లాండర్సును రక్షించ నెంతసిద్ధపడి యున్నారో, యూక రేనును రక్షించను సోవియటు అంతకంటే యెక్కువ సిద్ధపడి యున్నదన్నమాట నిజము. వీలుంటే బ్రిటను-ఫ్రాన్సులపట్ల తప్పక ప్రేమ జూపించేవాడే హిట్లరు. యూకరేనును హస్తగతం జేసుకోవడం అంతసులభం గాదు కాబట్టి మొదట ఫ్లాండర్సుమీఁది కురికాఁడు. సోవియటు సేనానాయకులు హిట్లరు కెలా బదులుజెప్పాలసింది ఎరుగుదురు. యూకరేన్ మీఁదికే గనక హిట్లరురికితే (20-6-41 న వురికాఁడు సరే) రక్షించుకోవలసిన బాధ్యత యెట్లూసైన్యాంది. అలాంటప్పుడు, తమకంట్లో పుసి దీసుకోలేని సామ్రాజ్యవాదులు, సోవియట్ చెవిలో గుబి లున్నదని—యూకరేనును హిట్లరాక్రమిస్తాడని—ఉబలాటపడ్డారు. పాపం, వారు ముందు సంగతి వూహించుకోలేక పోయారు. ఫ్లాండర్సు నాక్రమించి, ఫ్రాన్సును లొంగదీసుకొని, ఫ్రెంచితీరాన జేరి, బ్రిటను మీఁదికి రా యత్నిస్తాడని వా రూహించుకోలేకపోయారు. హిట్లరు ఫ్రాన్సునుంచి యింగ్లండును, అందుపైని బ్రిటిష్ నావికాశక్తిని, అటుపైని బ్రిటిష్ ఫ్రెంచి వలస రాజ్యాల మీఁదికి రా ప్రయత్నిస్తాడని వారు ఊహించలేకపోయారు.

సామ్రాజ్య రాష్ట్రాల్లోని సాంఘిక పోరాటాలే యీ యుద్ధానికి ముఖ్య కారణమని ముందే గమనించాం. అదే విధంగా, అన్నిటికంటే మిన్నగ, యీ యుద్ధాశయం, సామ్రాజ్యవాద యుద్ధాల నుత్పత్తిజేసి పెంపొందింపజేసే

ప్రస్తుత సాంఘిక, ఆర్థిక, రాజకీయ పోకడల నిలబెట్టి, బల పరచడమే. 1937-1939 సం॥ ల్లో, ఇంగ్లాండు-ఫ్రాన్సులలో అభివృద్ధి సహాయశక్తులు క్షీణించకుండావుంటే యీ యుద్ధం వచ్చేయుండదు. ఈ అభివృద్ధి సహాయశక్తులు అంత శక్తివంత మైనవికావు. స్పెయిన్‌లో ప్రజాస్వామ్యవిధ్వంసాన్ని అరి కట్టను, మిత్రమండలి ధనికవర్గాలు సఖ్యత కుదుర్చుకోకుండా అడ్డుటకు చాలినంతబలం యీఅభివృద్ధి సహాయశక్తుల కుంటే యీ యుద్ధం వచ్చేదేకాదు.

తన చుట్టునున్న ప్రపంచంలో జరుగుచున్న పరిస్థితులను గమనించకుండా సోవియట్ యెలా కండ్లు మూసుకుంటుంది? మన యింటికి పక్కనున్న యిల్లు అగ్నిహోత్రునికి ఆహుతి అవుతుంటే, మన యింట్లో మనం కూర్చొని రామాయణపారాయణం యెంతసేపు చేసుకోగలం? పోనీ, అంతటి ఓర్పుందనుకుందాం మనకు. ఆ అగ్ని జ్వాలలు, వాయుదేవుని పుణ్యమాఅంటూ మన యింటినే ఆవరిస్తే? రామాయణం రక్షిస్తుందా?.........సోవియట్ 'సముదాయ భద్రత' అన్న ఆశయాన్ని వదలిందికాదు—నేటికి గూడా. ఈ యుద్ధం యెంతకాలం జరిగితేనేం? భద్రత కావాలంటే 'సముదాయభద్రత' తప్ప గత్యంతరం వేరులేదు. అందుచేత యీ ఆశయాన్ని వదలుట తప్పు. సోవియట్ యీ సద్భావాన్ని—యీ చక్కని ఆశయాన్ని—వదలడం అసంభవం. ఈయుద్ధానంతరమైనా శాంతిని స్థిరంగా స్థాపించాలంటే యీ ఆశయమే పునరుద్ధరింపబడాలి. ఈ పునరుద్ధర

ణకు, ముందుగూడా మిత్రమండలి అభివృద్ధి విరోధకవర్గాలు అడ్డంకులౌతవి. వాటిలోవాటికి సఖ్యత చాల సులభంగా కుదుర్తుంది. ప్రేమపూర్వకంగా యేకమౌతారువీరు. నిన్నటి వరకు యీ అభివృద్ధినిరోధకవర్గాలు ఫాసిజంతో చుట్టరికం జేసుకోడంమూలాన శాంతి నెలకొల్పడాని కవకాశం లేక పోయింది. ప్రజల ప్రతినిధులై, ప్రజల మేలుగోరే ప్రభుత్వాలు ప్రపంచమంతట నేర్పడి, అవన్నీ ఏకీభవించితేనే గాని ప్రపంచ శాంతి నెలకొల్పబడదు. ఈ శాంతిస్థాపనకు సోవియట్‌కూడా సాయపడాలంటే, సోవియట్ సంపూర్ణంగా స్వతంత్రించియుండాలి. తనమీాది కెట్టి యాక్రమణి రాకుండా స్వయంరక్షణకు సిద్ధమైయుండాలి. అలా సంసిద్ధమై యుంటేనే గాని, సమయమొచ్చినప్పుడు, శాంతి నెలకొల్ప యత్నించే అభివృద్ధి సహాయశక్తులకు నాయకత్వం వహించి నడిపించ జాలదు.

ప్రతి రాష్ట్రంయొక్క విదేశాంగవిధానం దాని రాజకీయ, ఆర్థిక, సాంఘిక నిర్మాణాన్నిబట్టి యుంటుంది; అనుసరించి యుంటుందిగూడాను. సోవియట్ విదేశాంగ విధానం విషయంలో పై న్యాయం చక్కగా అన్వయిస్తుంది. సోవియట్ శాంతి ఆశయాలు, దాని సాంఘిక, ఆర్థిక నిర్మాణావసరాలను ప్రతిబింబించుచున్నవి. ఏ విదేశాంగ విధానంయొక్క ఆశయాలైనా ఆప్రభుత్వం యొక్క రాజనీతిని, నిపుణత్వాన్నిబట్టి వుంటవి. ఒక రాష్ట్రంయొక్క విదేశాంగ విధానానికి చేతికీలు బొమ్మయైన దినచర్యను మనం రహస్య రాజకీయ విధాన

మంటున్నాం. ఈ రహస్యరాజకీయ విధానంయొక్క ఆశయాల స్థిరపరచుకుంటే, ప్రభుత్వం యొక్క నేర్పరితనాన్ని బట్టి, ఆ ప్రభుత్వం అవలంబించే మార్గాలు, ఆలోచనలనుబట్టిగాని దాని ప్రయత్నాల సాఫల్యత స్పష్టపడదు.

సొవియట్ విదేశాంగ విధానంయొక్క ముఖ్యోద్దేశం శాంతిని స్థిరపరచడం. ఈ ఆశయాన్నుండి అవంతైనా దూర మనకుండా, అంతరంగంగా—బహిరంగంగాను గూడా తన శాంతి భద్రతలకు హానికలుగజేస్తున్న వారిని యెత్తి చూపించ గలగడం, సొవియట్ రహస్యరాజకీయ విధానం యొక్క మహత్తర శక్తియని చెప్పక తప్పదు.

సొవియట్ ఆశయాలన్నీ ఒక్కమారు భగ్నంచేయ బడ్డవి. ప్రపంచంలో శాంతిస్థాపనకై సొవియట్ జేసిన ప్రయత్నాలన్నీ నిన్న జర్మనీ సొవియట్పై జరిపిన దాడితో ధ్వంస మైనవి. ఈ సొవియట్—జర్మనుయుద్ధం యెలా పరిణమిస్తుంది? యెలా ప్రారంభమైంది? యెందుకు ప్రారంభమైంది? అన్న విషయాలు చర్చింపదగినవి.

1917 అక్టోబరులో రష్యాలో విప్లవం రావడానికి కారణం జర్మనీ పంపిన డబ్బు, కమ్యూనిస్ట్ నాయకులు.

6. నిరుద్యోగం

ఈ శీర్షిక తోచడానికి కారణం పెట్టుబడిదారి దేశా లన్నిటి అనుభవమే. పెట్టుబడిదారిదేశాల అనుభవం క్లుప్తీక రిస్తే యిలా వుంటుంది. మూలధనం అభివృద్ధిచెందేకాలాల్లో, అంటే పెద్దపరిశ్రమలలో కొత్తపరిశ్రమల నిర్మాణంలో లేక ఉత్పత్తియంత్ర నిర్మాణంలో, గృహనిర్మాణంలో, రైల్వేల నిర్మాణంలో, లేక యుద్ధసామగ్రి ఉత్పత్తిలో, ఉన్నశ్రామికు లలో యెక్కువవంతు వుపయోగింపబడుచున్నారు. చిన్న పరిశ్రమలు వాటివంతుకు కొనుగోలు వస్తువసతుల నుత్పత్తి చేస్తవి. ఆ ఉత్పత్తిని సాగించను ప్రోత్సాహించబడతవి గూడా. కానీ యీ ప్రోత్సాహం తాత్కాలికం మాత్రమే. ఈ ప్రోత్సాహంమూలాన మోసపోయి కొనుగోలువస్తు వస తుల తయారుచేయు పరిశ్రమలు, తమవంతుకు తాము యెక్కువశ్రామికులను ఉపయోగిస్తవి. అందుకనే, కొను గోలు శక్తిగూడా వృద్ధిజెందుతుంది. ఈ విధంగా మనకు 'లాభాలరోజులు', 'మంచిరోజులు' వస్తవి. అనుభవాన్ని బట్టి ఇట్టి మంచిరోజులు చాలా కొద్దికాలమే ఉంటవని మన మెరుగుదుము. మన జీవితకాలంలోనే యీ 'మంచిరోజులు' అనేకమార్లు ఆర్థిక క్లిష్టతచేత, ఉత్పత్తి తగ్గించడంవల్ల 'చెడు రోజులైనవి.'

'మంచిరోజులు' 'ఆర్థిక క్లిష్టత' ఒకటిపిదప నొకటిగా యెందుచేత వస్తూంటవని, ఆర్థిక క్లిష్టతయొక్క కాలవ్యవధి

మెందుకని పెరుగుతూందని యిక్కడ విశదీకరించడానికి అవకాశం లేదు. నిరుద్యోగస్వభావాన్ని మనకు స్పష్టపరిచే ముఖ్యవిషయ మొక్కటుంది. దాన్ని చర్చించుదాం. తన ఆర్థికవిధానంలో నిరుద్యోగం యెప్పటికి తలయెత్తకుండా సొవియట్ యెలా రూపుమాపగలిగిందీ అప్పుడుగాని మనకు స్పష్టముగాదు.

గొప్ప పరిశ్రమలలోని ఉత్పత్తి, ఉత్పత్తి సాధనాల ఉత్పత్తిమొదలైన ప్రయత్నా లన్నిటిఫలితం కొనుగోలుదారునకు యెక్కువ వస్తువసతులను కలిగించేవిధానాన్ని సృష్టించడమే. అట్టి ఉత్పత్తినే మనం 'ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి' అంటున్నాం. అందుచేతనే, గొప్ప పరిశ్రమల ఉత్పత్తి, సాధారణంగా పారిశ్రామికాభివృద్ధి, అన్నీగూడా కొనుగోలు వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తుంటవి. కానీ యీ పరిశ్రమలన్నిటి ఉత్పత్తికాధారం ప్రజల కొనుగోలుశక్తి. ప్రజలేగనక ఉత్పత్తికాబడే వస్తువులను కొనకబోతే ఆ వస్తువుల ఉత్పత్తి ఆగిపోతుంది. పరిశ్రమలన్నిటికి ప్రేరకం, అంత్యఫలితం ప్రజల కొనుగోలుశక్తియే.

కానీ, పెట్టుబడిదారి ఉత్పత్తివిధానంలో, గొప్ప పరిశ్రమలు, కొద్దిపరిశ్రమలుగూడా, నిర్ణయం లేకుండా వ్యక్తుల ఆసక్తులకై, లాభంకొఱకు సాగింపబడుచున్నవి. పెట్టుబడిదారులు, తమ సొంత ఉపయోగానికైతేనేమి, మున్ముందు పెట్టుబడికని అయితేనేమి యెక్కువ లాభాలు తీసుకుంటున్నారు—పరిశ్రమల ఫలితాలనుండి. వీరి లాభాలు

పోను మిగిలినకాస్త శ్రామికులకు కూలికిందపంచడమౌతుంది. ఈ మొత్తం చాలా కొద్దిగనుక శ్రామికులసంఖ్య పెద్దది గనుక వారి కొనుగోలుశక్తి చాలాతగ్గుతుంది. ఎక్కువ లాభాలకై పెట్టుబడిదార్లలో కలిగే పోటీలు, యంత్రసృష్టిలో గలిగే మార్పులు, దినదినాభివృద్ధిని చెందుచున్న శ్రామికుల నిపుణత, మొదలైనవాటి ఫలితంగాగూడా శ్రామికులకు లభించే ఉత్పత్తిలోని భాగం మరీతగ్గింది. ఈవిధంగా సంఘం (బహుసంఖ్యాకులు) యొక్క కొనుగోలుశక్తి తగ్గడం పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకి అవుతుంది. యంత్రాలను, కర్మాగారాలను ఉత్పత్తిచేసేవారు, విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిజేసేవారు, ఉత్పత్తిని మితపరుస్తారు. ఇందుకు కారణం సంఘం కొనుగోలుశక్తి తగ్గడమే. ఉద్యోగాలు తగ్గింపబడతవి. నిరుద్యోగం పెరుగుతుంది. కొనుగోలు వస్తువసతుల ఉత్పత్తిదారుడుగూడా—ప్రజల కొనుగోలుశక్తి తగ్గడంచేత—బజార్లో గిరాకీ తగ్గడంచేత తన ఉత్పత్తిని తగ్గిస్తాడు. నిరుద్యోగం' ఉత్పత్తి విధానంయొక్క రెండుశాఖల్లో పెచ్చుపెరగడంచేత సంఘాన్ని మొత్తాన్ని బాధిస్తుంది. ఈవిధంగా, అప్పుడప్పుడు, ఆర్థిక క్లిష్టస్థితి ప్రపంచాన అవతరిస్తుంది.

దీనికి తాత్పర్యం, పెట్టుబడిదారివిధానంలో ఉత్పత్తిశక్తులు ప్రజల కొనుగోలుశక్తి నభివృద్ధిపరచ నుపయోగింపబడక, కేవలం లాభాన్ని ఉత్పత్తిచేయనే ఉపయోగింపబడుచున్నవని. అందుచేత అత్యధికఉత్పత్తి కలుగుతుంది. నిజంలో, ఉత్పత్తి అధికమైనా కొనుగోలుఖర్చు మాత్రం తక్కువ.

అందుకు ఫలితంగా అసంఖ్యాకులు నిరుద్యోగులౌతారు. ఈ దురవస్థను పెట్టుబడిదార్లు చక్కగా అర్థంజేసుకున్నట్లు, దా న్నుండి తప్పించుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు మన కొంక నిర్ధా రణ వున్నది. పారిశ్రామికంగా అభివృద్ధిచెందని ప్రాచ్యదేశా లలో తమ మూలధనాల నెలా పెట్టుబడిపెట్టడమని వీరు సలిపే ప్రయత్నాలు, వలసరాజ్యాలలో వ్యాపారము,తద్ద్వారా పెట్టుబడిరాష్ట్రాలలో పోటీ, అందుకు ఫలితంగా జరిగే యుద్ధాలు నిదర్శనం.

ఈ సంధిగ్ధావస్థను సొవియట్లెలా దాటగలుగుచున్నవి? సొవియట్ ఉత్పత్తివిధానాని కాశయం లాభం సంపా దించడం గాదు. ప్రజోపయోగానికి వస్తు వసతులను—సౌక ర్యాలను—యెక్కువగా, యెల్లప్పుడూ, ఉత్పత్తిచేయడమే సొవియట్ల ఆశయం. సామ్యవాదవిధానంలో పరిశ్రమలు ఉత్పత్తిసాధనాలు ప్రజలందరి సొమ్మై వుంటవి. ఉత్పత్తి నిర్ణీత క్రమాన సాగించబడుతూంది. అందుచే సంఘం మొత్తం యొక్క అవసరాలనుబట్టి ఉత్పత్తి సాగించడానికి వీలౌతుంది. ఉత్పత్తికి కావలసిన పరికరాలన్నీ ముందుగా నిర్ణయింపబడ తవి—మూలధనం, పెట్టుబడి, పారిశ్రామిక కార్యక్రమం, గృహనిర్మాణం, శ్రామికుల సరఫరా, వెంటనే ఉపయోగా నికి రాగల వస్తూత్పత్తి మొదలైనవన్నీ. పెట్టుబడిదారీవిధా నంలో పారిశ్రామిక కార్యక్రమం నిర్ణయింపబడక ఉత్పత్తి సాధనాలు చేయగలిగిన ఉత్పత్తిని ప్రజల కొనుగోలుశక్తి మితపరుస్తుంది. సొవియట్ ఉత్పత్తివిధానం దినదినాభివృద్ధి

చెందుతూ వున్నది. పారిశ్రామిక కార్యక్రమం ప్రోత్సహింప బడుచున్నది. ఇందుకు కారణం సోవియట్ ప్రజల కొనుగోలు శక్తి దినదినాభివృద్ధిచెందడమే. సోవియట్ పరిశ్రమ ఎక్కువగా ఉత్పత్తిని జేసినకొలదీ, అచ్చటి ప్రజ లంతకంటే యెక్కువగా ఖర్చు చేయగలరు. సోవియట్‌లో యెక్కువ శ్రామికులు పనిజేస్తున్నప్పుడు సహజంగా యెక్కువ ఉత్పత్తి చేయగలదు సోవియట్. ఎందుచేతంటే, ఉత్పత్తిఫలితాలన్నిటిని ఖర్చుచేయుశక్తి, చాలినంత సోవియట్ ప్రజల కున్నది. ఉత్పత్తి సాధనాలు సంఘంసొమ్మై యుండడంచేత ప్రజల కష్టానికి ఫలితాలైన వస్తుసామగ్రి వారినుంచి అపహరింప బడవు. అందుచేతనే, సోవియట్ ఉత్పత్తి మితపరుపబడదు. వారి అభివృద్ధినడ్డ వీలులేదు. 1930 సం॥నుంచి, ప్రథమ పంచ వర్ష ప్రణాళిక అమలులోనున్న మధ్యకాలంలో, నిరుద్యోగం నిర్మూలింపబడ్డది. పరిశ్రమలలో పనిజేస్తూన్న శ్రామికుల సంఖ్య 1930 లోని 1, 20, 00, 000 నుంచి 1939 లో 2, 80, 00, 000 కు మించిపోయింది. యిప్పటికింకా కావలసి నంతమంది శ్రామికులు దొరకడంలేదు. అందున శ్రామికుల ఉత్పత్తిశక్తి పెచ్చుపెరిగిందిగూడాను.

పెట్టుబడిదారి దేశాలలో శ్రామికుని ఉత్పత్తిశక్తిలో అభివృద్ధి, యంత్రాల ఉత్పత్తిశక్తిలో గలిగిన అభివృద్ధి, రెండూగూడా శ్రామికుని మంచికొరకు పనిజేయడంలేదు. పెట్టుబడిదార్ల లాభాలను హెచ్చించచనే అన్నివిధాలైన అభి వృద్ధి ఉపయోగింపబడుచున్నది. సోవియట్‌లో అలాగాకుండా

ఉత్పత్తివిధానంలో గలిగిన అభివృద్ధి అంతాగూడా శ్రామికుని మంచికే ఉపయోగింపబడుచున్నది. సొవియట్ సిద్ధాంతమే యిందుకు కారణం—"ఎక్కువ ఉత్పత్తి, యెక్కువ పంపకం" ఏ ఒక్కవస్తువుగాని అపరిమితంగా ఉత్పత్తి చేయబడితే, ఆ ఉత్పత్తిలోని యంత్రాలను, శ్రామికులను, మూలధనాన్ని మరోవస్తూత్పత్తికి మార్చగలదు, నిర్ణీత ఆర్థికవిధానం. అంతే గాదు, పనిజేసేసమయాన్ని గూడా, తగినట్లు రోజుకు యిన్ని గంటలని తగ్గింప వీలుంటుంది.

సొవియట్ విరుద్ధప్రచారంచేసే వారి వ్రాతలలో సొవియట్ ఉత్పత్తిశక్తికంటె, సొవియట్ శ్రామికుల కొను గోలుశక్తి యెల్లప్పుడూ మించివుంటుందనే విషయం ఋజు వౌతుంది. పాపం వారెరుగరు వారేంవ్రాస్తూన్నది. వారి వాదనల్లా సొవియట్‌లో వస్తుసరఫరా తక్కువగా నున్నదని, ప్రజలు కొనడానికి డబ్బుచేతబట్టుకొని బారులుదీరి నుంచున్నా గంటలపర్యంతం వారికి వస్తువ్రలు దొరకడంలేదని. వీరి నిర్ధా రణలబట్టే వీరి తెలివితక్కువతనం బయటపడుతూవుంది. సొవియట్‌లో నిరుద్యోగులు లేకుండడంమూలాన వస్తువుల ఉత్పత్తికంటే వాటికి గల గిరాకే యెక్కువగా నుంది— చాలా యెక్కువగా నుంది. గిరాకి వస్తూత్పత్తికంటే ముందే పరుగిడుతూంది. గిరాకికి తగినన్ని వస్తువులు కావాలంటే సొవియట్ పారిశ్రామికవిధానం యెప్పటికప్పుడు మార్పు జెందుతుండాలి. అభివృద్ధినిజెందుతుండాలి. గిరాకి అనంతంగా పెరుగుతూనే వున్నది. సంపాద్యం యెక్కువయ్యేకొద్దీ

ప్రతి వస్తువుకూ కూడా గిరాకి హెచ్చుతూనే వుంటుంది. మానవుని కష్టానికి తగినకూలీ నిచ్చే ప్రభుత్వం—ప్రజల ప్రభుత్వం—ప్రజల యిష్టానుసారం సాగింపబడే ఆర్థికవిధానం యేర్పడి యుంటే సంపాద్యం—ఆదాయం హెచ్చుతునే వుంటవి. ఈలాంటి సందర్భాలు ప్రజల సౌఖ్యానికి, క్షేమానికి అత్యంత అనుకూలమైనవని సోవియట్ ప్రభుత్వం యెరుగకపోలేదు. సోవియట్‌ను ఖండించేవారుమాత్రం యీ స్వభావాన్ని యెరుగలేకున్నారు. వస్తువులు కొనడానికి డబ్బు చేత బట్టుకొని బారులుదీరి నుంచున్న ప్రజలు—కావలసినన్ని వస్తువులు లేకపోవడం, అన్న సమస్యను రష్యనులు రెండు నిమిషాల్లో పరిష్కరించగలరు. దీనికి సులభమార్గం—ప్రతి పెట్టుబడిదారీదేశంలో జరిగే దిదే—వస్తువులధరల పెంచడమే. కానీ, ధరల పెంచడంమూలాన ప్రజల కష్టార్జితం లాగివేయబడుతుంది. లేకుంటే, శ్రామికుల కిచ్చే కూలీలు తగ్గించడమాతుంది. సోవియట్ యిలాంటి కకుర్తికార్యాలను వేటిని చేయడంలేదు. తన ప్రజల అక్కరలను అత్యధికంగా తృప్తిపరచడానికి యెక్కువ వేగంతో తన ఆర్థికాభివృద్ధిని సాగిస్తూంది.

సోవియట్‌సంయుక్తరాష్ట్రంలో నిరుద్యోగం చట్టవిరుద్ధమైనది. సోవియట్‌సంయుక్తరాష్ట్ర నిర్మాణచట్టంలోని యీ క్రింది రెండు నిబంధనలు యీ విషయాన్ని స్పష్టపరుస్తున్నవి.

నిబంధన నెం 12 రు. సో, సం. రాష్ట్రింలో శ్రమపడడం ప్రతివారి విధి.

సో. సం. రాష్ట్రింలో అమలునందున్న ఆర్థికనీతి సామ్యవాదసిద్ధాంతం మీద ఆధారపడియున్నది. "ప్రతివానినుంచి ఉత్పత్తికి వాని శక్తి కొలది శ్రమపుచ్చుకోడం. ప్రతివానికి వానిశ్రమనుబట్టి ఉత్పత్తిఫలితాలను పంచడం"—అనేది సామ్యవాద ఆర్థికనీతి. ఆరోగ్యవంతుడైన ప్రతిపౌరుడు శ్రమపడడం గౌరవనీయమైన విషయం. "శ్రమపడని వాడు భుజింప తగనివాడు" అన్న న్యాయంగూడా అభ్యాసంలో నుంచదగినది."

నిబంధన నెం. 118 రు. "సొవియట్ పౌరులు శ్రమపడుటకు హక్కు గలిగున్నారు. అంటే, సొవియట్ ప్రజలకు ఉద్యోగానికి హక్కు, పరిమితి గుణాన్నిబట్టి వారిశ్రమకు తగిన వేతనం యివ్వబడుతుందన్న పూచీ యివ్వబడినదన్నమాట."

"జాతీయఆర్థికవిధానం సామ్యవాదనిర్మాణంమీద ఆధారపడియున్నందున, సొవియట్ ప్రజలయొక్క ఉత్పత్తిశక్తులు నిలకడగల అభివృద్ధినిచెందుచున్నందున, అర్థికక్లిష్టపరిస్థితులు కలిగే అవకాశాలు పూర్తిగా తొలగింపబడబట్టి, నిరుద్యోగం నిర్మూలింపబడ్డందున, శ్రమపడను—కష్టించను—ప్రతివ్యక్తికి గల హక్కు దృఢపరుపబడినది."

ప్రపంచంలోని పసిపిల్లలసంఖ్య—8 యేండ్లకు తక్కువ వయస్సు గలవారు—50,00,00,000. సొవియట్‌లో యెంగ్ కమ్యూనిస్టులీగ్ సభ్యుల సంఖ్య—ఆడ, మొగ కలిసి—50,00,000.

7. ఎఱ్ఱసైన్యం

1939 మార్చిలో మాక్స్ వెర్నర్ అను గ్రంథకర్త 'వివిధరాజ్యాల మిలిటరీ బలం' అన్న పేరుతో నొక గొప్ప గ్రంథం వ్రాశాడు. ఇతను పాశ్చాత్యదేశా లన్నిటిని చుట్టి వచ్చినతర్వాత, వివిధరాజ్యాల సైనిక స్థితిగతులను చక్కగా తెలుసుకొనినపిదప యీ గ్రంథాన్ని రచించాడు. సోవియటు యెఱ్ఱసైన్యంయొక్క బలాన్ని గుర్తించాలంటే ముఖ్యంగా మాక్స్‌వెర్నర్ గారి గ్రంథాన్ని చదవాలి. సోవియటు సైనిక బలాన్ని గురించి వారి గ్రంథంలోని విషయాలు కొన్ని యిందు పొందుపరిచాను.

"భవిష్యత్ యుద్ధాలస్వభావం యెలా వుంటుందో యెఱ్ఱ సైన్య ఊహానిర్మాతలు ఆచరణలో తక్కిన అన్నిదేశాలనిపుణుల కంటే ముందుగానే తెలిసికొన్నారు. తమ వ్యూహముల తదనుసారం పూర్తిగా అభివృద్ధిపరిచారు. నవీన ఆయుధాలను త్వరలో సంపూర్ణ విజయాన్ని పొందడానికి యెలా వినియోగించాలో వారికి తెలుసు. రెడ్ ఆర్మీ యుద్ధరంగ రెగ్యులేషన్లలో యిలా చెప్పబడియున్నది—
"నవీన యుద్ధపరికరాల టెక్నిక్ రక్షణకోటలవిలువను తగ్గించివేస్తుంది. ముఖ్యంగా టాంకులు, ఆర్టిలరీ, విమానాలు, మెకానైజ్‌డ్ దళాలు విరివిగా ఉపయోగించితే శత్రువును అన్నివైపులా ముందునుంచి, వెనుకనుంచికూడా దెబ్బకొట్టవచ్చును. ఇతర సహాయాలురాకుండా ఒంటరిచేసి నాశనంచేయవచ్చు"—

"ఎఱ్ఱసైన్యంలోని వివిధ అంగాలయొక్క ప్రత్యేకవిధులు పై ఉద్దేశాన్ని నెరవేర్చడానికే నిర్ణయించబడతాయి."

"ఎఱ్ఱసైన్య సేనానాయకుల, ఒకదెబ్బతో హతమార్చే వ్యూహం, నవీనదాడి, ఆయుధాల శక్తిపైనే ఆధారపడివుంది. నూతన ఆయుధాలే అట్టి పరిస్థితులను కలుగజేశాయి. వెనుకటి యుద్ధాలకంటే యిప్పుడు నూతన దాడి ఆయుధాలు బలమైన ప్రభుత్వానికి ఎక్కువ ఆధిక్యతను కలుగజేస్తవి. దాడిచేసే ప్రభుత్వానికి విమానబలంలోను, ఆటో-మెకానైజ్డ్ దళాలలోను, మోటారైజ్డ్ బరువైన ఫిరంగుల లోను ఆధిక్యతవుంటే ప్రతిపక్షం ఓడిపోవలసిందే. ప్రతిపక్షం ముందడుగు వేయవచ్చునుగాని తన ప్రక్కలను, వెనుక భాగాన్ని రక్షించుకోలేదు. సంపూర్ణంగా వోడిపోతుంది.........మిలిటరీ వ్యూహాలను-ప్లాన్లను, వాటి స్వభావాన్ని నవీన ఆయుధాలు పూర్తిగా మార్చివేశాయని ఎఱ్ఱసైన్య నాయకులు ఎరుగుదురు".

"నవీన సముదాయక యుద్ధవ్యూహాలను జర్మనులకంటె సోవియట్ సేనానులే బాగా నేర్చుకున్నారు. ప్రావీణ్యం సంపాదించారు".

"యూరప్‌లో యితరదేశాల సైన్యాలకంటె కొన్ని సంవత్సరాలు ముందుగానే ఎఱ్ఱసైన్యం నవీన యంత్రసంపత్తితో, బలమైన విమానసైన్యంతో, మోటారైజుడు కాల్బలంతో, మోటారైజ్డు ఫిరంగిదళాలతో బలపరుపబడిన టాంకు దళాలతో సిద్ధపరుపబడింది".

1937 లో సోవియట్ సైనికబలం :

విమానదళ సంఖ్య	16,000
(ఏటా 20,000 విమానాలు ఉత్పత్తి)	
మిలిటరీ ట్రాక్టర్లు	1,50,000
మిలిటరీ మోటారుబండ్లు	1,00,000

"జర్మనీ విమానపరిశ్రమయొక్క ఉత్పత్తిశక్తి సోవియట్ విమానపరిశ్రమలో సగంమాత్రమే వుంటుందని యెంచబడుతుంది".

శ్రీ వేమన గ్రంథాలయము
తేలప్రోలు (కృష్ణా)

"సోవియట్ విమానాలు స్పెయిన్‌లో తక్కిన అన్నిటి కంటే శ్రేష్ఠమైనవని రుజువయింది".

"యుద్ధవిమాన పైలెటుశిక్షణ సంపూర్ణంగా యివ్వడానికి మూడు సంవత్సరాలు పడుతుంది. 1936 నాటికే సోవియట్ యూనియన్ 1,50,000 యుద్ధపైలెటులకు ట్రెయినింగ్ యివ్వ ప్రారంభించింది".

"జర్మనీ నిపుణుల అంచనాప్రకారం ఎఱ్ఱసైన్యంలో 70,000 శిక్షణపొందిన పారచూట్ దళాలు (విమానాలనుండి గాలిగుమ్మటాల ద్వారా శత్రుసైన్యాల వెనుకదిగేవి.) న్నవి. 5,00,000 విమాన కాల్బలసైన్యాలున్నవి. జర్మనుసైన్యంలో 1,500 కలిగిన ఒక దండు మాత్రమే ఉన్నది. మొట్టమొదటి జర్మను పారచూట్ సైనికులదళం 1938 అక్టోబరులో నిర్మించబడింది".

"ఎఱ్ఱసైన్యాలకున్న టాంకుల, మిలిటరీ మోటార్ల, నిర్మాణ సౌకర్యాలకు అంతులేదు. సోవియట్ వ్యవసాయంకోసం ఉపయోగించే ట్రాక్టర్లను నిర్మించే యంత్రాలయాలను టాంకుల ఉత్పత్తికి వినియోగించడానికి యెంతో మార్పు అవసరంలేదు. టాంకులు అంటే ప్రత్యేకంగా నిర్మించబడి, ఆయుధాలతో అమర్చబడిన ట్రాక్టర్లే. 1937 సంవత్సరములో సోవియట్ సంయుక్తరాష్ట్రం 1,76,000 ట్రాక్టర్లను నిర్మించింది. 1938లో 4,50,000 ట్రాక్టర్లుఉపయోగంలో ఉన్నవి."

"ఆయుధాలశ్రేష్ఠత చాలా అవసరమైనది. విదేశాల నిపుణుల అభిప్రాయాల ననుసరించి ఎఱ్ఱసైన్యపు ఆర్టిలరీ చాలా ఉన్నతస్థానం వహించుతూంది............ముఖ్యమైన 3 రకాలఫిరంగులవిషయం పరిశీలించుదాం. 76 మిల్లిమీటర్ల బరువుగల సోవియట్ ఫిరంగులు 13 కిలోమీటర్ల లేక 9 మైళ్ళ దూరం గుండ్లు విసురుతవి. 77 మిలి

మీటర్ల జర్మను ఫిరంగులు 11 కిలో మీటర్ల లేక 7 మైళ్లు దూరం మాత్రమే గుండ్లువిసరగలవు............37 మిలిమీటర్ల సొవియట్ టాంకు విధ్వంసకఫిరంగి, బ్రిటిష్‌వారి 47 మిలిమీటర్లటాంకు విధ్వంసక ఫిరంగి (వికర్స్) కంటె హెచ్చుదూరంగుండ్లు విసరగలదు. సొవియట్ 105 మిలిమీటర్ల విమానవిధ్వంసకఫిరంగి యూరప్‌లో యే యితర విమానవ్యతిరేకఫిరంగికంటేకూడా హెచ్చుదూరం కాల్చగల్గుతుంది."

"మోటారైజేషన్‌లో ఎఱ్ఱసైన్య ఫిరంగిదళం ప్రధానస్థలం ఆక్రమించింది. బరువుఫిరంగులు, టాంకు విధ్వంసకఫిరంగులు, విమాన వ్యతిరేక ఫిరంగులు అన్నీ పూర్తిగా మోటార్లపై నిర్మించబడ్డవి."

1938

	పూర్తి-సగంశిక్షణ పొందిన సైనికులు	స్థిరసైన్యంలో శిక్షణపొందిన మొదటిరకం
జర్మనీ	44, 50, 000	10, 00, 000
సొవియట్	2, 30, 00, 000	23, 00, 000

"ఎఱ్ఱసైన్యం కేవలం ఒక సైనికసాధనం మాత్రమే కాదు. అది మహోన్నతమైన సంస్థ. అది ఒక విశ్వవిద్యాలయం. ఒక రాజకీయ సంస్థ. ప్రపంచంలోని యే యితర సైన్యం విద్యకు యింత ప్రాముఖ్యత నివ్వలేదు. ఎఱ్ఱసైన్యం తన సైనికులందరి విజ్ఞానాన్ని వృద్ధిచేసే ఒక విద్యాలయం వంటిది. ఎఱ్ఱసైన్యం ఆధిపత్యాన అసంఖ్యాకంగా విద్యాలయాలున్నవి. 2,000 పైగా గ్రంథాలయాలున్నవి. ప్రతి సైనికుడు ప్రాచీన సాహిత్యంలోను, నవ్య సాహిత్యంలోను కొంత సామాన్య జ్ఞానం కలిగివుంటాడు. ఫ్రెంచి మిలిటరీ నిపుణుడు బిడో "సామాన్య ఎఱ్ఱసైనికుడు విద్యాశిక్షణంలో జర్మన్ నాన్-కమీషన్డ్ ఆఫీసరుతో సరితూగుతాడు" అని వ్రాశాడు."

ప్రస్తుతం

	ఇటలీ	జర్మనీ	సొవియట్
విమానాలు	1,500	30,000	60,000
టాంకులు	1,000	20,000	40,000
మిలిటరీ ట్రాక్టర్లు	—	—	5,00,000
శిక్షణపొందిన సైనికులు		50,00,000	1,30,00,000

ఇటాలియన్ టాంకులన్నిటిలోకి బరు వెక్కువున్నది 8 టన్నులదే బరు వెక్కువున్న సొవియట్ టాంకు 100 టన్నులది. సొవియట్ విమానాలకు, ఇటలీ విమానాలకు హస్తి మశకాంతరమున్నది.

జపాను సంవత్సరానికి 3,000 టాంకులుకంటే ఎక్కువ నిర్మించలేదు. ఒక్కమారు యుద్ధరంగంలోకి 1,000 టాంకులకంటె యెక్కువ వుంచలేదు. సంవత్సరానికి 6,000 కంటే ఎక్కువ విమానాల తయారుచేయలేదు. యుద్ధరంగంలో 1,000 కంటే ఎక్కువ విమానాల ఉంచలేదు. 1939లో జపానుసైన్యం, ట్రైన్డ్ రిజర్వులు 25,00,000 రెగ్యులర్స్ 3, 20, 000 వుంటుంది. అంటే సొవియట్ ట్రైన్డ్ రిజర్వులో 5 వ వంతన్నమాట. ఇప్పటికే జపాను చైనాలో 12 లక్షలసైన్యాన్ని పోగొట్టుకుంది. సొవియట్ బరువుటాంకులు 100 టన్నులువుంటే జపానులో యెక్కువ బరువుటాంకు 14 టన్నుల కెక్కువుండదు.

నౌకాబలం: నల్లసముద్రములో:— 40 ఆధునిక సబ్మెరైనులు.

1 పెద్దయుద్ధనావ—'పారిస్ కమ్యూన్' అన్న పేరుగలిగినది. 12 అంగుళాల తుపాకులుగలది.

4 క్రూయిజర్లు. 7 అంగుళాల తుపాకులు గలవి.

19 డిస్ట్రాయర్లు 5 అంగుళముల తుపాకులు గలవి.

సొవియట్-జర్మను యుద్ధారంభమయినతర్వాత సొవియట్ 4 కొత్త యుద్ధనావల నిర్మించింది.

8. గ్రామజీవనం

ప్రపంచంలో ఏ యితరదేశంలోని వ్యవసాయముకూడా సొవియట్‌లోలాగా సక్రమంగా వృద్ధిపరుపబడడంలేదు. వ్యవసాయం యింత పెద్దెత్తున ఏ యితరదేశంలో జరుపబడడంలేదు. ఏ యితరదేశంలోనూ యింత యంత్రసామగ్రిని వ్యవసాయానికి వుపయోగించడంలేదు. 1940లో సమిష్టి వ్యవసాయక్షేత్రాలసంఖ్య 2,42,000. వీటి సగటు విస్తీర్ణం 3,700 ఎకరాలు. రాష్ట్రాల ప్రభుత్వాలు తమ యాజమాన్యమున కొన్ని క్షేత్రాలు సాగుచేస్తూన్నవి. వీటిని ప్రభుత్వ వ్యవసాయకేంద్రాలు అంటారు. ఈ కేంద్రాలక్రింద, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలక్రింద కలిసి సాగుబడియగుచున్న విస్తీర్ణం, మొత్తం సాగయ్యే భూమిలో 100కి 99 పాళ్ళుంటుంది. 1939వ సం॥లో సాగుచేయబడ్డ భూమిమొత్తం విస్తీర్ణం 33,42,00,000 ఎకరాలు. జారుప్రభువులనాటి రష్యాలో సాగుబడిక్రిందనున్న మొత్తం భూమివిస్తీర్ణం 26,20,00,000 ఎకరాలు మాత్రమే. ప్రస్తుతం 4,000 పైగా ప్రభుత్వ వ్యవసాయ కేంద్రాలున్నవి. వీటి సగటు విస్తీర్ణం 30,000 ఎకరాలు. ఈ కేంద్రాలు, పరిశ్రమలలాగే రాష్ట్రానికి గావలసిన వ్యవసాయ ఫలితాల నుత్పత్తిచేసి సరఫరా చేస్తున్నవి. ఇందునిమిత్తం, అనేకమంది శ్రామికులను, నిపుణులను, చుట్టుపక్కల గ్రామాలనుంచి రప్పించి నియమించుచున్నవి.

సమిష్టివ్యవసాయక్షేత్రాలకు వ్యవసాయపు పనిముట్లను, యంత్రాలను, సరఫరాచేయను యంత్రోత్పత్తి స్థానాలు 6,500 వున్నవి. వీనిలో 15,00,000 మరనాగళ్ళు నడుపగల నిపుణులు, యితర యంత్రాల నడుపగలవారు కొన్ని వేలమంది, మెకానికుల్లు మరికొన్ని వేలమంది పని చేస్తున్నారు. ఈ శ్రామికు లందరికి స. వ్య. క్షేత్రాలనుండి ధాన్యరూపంగానే ప్రతిఫల మివ్వబడుచున్నది. ద్రవ్య రూపంగా గాకుండా ధాన్యరూపంగానే తమ శ్రమకు ప్రతి ఫలం లభించడంచేత యీ శ్రామికులెక్కువ శ్రద్ధతో పాటు పడుచున్నారు. ఫలితాలు రానురాను హెచ్చుగుచున్నవి.

ప్రస్తుతం సోవియట్ పొలాల్లో పనిచేస్తూన్న మర నాగళ్లు మొత్తం షుమారు 6,00,000. వీటిని అమెరికాలోని 15,00,000 మరనాగళ్ళతో పోల్చుటకు వీలులేదు. విప్లవానికి పూర్వం రష్యాలో నున్న 500 మరనాగళ్ళతో వీటిని పోలిస్తేనేగాని సోవియట్ యీ పాతికేండ్లలో చేసిన ఘనకార్య మేమిటో బోధపడదు. ఇంతే గాదు, సోవియట్ అధికారం రష్యాలో ప్రబలినపిదప గూడా, పదేండ్లనాడు (1930 లో) యీ మరనాగళ్ళ సంఖ్య 71,000 మాత్రమే. అమెరికాలోని మరనాగళ్లు కొన్ని ఋతువులలో పనిచేస్తవి; కొన్ని ఋతువులలో వాటికి పనే లేదు. సొంతగాని పని పూర్తియైనపిదప అమెరికాలోని మరనాగళ్ళన్నీ నిద్రపోతవి—మళ్ళీ దుక్కి రోజు లొచ్చిందాకా. సోవియట్‌లో అలా కాదు. భూమిని సాగుచేయడం సమిష్టి వ్యవసాయక్షేత్రాల విధి గనుక,

ఒకటి వెనుక నొకటిగా యేదో ఒక క్షేత్రం సాగుబడిక్రింద వుంటూనే వుంటుంది. మరనాగళ్ళ కెన్నడూ విశ్రాంతి వుండదు. ఏ ఒక్క ఋతువును లెక్కకు తీసుకున్నా, సోవియట్ మరనాగలి, అమెరికను మరనాగలికంటే చాలా యెక్కువపని జేస్తుంది. దీనికి కారణం సోవియట్‌లోని సమిష్టి వ్యవసాయపద్ధతే. అమెరికాలో లాగా రష్యాలో ఉత్పత్తి సాధనాలు వ్యక్తుల ఆస్థిపాస్థులు కావుగనుక సోవియట్ అమెరికా కంటే అన్ని విషయాల్లో ముందంజవేయగలిగింది. సోవియట్ మరనాగళ్లు రాత్రులలో గూడా పని జేస్తవి. అందుకనే మరనాగళ్లు నెత్తిన, మన రైల్వేయింజన్ల నెత్తిన వున్నట్లు పెద్ద దీపా లున్నవి. నడిపేవారు మారుతుంటారేకాని యీ నాగళ్ళకు విశ్రాంతి లేదు.

సోవియట్‌లో, రాత్రికాలంలో చేలో కెళ్ళామంటే, దుక్కిరోజుల్లో, యెటు జూచినా రైలుయింజన్లు పరుగిడుచున్నట్లు మరనాగళ్లు పరుగెత్తుతుంటవి. మనదేశంలో యింజన్ల నెత్తిదీపాలకంటే యీ మరనాగళ్ళ దీపాలు యెంతో యెక్కువ ప్రకాశవంతంగా ఉంటవి. మొదట మరనాగళ్ళను 1925 లో ఉత్తర కాక్‌సస్‌లో ఉపయోగానికి దెచ్చారు. సోవియట్‌గ్రామాల్లో — రష్యనుగ్రామాల్లోకి మరనాగళ్లు రావడాని కిదే మొదలు — వ్యవసాయాని కత్యధికంగా యంత్రాల నుపయోగించడంవల్ల, పూర్వం వ్యవసాయకూలీలుగా నున్నవారిలో 5 దింట 4 పాళ్ళ జనాన్ని యిప్పుడు పరిశ్రమలలో పాటుబడను పంప వీలైంది. ఈ శ్రామికులలో

చాలామంది గ్రామాల్లోనే, క్రొత్తపరిశ్రమలలో పని జేస్తున్నారు. కొంతమంది సోవియట్ ఘనపరిశ్రమలలోను, సోవియట్ రక్షణశాఖలోనుపనిజేస్తున్నారు. ప్రపంచమంతటా రానురాను యుద్ధభయం యెక్కువవడంమూలాన సోవియట్ స్వసంరక్షణార్థం యెక్కువజనాన్ని ఉపయోగింపక తప్పింది కాదు. వ్యక్తిగత వ్యవసాయంలోకంటే సముదాయక్షేత్రాల్లో నిశ్రామికులు, సగటున మూడింతలెక్కువ పనిజేస్తున్నారు. యంత్రాల నెక్కువగా ఉపయోగించడమే యిందుకుకారణం.

యంత్రాభివృద్ధితోపాటు గ్రామాలకు సౌఖ్యంగూడా వచ్చింది. జారులనాటి రష్యాలోపన్నులు, రుసుములు, బాడుగలు, శిస్తు మొదలైనవి రైతుల ఆదాయంలో నాలుగో పాలును మింగేవి. మిగత మూడుపాళ్లు వడ్డీక్రింద, పాత బాకీలు చెల్లించను సరిపోయేవి. అందుకనే ఆరోజుల్లో రైతులు కూటికిలేక చచ్చేవారు. ద్వితీయపంచ వర్షప్రణాళిక ఆఖరుసంవత్సరంలో, సమిష్టి వ్యవసాయక్షేత్రాల రైతుల చెల్లింపులు, పన్నులు, రుసుములు అన్నీకలిసి వారిమొత్తం ఆదాయంలో 100 కి 3 పాళ్లు మాత్రమే అయినవి. సోవియట్‌లో భూమిపన్ను—శిస్తు—లేదు. లేనేలేదు. సమిష్టి వ్యవసాయక్షేత్రాల రైతులకు శాశ్వతానుభవానికే భూములివ్వబడ్డవి.

సమిష్టి వ్యవసాయక్షేత్రా లన్నిటి ఆదాయమొత్తం, 1932 లో రూ 685,20,00,000. ఈ ఆదాయమే 1939 లో రూ 2,819,70,00,000. ఇందులోనుంచి కొంత, క్రొత్తవ్యవ

సాయ సామగ్రిని కొనడానికి, పాతపనిముట్లను - యంత్రా లను మరమ్మతుచేయడానికి, యితర వ్యవసాయనిర్మాణ కార్యక్రమానికి, విద్యావ్యాసంగానికి, మూలధనంకింద కొంత దాచడానికి, భీమాకర్చులకి ప్రత్యేకింపబడుతూంది. మిగతా ఆదాయమంతా సమిష్టి వ్యవసాయక్షేత్రాల రైతులకు వారి కష్టంజేసినరోజుల లెఖ్ఖను పంచిపెట్టబడుతుంది. 1938 లో సాలుకష్టానికి ప్రతికుటుంబం రొఖ్ఖరూపంగా రూ 9,000 ను పొందింది. కేవలం రొఖ్ఖంలెక్కయిది. ఇదిగాక, ధాన్య రూపంగా వారికి వేరే చాలాజమయైనది. ఇవన్నీగాకుండా, వారు తమసొంత భూముల్లోని ఆదాయాన్ని—అదినిజంగా బహుస్వల్పము, తాముపెంచు పశువులవలన వచ్చే ఆదా యాన్ని, తామే అనుభవిస్తున్నారు. వీటన్నిటితోబాక, కొన్ని ఋతువులలో పొలాల్లో పని లేనప్పుడు యీరైతులు తమ చేలదగ్గరనున్న పరిశ్రమలలో కూలీపనిజేసి వేరే సంపాదించుకుంటూరు. ఈ కుటుంబాల సభ్యులందరూ సమిష్టి వ్యవసాయక్షేత్రాలలోనే పనిజేయడంలేదు. ప్రతి కుటుంబంలోనుంచి కొంతమంది యెక్కువ లాభకరమైన ఉద్యోగాలు దొరికితే శాశ్వతంగా పట్నాలలోనే వుండి నౌకరీలోనో, కూలీనాలీ జేసుకుంటూనో తమ కుటుంబా దాయాన్ని హెచ్చిస్తూవున్నారు. ఈలాంటి వ్యక్తులు, కుటుం బాలు వేనవే లున్నవి యీ రోజున సొవియట్‌లో. సమిష్టి వ్యవసాయక్షేత్రాల రైతు చెల్లించవలసిన బాకీలు లేవు; ఆడుమానా లసలే లేవు. ఇతన్ను తన బొడ్డులోని మూటను

విప్పి కొనవలసిన పనిముట్లు లేవు. తాను తన సంపాద్యంతో పోషించాలసిన వితంతు నాయనమ్మలు, అమ్మమ్మలు, మేనత్తలు, బాలవితంతువులైన కూతుళ్లు, కొత్తగా తాడు తెంచిన కోడండ్రు, అంతకన్నా లేరు. వైద్యులకని కాణీ ఖర్చుపెట్ట నక్కరలేదు. తన సాలుఆదాయమైన రూ 9,000 తో—యిది 1939 మాట. 1941 కి యీ ఆదాయం తప్పకుండా హెచ్చి వుండాలి—సంగీతవాయిద్యాలను; సిల్కుబట్టలను, కెమేరాలను, సైకిళ్ళను, అందమైన పింగాణీకంచాలను—కప్పులను, అలారంగడియారాలను, యిత్తడిమంచాలను, మెత్తటిపరుపులను, రేడియోలను తదితర భోగవస్తువులను కొంటున్నారు—ఉపయోగిస్తున్నారు. జారులనాటి గ్రామాల్లోని జనబాహుళ్యం యిట్టి భోగవస్తువులను, విని, కని యెరుగదు.

1932 నుంచి 1938 లోగా గ్రామా లుపయోగించిన గృహసామగ్రి, బట్టలు మొదలైనవాటి అమ్మకం 100 కి 100 యింతలు పెరిగింది. పుస్తకాలు, సంగీతవాయిద్యాలు మొదలైనవాటి—విద్యాభివృద్ధికి తోడ్పడు వస్తువులు —అమ్మకం 100 కి 500 పాళ్లు పెరిగింది.

లెనిన్ ఉద్దేశాల ననుసరించి, స్టాలిన్ నాయకత్వం కింద వ్యవసాయాభివృద్ధికి చేస్తున్న ప్రయత్నా లన్నీ ముందుగా పరీక్షింపబడి, రైతులు మనస్ఫూర్తిగా నంగీకరించు మార్పులై యున్నవి. ఈ మార్పు లన్నీ, అత్యవసరములని రైతు లొప్పుకొనుటకు కారణం వీటివల్ల రైతులకు గల్గిన లాభమే—అవి సమకూర్చే నూతనలాభాలే.

1930 లో అత్యుత్సాహులైన ఉద్యోగస్థుల విమర్శిస్తూ "జయమువలని తల తిరుగుడు" అన్న శీర్షిక క్రింద, స్టాలిన్ యీ క్రింది విధంగా ఉపన్యసించాడు.

"సోవియట్ సంయుక్తరాష్ట్రంలోని కొన్ని ప్రదేశాల్లో సమిష్టి వ్యవసాయక్షేత్రాలు యింకా నిలకడకోసం సర్వప్రయత్నాలు చేస్తూన్నవి. కానీ, వాటి ప్రయత్నాలు ఫలించక పోవడానికి కారణం వ్యక్తిగతక్షేత్రాలే. మొదటినుంచి వ్యవసాయ సంఘాలను స్థాపించాలనే ప్రయత్నాలు జరుపబడ్డవి. వ్యక్తిగతక్షేత్రాలు పూర్తిగా సమిష్టిక్షేత్రాలు కాలేదు. వారి నివాసాలు, కొద్దిపాటి పశువులు, కోళ్లు మొదలైనవి సమిష్టిక్షేత్రాల లెక్కకు వచ్చినవి. ఇలా కొంతభాగం సమిష్టిక్షేత్రాలకుచేరి, కొంత చేరకుండడం మూలాన చెరుపే యెక్కువగా కలుగుతూంది. సమిష్టిక్షేత్రాల అభివృద్ధికి గావలసిన పరిస్థితు లింతవరకూ యేర్పడడంలేదు. సముదాయ క్షేత్రాల్లో ధాన్యపుసమస్య పరిష్కరింపబడ్డట్టేనని ఎవరన్నా అనుకోవచ్చు. యిక సాధించవలసిందల్లా పశువుల నెలా వృద్ధిపరచడమన్న సమస్య మాత్రమేనని అనుకోవచ్చు. సమిష్టిక్షేత్రాల పేరుతో అందరి ఫలితాలను ఒక్క కుప్పకే చేర్చడంమూలాన లాభం కలగడం యెవరికి? అని యెవరిని వారు ప్రశ్నించుకుంటున్నారు. ఈ బుద్ధిమాలిన దుడుకువల్ల లాభ మెవరికి? అన్నప్రశ్నగూడా చాలామందికి తోస్తుంది. తన నివాసాన్ని, పశువులను, కోళ్లు మొదలైన పెంపుడు జంతువులను సమిష్టిపరిచి, సమిష్టి వ్యవసాయఫలితమైన పంటను సంఘపరం చేయకపోవడంచేత యీ రైతుకు కోపం వచ్చింది. మరోవైపు వ్యక్తిగత వ్యవసాయం జరుగుతూనేవుంది. అందుకనే మన మిత్రులకు మనమీద కోపం, మన శత్రువులకు ఆనందం హెచ్చుచున్నవి. సమిష్టిక్షేత్రాలు అతిత్వరలో స్థాపించాలన్న ఉద్దేశంతో

ఒక ఉద్యోగి, వ్యక్తిగతక్షేత్రాల కిలా ఉత్తరు విచ్చాడు— "మూడు రోజుల్లోగా ప్రతి కోడి, ప్రతి బాతు రిజిష్టరుచేయబడాలి. వీటిని రిజిష్టరుచేయడానికి, తనిఖీచేయడానికి ప్రత్యేక ఉద్యోగస్థులు నియమింపబడాలి. వ్యక్తిగతక్షేత్రాల్లోని ముఖ్య హోదాలను మనం వశపరచుకోవాలి. తద్వారా తమ స్థానాలను వదలకుండా సామ్య వాద పోరాటాన్ని సాగించాలి".— ఈతని ఉద్దేశ్యం వెంటనే వ్యక్తిగతక్షేత్రాల కుతిక పిసకాలని. ఇట్టి చర్య నేమనాలి? సమిష్టి క్షేత్రాలు పెంపొందించేవిధాన మని అనాలా? లేక, సమిష్టిక్షేత్రాల ధ్వంసంజేసి అపకీర్తిపాలు జేసేవిధాన మనాలా?

వ్యవసాయంలో మూలసమస్య ధాన్యం. ఈ సమస్యను పరిష్కరించడానికి ఉత్తమమైన నిర్మాణం వ్యవసాయ సంఘాలు. వీటినే రష్యాలో కొలోజ్ అంటారు. ఈ సంఘాలు సామ్యవాద ఆర్థికవిధానాన్ని అనుసరిస్తవి. గొప్ప ఉత్పత్తిసాధనా లన్నింటిలో సామ్యవాదసిద్ధాంతమే అనుసరింపబడుతూ వున్నది. కూలీలు పుచ్చుకునే విషయంలో గూడా సామ్యవాదభాగత్వమే. దీనికి కొన్ని తాత్కాలిక స్వభావా లున్నవి. ఇంతకుముం దెన్నడూ రష్యాలో వ్యవసాయానికి యంత్రసామగ్రి నుపయోగించి యెరుగరు. అటు వంటిది, యిప్పుడు కొత్తగా వ్యవసాయాన్ని పూర్తిగా యంత్ర పరం చేయాలంటే, ఒక్కమారుగా చేయడం అసాధ్యం. అందులో, సోవియట్ సంయుక్తరాష్ట్రంలాంటి పెద్దదేశంలో, రష్యాలాంటి వ్యవసాయక దేశంలో ఒక్కమారు యీమార్పు తేవడం అసాధ్యం. ఈ మార్పు తేవడంతోపాటు రైతు లందరి అవసరాలను యథావిధి గమనించవలసి ఉంటుంది.

కొత్తగా సమిష్టి క్షేత్రాలైన భూములు, వ్యవసాయానికి మానవ జీవితానికి ప్రాణమైన ధాన్యం పండించడంలో సామ్య వాద సిద్ధాంతాల నాచరణయందుంచి రైతుల సొంత అక్కర లను తృప్తిపరచే ప్రయత్నాలు చేయవలసి వచ్చింది. ఈ ద్వంద్వత్వం ఒక్క-మార్గాన్నే సాధింపబడ్డది. (ఈ ద్వంద్వత్వం వ్యక్తిగత - సాంఘిక అవసరాల తృప్తిపరచాలన్న సమస్యే) ఈ విధానాన్నే సమిష్టి వ్యవసాయవిధానమంటారు. దీని ప్రకారం ప్రతి సమిష్టి వ్యవసాయక్షేత్ర కుటుంబము, ప్రత్యే కంగా కొంత తోటను పెంచుకోవచ్చు. కొన్ని పశువులను పెంచుకోవచ్చు. కోళ్ళు, బాతులు మొదలైన ఆహార జంతు వుల కొన్నిటిని పెంచుకోవచ్చు. ఈ విధంగా, వారి తక్షణ భోజన సమస్యకొంతవరకు పరిష్కరింపబడుతుంది. వీనిలోని ఫలితాలను రైతులే అమ్ముకోవచ్చు. ఆ ఆదాయంతో మరి కొన్ని అవసరాలు తృప్తి పరచుకోవచ్చు.

సోవియట్ వ్యవసాయపద్ధతియొక్క ఆశయం వ్యవ సాయ ఉత్పత్తి విధానాలన్నిట్లోకి అత్యుత్తమమైన సంఘా లను స్థాపించడమే. ఈ ప్రయత్నం సఫలం కావాలంటే వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తిశాఖలన్నీ సంఘపరం గావాలి. సామ్యవాదం యిందులో పూర్తిగా రావాలి. అట్టి అవకాశం కలగాలంటే వివిధ రకాలైన వ్యవసాయ ఫలితాలు సమృద్ధిగా నుండాలి. ప్రతిచేలో నేర్పుతో పనితనంగా పనిజేసేవారుండాలి. అందుకు, ముఖ్యంగా సమిష్టి వ్యవసాయ క్షేత్రాల సభ్యులు తమ మంచిచెడ్డలను తామర్థంచేసుకో

వాలి. మాంసం, పాలు, గుడ్లు, కూరగాయలు, పండ్లు మొదలైనవి ఒకే కేంద్రంనుంచి తెప్పించుకోడం యెంత లాభకరమో ; ప్రతి రయితు ప్రత్యేకంగా కూరగాయలు పండించడం, కోళ్లను పెంచి తద్వారా గుడ్లు ఉపయోగించడం, ఫలవృక్షాల పెంచి కొన్ని యేండ్ల అనంతరం ఆ ఫలితాన్ని బొందడం, గొడ్డుగోదలను తనకు కావలసిన కొద్దిపాటి పాలకోసం పెంచడం ఎంత నష్టకరమో గ్రహించాలి. అందులో, సముదాయాలకు తాము జేసే చాకిరీ చేస్తూ, ఆ కష్టంతో బాటు యీ సొంతపనులన్నీ జేసుకోవాలంటే యెంతశ్రమో, యెంత కాలయాపనమో వారే తెలుసుకోవాలి. ఈ సమిష్టి కృషిక్షేత్రాల అభివృద్ధి సహజం, సంభవంగూడాను. ఎవరూ త్వరపెట్టవలసిన అవసరం లేదు. ఇష్టపడని రయితులను, సిద్ధపడనివారిని సమిష్టి క్షేత్రాల్లో చేరమని బలవంతపరచడం యెవ్వరికి యిష్టంలేదు.

గడచిన కొద్ది సంవత్సరాల్లోగూడా సమిష్టిక్షేత్రాల అభివృద్ధి సాఫీగా జరుగలేదు, వ్యక్తి వ్యవసాయంలో నిబంధనలు చాలా ఉదారవంతంగా జేయబడ్డవి. వ్యక్తులు యెక్కువ భూమిని, యెక్కువ పశువులను తమ సొంత ఉపయోగానికి ఉపయోగించుకొనవచ్చునని అనుమతి యివ్వబడినది. కాని ప్రజలీ ఉదార స్వభావాన్ని దుర్వినియోగం జేశారు. వ్యక్తిగత వ్యవసాయ విధాన నిబంధనలకు కేవలం విరుద్ధంగా, 1939 వ సం॥లో కొన్ని వేనవేలు యెకరాల భూమిని, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలతో కలియకుండా — సంఘోప

యోగానికి రాక— వ్యక్తులు కేవలం తమ స్వార్థాని కుప యోగించుకోను నిల్పుకున్నారు. సమిష్టిక్షేత్రాలకంటే తమ సొంత భూములకు రైతు లెక్కువ సమయాన్ని వెచ్చించిన నిదర్శనా లెన్నో ఉన్నవి. 1939 వ సం॥ మే నెలలో ప్రభుత్వం ఒక ఉత్తరువు జేసింది. ఈ ఉత్తరువు పేరు—

> "సమిష్టిక్షేత్రాల సామాజక భూములు దుబారు చేయబడకుండా రక్షింపబడడానికి ఉపాయాలు."

సమిష్టిక్షేత్రాల్లో కలపబడకుండా, అన్యాయంగాదూరంచేయబడి వ్యక్తులస్వాధీనంలోనున్న పొలాలు ఈ ఉత్తర్వులనంతరం సమిష్టిక్షేత్రాల కివ్వబడుచున్నవి. అప్పటినుంచీ, సమిష్టిక్షేత్రాల్లో సేద్యంగూడా నియమంగా చేయబడుతూంది. సమిష్టి ఉత్పత్తిలో పాల్గొననివారి సంఖ్య సగానికి సగం తగ్గించ బడ్డది. ఇప్పుడు వారి సంఖ్య 100 కి $3\frac{1}{2}$ మాత్రమే.

మొన్న మొన్నటిదాకా, ప్రతి సముదాయ క్షేత్రం, సరాసరి, యెంతధాన్యం ప్రభుత్వానికి అమ్మాలి? యెన్ని పశువుల నమ్మాలి? అన్న నిర్ధారణ ప్రతిక్షేత్రం పంపేనిర్ణయాలపై ఆధారపడి ఉండేది. ఈ అలవాటువల్ల, అనుభవంలో, చాలా నష్టం కలిగింది. ఎక్కువ అభివృద్ధిని ఉత్పత్తిలో చూపుతూ, అగ్ర గాములుగానున్న క్షేత్రాలే యెక్కువగా కష్టపడవలసివచ్చింది. వెనకబడివున్న క్షేత్రాలు, అభివృద్ధిని తేవడానికి యే విధమైన ప్రయత్నం చేయక, కనీస నిర్ణయాలనే అందించ మొదలెట్టినవి. శాఖలను స్థాపించ ప్రయత్నించినవికావు. నూతనంగా ప్రభుత్వం మరొక ఆజ్ఞను అమలు

లోకి తెచ్చింది. ఈ ఆజ్ఞానుసారం, యేక్షేత్రం యెంత ప్రభుత్వానికి చెల్లించాలెనన్న సమస్య, ఆ క్షేత్రంయొక్క విస్తీర్ణాన్నీ, భూమియొక్క సారాన్నిబట్టి నిర్ణయింపబడుతుంది. దీనికి ఫలితం త్వరలోనే స్పష్టమైంది. క్షేత్రాలన్నీ తమ సాగుబడి విస్తీర్ణాన్ని పెంచినవి. ఎక్కువ భూమిని సాగుబడిచేయ మొదలు బెట్టినవి, వ్యవసాయంతోబాటు కొంత మాంసం, పాలు, ఉన్ని, తోళ్లు మొదలైనవాటి ఉత్పత్తిని గూడా సాగించినవి. పైవస్తువులన్నీ యింతకుమున్ను కేవలం వ్యక్తులు సొంతభూములలో తమస్వలాభం కోసం ఉత్పత్తిజేసే వారు. కొత్తగావచ్చిన మార్పుమూలాన సమిష్టిక్షేత్రాల సభ్యులకు పంచుకోడాని కెక్కువ డబ్బు దొరికింది—పల్లెటూళ్లు యెక్కువ సుఖపడ్డవి. తద్వారా దేశమంతా బాగు పడ్డది.

సాగుబడిలోనున్న భూమి యంతటిలో 100 కి 4 పాళ్లు మాత్రమే ప్రత్యేక వ్యక్తులచేతుల్లోనుంది. దీన్నిబట్టి సమిష్టి ధాన్య ఉత్పత్తి యెంత యెక్కువగా జరుగుచున్నది మన మూహించుకోవచ్చు. పశువుల విషయంలో మాత్రం 1938వ సం॥లో ఎద్దులు, ఆవులు, బర్రెలు, ఎనుబోతులు, మొత్తంలో 100 కి 62 పాళ్లు ప్రత్యేక వ్యక్తుల చేతుల్లో నుండినవి. పందుల్లో 100 కి 66 పాళ్లు మేకలు, గొర్రెల్లో 100 కి 53 పాళ్లు వ్యక్తులసొమ్ముగా నుండి పోయినవి 1938 వ సం॥లో. 1939వ సం॥ జూలైలో ప్రభుత్వం యీ క్రింది ఉత్తరువు నిచ్చింది—

"సమిష్టిక్షేత్రాల్లోని సామాజిక పశువుల సంఖ్య నభివృద్ధి పరచడానికి ఉపాయాలు." అన్న శీర్షికక్రింద.

1940 సం॥ ఆరంభంలోగూడా మరో వుత్తరువు చేయబడ్డది: ఈ ఉత్తర్వునుబట్టి ఉన్ని, మాంసం, పశువుల సంఖ్యనుబట్టి గాకుండా, భూమి విస్తీర్ణాన్నిబట్టి ప్రభుత్వానికి చెల్లించవలసిందిగా నిష్కర్షచేయబడింది. ఈ ఉత్తరువు ఫలితంగా సమిష్టి కృషిక్షేత్రాలు కొత్తగా 45,00,000 పశువులను పొందగలిగినవి. 1940 జనవరిలో వ్యక్తులవద్ద నుండే పశువులలో 100కి 46 పాళ్ళు సమిష్టిక్షేత్రాలు కలిగున్నవి. 1938 లో యీసంఖ్య 100కి 37 పాళ్లు మాత్రమే.

ఇనపగుఱ్ఱం:

శాస్త్రీయరీత్యా వ్యవసాయం చేయడంలో సొవియట్ ప్రజలు చాలా ముందుకెళ్లారు. సమిష్టి వ్యవసాయక్షేత్రాలను పెద్దపెద్దవాటిని నిర్మించారు. ఈ క్షేత్రాల్లో వందలమంది జనం పనిచేస్తున్నారు. ఇలాంటి సమిష్టిక్షేత్రాలన్నింటిలోకి పెద్దది 'జయ్‌గాంటిక్' అని పిలువబడుచున్నది. ఈ మాట కర్థం యెంతో పెద్దదని. ప్రపంచంలో నెకడా గోధుమ పండించే క్షేత్రం యింత పెద్దదిలేదు. దక్షిణాన్నుంచి ఉత్తరానికి దీని పొడవు 50 మైళ్ళు. తూర్పునుంచి పడమరకు దీని వైశాల్యం 40 మైళ్ళు. దీనిలో 17,000 మంది పనిజేస్తున్నారు. వ్యవసాయములోని పంటను ప్రోగుజేయను యీ క్షేత్రంలో పెద్ద యంత్రాన్ని ఒకదానిని క్రొత్తగా

ఉపయోగిస్తున్నారు. ఈ ఒక్క యంత్రమే కోత కోస్తుంది, కుప్ప నూరుస్తుంది, చెరుగుతుందిగూడాను. ఈ పనులన్నీ ఒక్కటే యంత్రం జేయడం యెంత ఆదా? గ్రహించండి. దీనిని నడపడానికి ఒక్కమనిషి చాలు. 100 గురు కూలీలు తాము చేతితో నుపయోగించే పరికరాల సహాయంతో చేయగలిగినంతకన్నా యెక్కువపని చేస్తుం దీ యంత్రము. ఇలాంటి యంత్రం ఉపయోగంలోకి రావడం ప్రపంచంలో యిదే మొదలు. గోడలు, కప్పులేవుగాని యీ క్షేత్రంగూడా ఒక ఫ్యాక్టరీ అన్నమాటే. ఈ కొత్తయంత్రాన్ని సొవియట్ ప్రజలు 'యినప గుఱ్ఱం' అంటున్నారు.

ప్రపంచంలో ప్రతిభాగంలో గుఱ్ఱాలు స్వాభావికంగా లేవు. ఆస్ట్రేలియాకు, మెక్సికోకు మొదట మానవుడే గుఱ్ఱాన్ని తెచ్చింది. అడవిగుఱ్ఱాలుకాక, ప్రపంచమంతట గల మచ్చికగుఱ్ఱాల సంఖ్య 11,00,00,000. ఇందులో మూడోవంతుకు పైగా 3,80,00,000 సొవియట్‌లోనే ఉన్నవి.

112

పంచాయితీ గ్రంథాలయము

తుదిపలుకు

ఈ గ్రంథం లెక్కకు 112 పుటలదైనా రష్యనుజీవితాన్ని పూర్తిగా వర్ణింపజాలదు. ఇలాంటి పుస్తకాలు 10 అయినా చాలవు. దినదినాభివృద్ధి నపారంగా పొందుచున్న రష్యనులజీవితాన్ని వర్ణించుటకు యెన్నిగ్రంథాలైనా కావాలి. ఏరోజుకారోజు రష్యనుజీవితంలో పెద్దపెద్దమార్పులు కలుగుతునే ఉన్నవి. అందుకనే ఏగ్రంథమైనాగూడా విపులంగా రష్యనుజీవితాన్ని వర్ణించడం కష్టం. వెబ్బు దంపతులు వ్రాసిన ఉద్గ్రంథం యిప్పటికప్పుడే పాతబడ్డది. జర్మనీ నిష్కారణంగా రష్యాపై దండెత్తడం కారణంగా, పూర్వంలాగా గాక యిప్పుడైనా మనం రష్యానుగురించి తెలుసుకోడం అవసరం. ఈగ్రంథంఅందుకు కొంత తోడ్పడుతుందని నా నమ్మకము.

(1) Soviet Russia To-day—న్యూయార్క్ నగరంనుంచి ప్రచురింపబడు సచిత్రమాసపత్రిక

(2) Russia. By Bernard Pares. Penguin Special No. 81

(3) Parade—లండన్‌నగరంనుంచి ప్రచురింపబడు సచిత్రమాసపత్రిక

(4) Penguin Political Dictionary—Penguin Special No.

(5) U. S. S. R. Under construction — న్యూయార్క్ నగరంనుంచి ప్రచురింపబడు సచిత్రమాసపత్రిక

(6) Russia and Her Neighbours—Arnold Page

(7) 'ప్రజాబంధు' — మదరాసు

(8) 'వాహిని' — మదరాసు

(9) 'కాగడా' — మదరాసు

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA130B170
పుస్తకం పేరు	సోవియట్ రష్యాలో 01
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	113
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	1to6
తయారు చేసినది	Sowmya
పేజీలు విడదీసినది	Sowmya
స్కాన్ చేసినది	S. [illegible]
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good